بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد


وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly **BADAR**
**Qadian**

సంపుటి: 11    www.akhbarbadr.in    సంచిక: 34 - 35

సంపాదకులు: హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్,
ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్.


## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

దైవ ప్రాణుల పట్ల సానుభూతి.

وَ اعۡبُدُوا اللّٰہَ وَ لَا تُشۡرِکُوۡا بِہٖ شَیۡئًا وَّ بِالۡوَالِدَیۡنِ اِحۡسَانًا وَّ بِذِی الۡقُرۡبٰی وَ الۡیَتٰمٰی وَ
الۡمَسٰکِیۡنِ وَ الۡجَارِ ذِی الۡقُرۡبٰی وَ الۡجَارِ الۡجُنُبِ وَ الصَّاحِبِ بِالۡجَنۡۢبِ وَ ابۡنِ السَّبِیۡلِ ۙ وَ مَا
مَلَکَتۡ اَیۡمَانُکُمۡ ؕ اِنَّ اللّٰہَ لَا یُحِبُّ مَنۡ کَانَ مُخۡتَالًا فَخُوۡرَا ۔ (النساء:۳۷)

అనువాదం: “ అల్లాహ్‌ను ఆరాధింపుడు. అతనికి దేనిని సమానంగా చేర్చకుడు. తల్లిదండ్రుల పట్లను, బంధుమిత్రుల పట్లను, అనాథల పట్లను, పేదల పట్లను, బంధువులైన పొరుగు వారి పట్లను, బంధువులుకాని పొరుగువారి పట్లను, మీ సహవాసము నందున్న వారి పట్లను, బాటసారుల పట్లను, మీ ఆధీనమునవున్న వారి పట్లను, మిక్కిలి దయతో ప్రవర్తింపుడు. నిశ్చయముగా అల్లాహ్ గర్వితుని, దాండికునిని ప్రేమించడు. (అన్నిసా: 37)


తేది: 20-27ఆగష్టు 2026 క్రీ, శ. 20-27 జహూర్ 1405 హి, శ. 07-14రబీఉల్ అవ్వల్ 1448 హి,ఖ.




ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు:

## ఓ ఆదమ్ సంతానమా! నేను అనారోగ్యముగా ఉన్నాను, కాని నీవు నన్ను పరామర్శించలేదు.

عَنۡ أَبِي هُرَيۡرَةَ، قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ صَلَّى اللّٰهُ عَلَيۡهِ وَسَلَّمَ: "إِنَّ اللّٰهَ عَزَّ وَجَلَّ يَقُولُ يَوۡمَ الۡقِيَامَةِ: يَا ابۡنَ آدَمَ، مَرِضۡتُ فَلَمۡ تَعُدۡنِي، قَالَ يَا رَبِّ: كَيۡفَ أَعُودُكَ وَأَنۡتَ رَبُّ الۡعَالَمِينَ؟ قَالَ: أَمَا عَلِمۡتَ أَنَّ عَبۡدِي فُلَانًا مَرِضَ فَلَمۡ تَعُدۡهُ؟ أَمَا عَلِمۡتَ أَنَّكَ لَوۡ عُدۡتَهُ لَوَجَدۡتَنِي عِنۡدَهُ؟ يَا ابۡنَ آدَمَ، اسۡتَطۡعَمۡتُكَ فَلَمۡ تُطۡعِمۡنِي، قَالَ يَا رَبِّ: وَكَيۡفَ أُطۡعِمُكَ وَأَنۡتَ رَبُّ الۡعَالَمِينَ؟ قَالَ: أَمَا عَلِمۡتَ أَنَّهُ اسۡتَطۡعَمَكَ عَبۡدِي فُلَانٌ؟ فَلَمۡ تُطۡعِمۡهُ، أَمَا عَلِمۡتَ أَنَّكَ لَوۡ أَطۡعَمۡتَهُ لَوَجَدۡتَ ذَلِكَ عِنۡدِي؟ يَا ابۡنَ آدَمَ، اسۡتَسۡقَيۡتُكَ فَلَمۡ تَسۡقِنِي، قَالَ يَا رَبِّ: كَيۡفَ أَسۡقِيكَ وَأَنۡتَ رَبُّ الۡعَالَمِينَ؟ قَالَ: اسۡتَسۡقَاكَ عَبۡدِي فُلَانٌ، فَلَمۡ تَسۡقِهِ، أَمَا إِنَّكَ لَوۡ سَقَيۡتَهُ وَجَدۡتَ ذَلِكَ عِنۡدِي؟

(مسلم کتاب البر والصلۃ باب فضل عیادۃ المریض)

అనువాదం: హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) ఇలా ఉల్లేఖిస్తున్నారు: ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు: వైభవోపేతుడైన అల్లాహ్ తాలా ప్రళయదినమున ఇలా పలుకుతాడు: “ఓ ఆదమ్ సంతానమా! నేను అనారోగ్యంతో ఉన్నాను, కానీ నువ్వు నన్ను పరామర్శించలేదు.” అప్పుడు ఆ దాసుడు ఇలా అంటాడు: “ఓ నా ప్రభువా! నీవు సమస్త లోకాల ప్రభువైనప్పుడు నేను నిన్ను ఎలా పరామర్శించగలను?” అల్లాహ్ తఆలా ఇలా అంటాడు: “నా ఫలానా సేవకుడు అనారోగ్యంతో ఉన్నాడని నీకు తెలియలేదా? నువ్వు అతనిని పరామర్శించలేదు. నువ్వు అతన్ని పరామర్శించి ఉంటే, అక్కడ నన్నే పొందేవాడివి.” తర్వాత అల్లాహ్ ఇలా అంటాడు: “ఓ ఆదమ్ సంతానమా! నేను నీ నుండి ఆహారం కోరాను, కానీ నువ్వు నాకు ఆహారం ఇవ్వలేదు.” అప్పుడు ఆదమ్ సంతానం ఇలా అంటుంది: “ఓ నా ప్రభువా! నీవు సమస్త లోకాల ప్రభువైనప్పుడు నేను నీకు ఎలా ఆహారం పెట్టగలను?” అల్లాహ్ తఆలా ఇలా అంటాడు: “నా ఫలానా సేవకుడు నిన్ను ఆహారం అడిగాడు. కానీ నువ్వు అతనికి ఆహారం ఇవ్వలేదు. నువ్వు అతనికి ఆహారం ఇచ్చి ఉంటే, దాని ప్రతిఫలాన్ని నా సమక్షంలో పొందేవాడివి.” తర్వాత అల్లాహ్ ఇలా అంటాడు: “ఓ ఆదమ్ సంతానమా! నేను నీ నుండి మంచినీరు కోరాను, కానీ నువ్వు నాకు మంచి నీరు ఇవ్వలేదు.” అప్పుడు ఆదమ్ సంతానం ఇలా అంటుంది: “ఓ నా ప్రభువా! నీవు సమస్త లోకాల ప్రభువైనప్పుడు నేను నీకు ఎలా నీరు తాగించగలను?” అప్పుడు అల్లాహ్ తఆలా ఇలా అంటాడు: “నా ఫలానా సేవకుడు నిన్ను మంచినీరు అడిగాడు. కానీ నువ్వు అతనికి నీరు ఇవ్వలేదు. నువ్వు అతనికి నీరు ఇచ్చి ఉంటే, దాని ప్రతిఫలాన్ని నీవు నా సమక్షంలో పొందేవాడివి.”

**(ముస్లిం కితాబుల్ బిర్రు వ స్వలాత్, బాబ్ ఫజలుల్ ఇయాదతుల్ మరీజ్)**



## మానవజాతి పట్ల సానుభూతిని చూపుము!.

**హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ ( మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని) అలైహిస్సలాతు వస్సలాం ఇలా పేర్కొన్నారు:**“ఈ విషయాన్ని బాగా గుర్తుంచుకోండి. అల్లాహ్ తఆలా యొక్క రెండు ఆజ్ఞలు ఉన్నాయి. మొదటిది: ఆయనతో ఎవరినీ భాగస్వామిగా చేయకండి. ఆయన స్వరూపంలో గానీ, ఆయన గుణాలలో గానీ, ఆయన ఆరాధనలో గానీ. రెండవది: సమస్త మానవజాతిపట్ల సానుభూతి మరియు దయతో వ్యవహరించండి. ‘ఉపకారం’ అనగా కేవలం మీ సోదరులు లేదా బంధువులకే మేలు చేయడం కాదు. అతను ఎవరైనా సరే, ఆదం సంతానానికి చెందినవాడై, అల్లాహ్ ప్రాణులలో ఏ ప్రాణిఅయినా సరే. అతను హిందువా, క్రైస్తవుడా అని ఆలోచించకండి. నేను మీకు సత్యం చెబుతున్నాను: అల్లాహ్ తఆలా న్యాయాన్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు. మీరు స్వయంగా ప్రతీకారం తీర్చుకోవాలని ఆయన కోరుకోవడం లేదు. మీరు ఎంత ఎక్కువ మృదుత్వాన్ని, వినయాన్ని మరియు నమ్రతను అవలంబిస్తారో, అంత ఎక్కువగా అల్లాహ్ తఆలా మీపట్ల సంతోషిస్తాడు. మీ శత్రువులను అల్లాహ్ తఆలాకే అప్పగించండి. అంతిమ దినం సమీపంలో ఉంది. శత్రువులు మీకు కలిగించే బాధల వల్ల మీరు భయపడ కూడదు. మీరు ఇంకా వారి చేత చాలా కష్టాలను అనుభవించ వలసి ఉంటుంది అని నేను చూస్తున్నాను. ఎందుకంటే ఒక వంతెన విరిగిపోతే వరద ఎలా ఉప్పొంగి వస్తుందో అలా నాగరికత పరిమితులను దాటి వెళ్లిపోయిన వారి నాలుక అదుపు లేకుండా మాట్లాడుతుంది. కాబట్టి, ఒక ధార్మికుడు తన నాలుకను అదుపులో ఉంచుకోవాలి.”

**(అల్-హకమ్, 24 జనవరి 1907; మల్ఫూజాత్, సంపుటి 5, పుట 130)**

## సమస్త మానవజాతి మీకు మీ సొంత పిల్లల వలె కనిపించునట్టి, ఉన్నతమైన సద్గుణస్థాయిని పొందాలి.

**హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్, ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహ్ అన్హు సూరహ్ అన్నహల్ సూక్తి 91ని విశదీకరిస్తూ ఇలా పేర్కొన్నారు:**

మానవుడు ఎవరికైన ఉపకారం చేసినప్పుడు, అతని మనసులో సాధారణంగా ‘ఈ వ్యక్తి నాతో మంచిగా వ్యవహరించాడు, కావున నేను కూడ అతనికి మెరుగైన ప్రతిఫలం ఇవ్వాలి, తద్వారా నాకు మంచి పేరు వస్తుంది.’ అనే భావన కల్గుతుంది. లేదా ఒక పాపి చేసిన తప్పును క్షమించేటప్పుడు కూడా, ‘నేను అతనితో మంచిగా ప్రవర్తిస్తే, అతని హృదయంలోని ద్వేషం తొలగిపోతుంది; అతను నాకు మిత్రుడై, నాకు బలంగా నిలుస్తాడు’ అనే ఆలోచన కలగవచ్చు. కానీ ఒక తల్లి తన బిడ్డను ప్రేమించి, అతని కోసం త్యాగాలు చేసినప్పుడు, అందులో ప్రతిఫలం పొందాలనే కోరిక కణమంత కూడా ఉండదు. అంతేకాదు, ఆమె ప్రేమకు పునాది ఆమె స్వంత త్యాగమే. ఒక స్త్రీకి సంతానం లేకపోతే, ‘నాకు ఒక కుమారుడు ఉంటే, అతను నన్ను సేవించేవాడు’ అనే ఆలోచన ఆమెకు కలగదు. దానికి బదులుగా,‘నేను అతన్ని పెంచాలి, అతనికి సేవ చేయాలి, అతనికి బట్టలు తొడగాలి, అతనికి వివాహం చేయాలి, అతని పిల్లలను ఆడించాలి, చూసుకోవాలి’ అనే భావంతోనే ఆమె సంతానాన్ని కోరుకుంటుంది. సారాంశంగా చెప్పాలంటే, సంతానం కావాలనే కోరిక కలిగినప్పుడు, తల్లి హృదయంలో వారి నుంచి సేవ పొందాలనే అతి స్వల్పమైన భావన కూడా ఉండదు. దానికిభిన్నముగా, వారికే సేవ చేయాలనే తపనయే ఆ కోరికకు మూలం. ఇదే మానవునికి అత్యున్నతమైన సద్గుణం. దీనిని పొందిన తరువాతే అతని నైతిక వ్యక్తిత్వం సంపూర్ణమవుతుంది. ( **13 వపేజిలో చదవండి**)

**(అహ్మదియ్యా వార్తలు)**

**సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ తాలా కృపతో క్షేమంగా ఉన్నారు. జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్యవంతమైన, చురుకైన, దీర్ఘాయుష్షును ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయ సాధనాలను సమకూర్చు గాకా!, అనుక్షణం హుజూర్‌ను రక్షించుగాకా!, దేవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక!**

***(ఆమీన్).***


జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

لَا اِلٰهَ اِلَّا اللّٰهُ مُحَمَّدٌ رَّسُوْلُ اللّٰهِ

సంపాదకీయం:

# మజ్లిసే ఇర్ఫాన్ ఒక అంతర్జాతీయ్య కార్యక్రమం:

**మజ్లిస్ ఇర్ఫాన్ -- ఒక ప్రపంచవ్యాప్త కార్యక్రమం:-**

దైవానుగ్రహంతో అహ్మదీయా జమాత్ స్థాపించబడిన నాటి నుంచి, జమాత్ సభ్యుల ఆధ్యాత్మిక మరియు నైతిక శిక్షణలో "మజ్లిస్ ఇర్ఫాన్" ఒక కీలక పాత్ర పోషిస్తోంది. ఈ మజ్లిస్ ఇర్ఫాన్ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారి కాలంలో ప్రారంభమైంది. హుజూర్ చేసిన విలువైన ఉపదేశాలను వెంటనే లిఖించే వారు. అనంతరం వాటిని అల్-హకమ్ మరియు బదర్ పత్రికల్లో ప్రచురించే వారు. ఈ మజ్లిస్ ఇర్ఫాన్ ప్రసంగాలు నేడు మల్ఫూజాత్ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) రూపంలో అందుబాటులో ఉన్నాయి. ఆ తరువాత హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అవ్వల్ (రజి), హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సానీ (రజి), హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ సాలిస్ (రజి), మరియు హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబేహ్ (రహిమహుల్లాహ్) వారి కాలాల్లో జరిగిన మజ్లిస్ ఇర్ఫాన్ సమావేశాలు కూడా జమాత్ పత్రికలు, పుస్తకాలు మరియు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచురించబడి అందరికీ అందుబాటులో వచ్చాయి.

ప్రస్తుతం హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ (అయ్యదహుల్లాహు తఆలా) వారి కాలంలో ఈ సమావేశాలు ప్రతి వారం "దిస్ వీక్ విత్ హుజూర్ అన్వర్" అనే పేరుతో ఎం.టి.ఏ. ద్వారా ప్రసారం చేయబడు తున్నాయి. ఇవి సామాజిక మాధ్యమాల్లో కూడా అందుబాటులో ఉన్నాయి.

ప్రతి కాలంలోనూ "మజ్లిస్ ఇర్ఫాన్" జమాత్ సభ్యులకు ఆధ్యాత్మిక, ప్రచార, విద్యా మరియు పరిపాలనా విషయాల్లో ఎంతో విలువైన మార్గదర్శకత్వాన్ని అందించిన కార్యక్రమంగా నిలిచింది. కొన్నిసార్లు రాజకీయ నాయకులు లేదా విద్యావేత్తలు కూడా హుజూర్‌ను కలుసుకుంటారు. అలాంటి సందర్భాల్లో హుజూర్ వారి దేశ పరిస్థితులు, వారి విద్యా రంగం మరియు ప్రపంచంలో పెరుగుతున్న అశాంతిని తొలగించే మార్గాల గురించి వారికి అమూల్యమైన సలహాలు అందిస్తారు. మొత్తంగా ఈ అంతర్జాతీయ కార్యక్రమం వినే ప్రతి ఒక్కరికీ ఉపయోగకరమైన మార్గదర్శక దీపంలా ఉంటుంది.

బదర్ పత్రిక పాఠకులలో ఈ కార్యక్రమంపై ఆసక్తిని పెంపొందించేందుకు, ఉదాహరణగా 2 జనవరి 2026న అమెరికాలోని వర్జీనియా ప్రాంత ఖుద్దామ్‌తో హుజూర్ అన్వర్ నిర్వహించిన సమావేశంలోని ముఖ్యాంశాలను ఇక్కడ అందిస్తున్నాం.

**ప్రశ్న 1: ప్రపంచ విద్యాభ్యాసంతో పాటు జమాత్ పుస్తకాలను ఎలా అధ్యయనం చేయవచ్చు?.**

హుజూర్ సమాధానం: "ఒక రోజులో 24 గంటలు ఉంటాయి. ఒక వ్యక్తి 6 గంటలు నిద్రపోయినా, 2 గంటలు భోజనానికి, 2 గంటలు నమాజులకు, 7 గంటలు విశ్వవిద్యాలయ విద్యకు, ఇంటికి వచ్చాక మరో 2-3 గంటలు చదువుకు కేటాయించినా, ఇంకా 4 గంటలు మిగులుతాయి. ఆ నాలుగు గంటల్లో కనీసం అరగంట సమయాన్ని కూడా కేటాయించలేరా?. మీకు నిజంగా ఆసక్తి ఉంటే సమయం తప్పకుండా దొరుకుతుంది. 'నేను అలసిపోయాను' అని చెప్పడం అంటే ఈ ప్రాపంచిక జీవితం మీ మొదటి ప్రాధాన్యమైందన్న మాట. కాబట్టి మీ జీవితాన్ని క్రమబద్ధంగా నిర్వహించండి. చదువు కోసం కనీసం అరగంట సమయం కేటాయించినా సరిపోతుంది. ఆసక్తి పెరిగిన కొద్దీ మరింత సమయం కూడా కేటాయించ గలుగుతారు."

**ప్రశ్న 2: నేను మౌలానా అతాఉల్లాహ్ కలీమ్ సాహిబ్ గారి మనవడిని. వారి గురించి హుజూర్‌కు గుర్తున్న ఏవైనా జ్ఞాపకాలు ఉంటే చెప్పగలరని మనవి.**

హుజూర్ సమాధానం: "నేను వారితో కలిసి పని చేయలేదు. కానీ నేను చూసిన, విన్న ప్రకారం వారు అత్యంత నిస్వార్థంగా జీవితాన్ని జమాత్ సేవకు అంకితం చేసిన వ్యక్తి. ప్రతిరోజూ తహజ్జుద్ నమాజు చేసి, జమాత్ కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు చేసేవారని నేను విన్నాను. 'నన్ను కూడా మంచి మనిషిగా చేయుము' అని మీరు కూడా అల్లాహ్‌ను ప్రార్థించండి. వారు ఘానాలో సేవ చేసిన రోజుల్లో అక్కడి పరిస్థితులు చాలా కష్టంగా ఉండేవి. అయినప్పటికీ వారు ఎప్పుడూ ఫిర్యాదు చేయలేదు. ఎల్లప్పుడూ చిరునవ్వుతో మాట్లాడేవారు. అందుకే వారు ఆ స్థాయిలో ఉన్నారు. కాబట్టి అల్లాహ్‌పై పూర్తి నమ్మకం, నమాజులు మరియు నిరంతర ప్రార్థనలు చాలా అవసరం."

**ప్రశ్న 3: నేను ప్రాంతీయ నాజిమ్ వకార్-ఎ-అమల్‌గా సేవ చేస్తున్నాను. కొంతమంది ఖుద్దామ్ కష్టమైన పనులు లేదా చేతులు మురికిగా అయ్యే పనులు చేయడానికి ఇష్టపడరు. వారిలో వకార్-ఎ-అమల్ భావనను ఎలా పెంపొందించాలి?**

హుజూర్ సమాధానం: "వకార్-ఎ-అమల్‌కు ఆంగ్లంలో ' డిగ్నిటీ లేబర్' అని పేరు పెట్టారు. ఇందులోనే మీ గౌరవం ఉంది అని వారికి చెప్పండి. దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి జీవితంలోనూ ఇందుకు ఉదాహరణ లభిస్తుంది. ఖందక్ (అహజాబ్) యుద్ధ సమయంలో ప్రవక్త (స)వారు స్వయంగా గోతి తవ్వారు. వారి పొట్టపై కూడా మట్టి పడింది. అలాంటి ఖుద్దామ్‌కు ప్రవక్త(స) గారి ఈ ఆదర్శాన్ని వివరించండి. ఇలా శ్రమదానం చేయడం ద్వారా పుణ్యం కూడా లభిస్తుంది, ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది."

**ప్రశ్న 4: భవిష్యత్తులో నేను డాక్టర్ కావాలనుకుంటున్నాను. విద్యా మరియు వృత్తి పరమైన విజయంతో పాటు, ధర్మంతో మరియు అల్లాహ్‌తో బలమైన సంబంధాన్ని ఎలా కొనసాగించాలో హుజూర్ మార్గదర్శకత్వం చేయండి?.**

హుజూర్ ఇలా అన్నారు: అహ్మదీయులలో ఎంతో మంది వైద్యులు ఉన్నారు. వారు నమాజ్‌ను క్రమంగా ఆచరిస్తారు, తహజ్జుద్ నమాజ్ కూడా చదువుతారు. డాక్టర్ అబ్దుల్ సత్తార్ షా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) కాలంలో ఒక వైద్యుడిగా ఆసుపత్రిలో పనిచేసేవారు. ఆయన హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబేహ్ వారి తాతగారు. (తల్లిగారి తండ్రి) వారు వైద్య సేవలతో పాటు తబ్లీగ్ కూడా (ఇస్లాం సందేశ ప్రచారం) చేసేవారు. ఒకసారి వారు మస్జిద్‌లో తబ్లీగ్ చేస్తుండగా, ఒక ప్రత్యర్థి మట్టి కుండ (లోటా) తీసుకుని వారిపై విసిరాడు. దాంతో వారితలకు గాయం అయింది. వారు ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. ఈ సంఘటన తర్వాత దాడి చేసిన వ్యక్తి చాలా భయపడి క్షమాపణ కోరాడు. అప్పుడు డాక్టర్ అబ్దుల్ సత్తార్ షా గారు ఇలా అన్నారు: "నేను నిన్ను క్షమించాను. ఇప్పుడు నా తబ్లీగ్‌ను విను." ఆ వ్యక్తి ఎంతో ప్రభావితుడయ్యాడు. "నేను వీరిని గాయపరిచాను, అయినా వీరు నన్ను క్షమించి ఎంతో మంచిగా మాట్లాడుతున్నారు. అహ్మదీయత్ తప్పకుండా సత్యమే" అని భావించి, చివరకు బైఅత్ (అహ్మదీయ ముస్లిం జమాత్‌లో చేరిక) చేశాడు. అలాగే మీరు కూడా వైద్యులైన తర్వాత మీ రోగులతో మంచి నడవడికను ప్రదర్శించండి.

హుజూర్‌గారు, హజ్రత్ ఖలీఫా రషీదొద్దీన్ గారి గురించి కూడా ఒక సంఘటన చెప్పారు. వారు బ్రిటిష్ పాలనలో సివిల్ సర్జన్‌గా పనిచేసేవారు. వారు ఆర్థిక త్యాగం కూడ ఎక్కువగా చేసేవారు కాబట్టి, ఒకసారి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారితో, "కొంచెం నియంత్రించండి. మీ కోసం కూడా కొంత ఉంచుకోండి" అని చెప్పారు. అంతేకాక, "మీరు ఇప్పటికే ఇంత ఆర్థిక త్యాగం చేశారు కాబట్టి ఇకపై ఇవ్వకపోయినా ఎలాంటి తేడా ఉండదు" అని కూడా అన్నారు.

అలాగే హుజూర్‌గారు, హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అవ్వల్ (రజియల్లాహు అన్హు) గురించి మాట్లాడుతూ, వారు ఒక హకీమ్ (సాంప్రదాయ వైద్యుడు) అని చెప్పారు. వారు వైద్య వృత్తి ద్వారా సంపాదించిన దానిని ఇస్లాం సేవ కోసం ఖర్చు చేసేవారు. పేదలకు సేవ చేసేవారు, వారిపై దయ చూపేవారు. మీరు కూడా పేదలకు సేవ చేస్తే అల్లాహ్ సంతోషిస్తాడు, అలాగే జమాత్ సేవ కూడా జరుగుతుంది.

**ప్రశ్న: ప్రియమైన హుజూర్! ప్రపంచంలో రాజకీయ అన్యాయానికి వ్యతిరేకంగా ఎలా గొంతెత్తాలి?.**

సమాధానం: మనకు ఎంత వరకు అవకాశం ఉందో అంత వరకు మనం ప్రయత్నిస్తున్నాం. నాకు సాధ్యమైనంత వరకు నేను చేస్తున్నాను. మీకు సాధ్యమైనంత వరకు మీరు కూడా చేస్తూ ఉండండి. నాకు అమెరికాలోని క్యాపిటల్ హిల్ లో మాట్లాడే అవకాశం లభించింది. అక్కడ నేను శాంతి గురించి మాట్లాడాను. తరువాత అక్కడి ఒక సెనెటర్ నాతో, "మీరు చెప్పే విషయాలు చాలా మంచి విషయాలు, అవి అవసరమైనవే కూడా. కానీ మేము వాటిని అమలు చేయలేము" అని అన్నారు.

హుజూర్ చెప్పారు: రాజకీయ నాయకులకు వారి స్వంత రాజకీయ ప్రయోజనాలు ఉంటాయి. వాటి కోసం వారు డబ్బు ఇచ్చి తమకు అనుకూలంగా మాట్లాడించే ప్రయత్నం కూడా చేస్తారు. ఒకవేళ న్యాయం విషయంలో తమకు ఒక ప్రమాణం, ఇతరులకు మరో ప్రమాణం ఉంటే, నిజమైన న్యాయం ఎలా స్థాపించ బడుతుంది? కాబట్టి మీకు సాధ్యమైనంత వరకు మీ చుట్టూ న్యాయం నెలకొనేలా కృషి చేస్తూ ఉండండి.

**ప్రశ్న: కొందరు షియా ముస్లింలు అహ్లే బైత్ (ప్రవక్త కుటుంబ సభ్యులు) మరియు ఆలే రసూల్‌ను ఖిలాఫత్ కంటే గొప్పదిగా భావిస్తారు. దీనిపై హుజూర్ ఏమంటారు?.**

సమాధానం:హుజూర్ ఇలా అన్నారు: వారు ఖిలాఫత్ కంటే మాత్రమే కాదు, నుబువ్వత్ (ప్రవక్తత్వం) కంటే కూడా వారికి ప్రాధాన్యం ఇస్తారు. కొందరు అయితే "జిబ్రీల్ (అలైహిస్సలాం) పొరపాటు చేశారు. వహీ హజ్రత్ అలీ పై అవతరించాల్సింది, కానీ పొరపాటున ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారిపై అవతరించింది" అని కూడా అంటారు.

ఇలాంటి వారు తొలి ముగ్గురు ఖలీఫాలను తప్పు పట్టుతారు. హుజూర్ చెప్పారు: ఈ ప్రశ్నను కలహాలు సృష్టించే వారు లేవనెత్తారు. వారు ఇలా అంటారు: "ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) 'నా అహ్లే బైత్‌కు ప్రాధాన్యం ఇవ్వండి' అని అన్నారు." కానీ ప్రవక్త (స) వారి ఉద్దేశం ఏమిటంటే, "మీరు మీ సన్నిహితుల మాటలను ఎంత శ్రద్ధగా వింటారో, అలాగే నా మాటలను కూడా అంతే శ్రద్ధగా వినండి". అయితే వారు దీనికి తప్పు అర్థం చెబుతున్నారు.

**(14వ పేజీలో చదవండి)**




# జుమా ప్రసంగము

ప్రవక్త (స)వారి ఆడ ఒంటె ఇద్దరు బాలురకు చెందిన స్థలంలో ఆగినప్పుడు, వారు (స) “ఈ స్థలం మనకు అనుకూలంగా ఉంది” అని అన్నారు. ఆ బాలురు ఆ స్థలానికి డబ్బు తీసుకోవడానికి ఇష్టపడక పోయినప్పటికీ, ప్రవక్త (స) ఆ భూమి విలువను వారికి చెల్లించారు. ఆ తరువాత మస్జిద్ నిర్మాణం ప్రారంభమైనప్పుడు, ప్రవక్త (స) ప్రజలతో కలిసి ఇటుకలను మోస్తూ, మస్జిద్ నిర్మాణంలో స్వయంగా శ్రమించారు.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్, వినయం యొక్క నిజమైన స్వరూపాన్ని అర్థం చేసుకునే సామర్థ్యాన్ని మనకు ప్రసాదించుగాకా!. ప్రవక్త (స) వారి ఆశీర్వాదకరమైన ఆదర్శాన్ని ఎల్లప్పుడూ మన ముందుంచుకొని, దాని ప్రకారం జీవించేలా మనలను అనుగ్రహించుగాకా!. ఆమీన్.

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 15 మే 2026 ( 15 హిజ్రత్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

اَشْهَدُ اَنْ لَّا اِلٰهَ اِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَاَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

اَمَّا بَعْدُ فَاَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ -

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ ۙ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

ఈ లోకంలో ఎవరైన పరిపూర్ణమైన మానవుడు అవతరించినచో, అతడు హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లమే అని మనము దృఢంగా విశ్వసిస్తున్నాము. ఆయనకు ముందు ఆయనంత పరిపూర్ణమైన మానవుడు ఎవరూ లేరు, ఆయన తరువాత కూడా అలాంటి వారు ఎవరూ ఉండరు. అల్లాహ్‌కు చెల్లించవలసిన హక్కులను నెరవేర్చడంలో, మానవాళికి చెల్లించవలసిన హక్కులను నెరవేర్చడంలో, ప్రతి ఉన్నతమైన నైతిక గుణాన్ని మరియు ప్రతి శ్రేష్ఠమైన మానవ లక్షణాన్ని ప్రదర్శించడంలో అత్యున్నత ప్రమాణాలన్నీ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి వ్యక్తిత్వంలో సంపూర్ణంగా ప్రతిబింబించాయి. మనం ఏ నైతిక గుణాన్ని పరిశీలించినా, దాని సాధ్యమైన అత్యున్నత స్థాయి వారిలో కనిపిస్తుంది. అటువంటి ప్రమాణాన్ని మరే ఇతర మానవుడు కలిగి ఉండలేదు, ఇప్పుడు కూడా కలిగి లేడు, భవిష్యత్తులో కూడా కలిగి ఉండడు. ఈ ఉన్నతమైన గుణాలు మరియు లక్షణాలలో వినయం, అణకువ కూడా ఉన్నాయి. ఈ గుణాలకు అత్యంత పరిపూర్ణమైన ఉదాహరణ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి జీవితంలో కనిపిస్తుంది. ఒక విశ్వాసి తన జీవితంలో వినయాన్ని శాశ్వతమైన భాగంగా చేసుకోవడానికి ఎల్లప్పుడూ ప్రయత్నించాలని ప్రవక్త (స) తన అనుచరులకు నిరంతరం బోధించారు.

ఈ ఉన్నతమైన నైతిక గుణాన్ని ప్రకటించమని అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్ఆన్‌లో దైవ ప్రవక్త (స)కు ఈ విధంగా ఆదేశించాడు: ఖుల్ ఇన్నమా అనా బషరున్ మ్మిసులుకుమ్ (కఅఫ్:111) అనగా నీవిట్లు ప్రకటించుము: “ నేను మీలాంటి ఒక మానవుడిని మాత్రమే.” అల్లాహ్ తాలా వారికి అంతిమమైన మరియు పరిపూర్ణమైన ధర్మశాస్త్రాన్ని తీసుకువచ్చిన ప్రవక్త హోదాను ప్రసాదించినప్పటికీ, వారు (స) “ నేను ఒక మానవుడిని, వినయశీలుడైన ఒక సేవకుడిని.” అని ప్రకటించమని ఆదేశించబడ్డారు. మొత్తానికి ఈ సందర్భంలో, వివిధ సందర్భాలలో ఈ నైతిక గుణం ఎలా వ్యక్తమైందో చూపించే కొన్ని హదీసులను మరియు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) రచనలలోని కొన్ని భాగాలను నేను ప్రస్తావించుతాను.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇలా పేర్కొన్నారు:

“మన గౌరవనీయ ప్రవక్త (స) కంటే గొప్ప పరిపూర్ణ మానవునికి ఈ లోకంలో మరే ఉదాహరణ లేదు. తీర్పు దినం వరకు కూడా అలాంటి ఉదాహరణ ఉండదు. “ఆ తరువాత గమనించండి, శక్తి మరియు అధికారానికి సంబంధించిన అద్భుతాలు ప్రసాదించబడినప్పటికీ, దైవ ప్రవక్త (స) ఎల్లప్పుడూ అల్లాహ్‌కు సేవకుడిగా ఉండే భావంతోనే జీవించారు. (వారు వినయశీలుడైన మానవుడు, వినయశీలుడైన సేవకుడు.) వారు (స) పదేపదే ఇలా ప్రకటించుకునేవారు: **ఖుల్ ఇన్నమా అనా బషరున్ మ్మిస్‌లుకుమ్** అనగా “నేను మీలాంటి ఒక మానవుడిని మాత్రమే.” “అంతేకాకుండా, అల్లాహ్ ఏకత్వాన్ని ప్రకటించడంలో కూడా వారి సేవకత్వాన్ని అంగీకరించడాన్ని ఒక అనివార్యమైన భాగంగా చేశారు. అది లేకుండా ఒక ముస్లిం ముస్లింగా కూడా కొనసాగలేడు. కావున “లోతుగా ఆలోచించండి; మళ్లీ లోతుగా ఆలోచించండి. పరిపూర్ణ మార్గదర్శకుని స్వీయ జీవన విధానం మనకు ఏమి బోధిస్తుందంటే, అల్లాహ్‌కు అత్యంత సన్నిహితమైన అత్యున్నత స్థాయిని పొందిన తరువాత కూడా వారు (స) తన సేవకత్వాన్ని అంగీకరించడాన్ని ఎన్నడూ విడిచి పెట్టలేదు. అలాంటప్పుడు మరెవరైనా తమ హృదయంలో అలాంటి ఆలోచనలు లేదా భావాలను కలిగి ఉండటం పూర్తిగా వ్యర్థం మరియు అర్థరహితం.”

(రిపోర్ట్ జల్సా సాలానా 1897, పుట 140)

మరల హుజూర్ (అ) ఇలా పేర్కొన్నారు: “వ్యర్థమైన గొప్పలు చెప్పుకోవడం, అహంకారం మరియు గర్వాన్ని నివారించాలి. వినయాన్ని మరియు మర్యాదపూర్వక ప్రవర్తనను అలవరచుకోవాలి. అందరిలోకెల్లా నిజంగా అత్యున్నతులు మరియు అత్యంత గౌరవానికి అర్హులు అయిన దైవ ప్రవక్త (స) వారి వినయం మరియు మర్యాదకు ఒక ఉదాహరణ పవిత్ర ఖుర్ఆన్‌లో కనిపిస్తుంది. “ఒక అంధుడు ప్రవక్త (స) వద్ద ఖుర్ఆన్ నేర్చుకోవడానికి వచ్చేవాడు. ఒక రోజు మక్కా నగరంలోని ప్రముఖులు మరియు నాయకులు ప్రవక్త (స) చుట్టూ సమావేశమై ఉండగా, వారు (స) వారితో సంభాషణలో నిమగ్నమై ఉన్నారు. ఆ సంభాషణలో నిమగ్నమై ఉండటం వలన కొంత ఆలస్యం జరిగింది. దాంతో ఆ అంధుడు లేచి వెళ్లిపోయాడు. ఇది ఒక చిన్న సంఘటనగా కనిపించినప్పటికీ, అల్లాహ్ తాలా దీనికి సంబంధించి ఒక సూరాను అవతరింపజేశాడు. అనంతరం ప్రవక్త (స) ఆయన ఇంటికి వెళ్లి, ఆయనను తిరిగి తీసుకువచ్చి, తన స్వంత పవిత్రమైన చాదరును పరచి, దానిపై ఆయనను కూర్చోబెట్టారు.

“దీనిలోని ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఎవరి హృదయాలలో అల్లాహ్ మహిమ స్థిరంగా ఉంటుందో, వారు తప్పనిసరిగా వినయంతో ఉండాలి మరియు వినయాన్ని ప్రదర్శించాలి. ఎందుకంటే వారు సర్వశక్తిమంతుడైన దేవుని స్వయం సమృద్ధి మరియు పరిపూర్ణత ముందు నిరంతరం వణుకుతూ ఉంటారు.”

(మల్ఫూజాత్, సంపుటి 10, పుట 298, ముద్రణ 2022)

కాబట్టి, ఇది పవిత్ర ఖుర్ఆన్‌లో ప్రస్తావించబడిన ఒక ప్రత్యేక సంఘటన మాత్రమే కాదు. లేదా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెల్పిన సంఘటన మాత్రమే కాదు. నిజానికి ఇది మనకు అందించబడుతున్న ఒక గొప్ప పాఠం. దైవ ప్రవక్త (స) మీకు పరిపూర్ణ ఆదర్శం. మీరు నిజంగా ఆయనను ప్రేమిస్తున్నామని చెప్పుకుంటే, అత్యున్నత స్థాయి వినయం మరియు నమ్రతను సాధించేందుకు మీరు కూడా ప్రయత్నించాలి.

ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక సందర్భంలో, ఒక విశ్వాసికి వినయం యొక్క వాస్తవ స్వరూపాన్ని గ్రహించి, దానిని ఆచరించేలా అతని దృష్టిని ఆకర్షిస్తూ, ఇలా అన్నారు: ఇది హజ్రత్ ఇబ్నే అబ్బాస్ రజి తెల్పిన కథనము. దైవ ప్రవక్త (స) ఇలా తెలిపారు: “ప్రతి మనిషి తలకు రెండు గొలుసులు అనుసంధానించబడి ఉంటాయి. ఒక గొలుసు ఆకాశం వైపు విస్తరించి ఉండగా, మరొకటి భూమి వైపు విస్తరించి ఉంటుంది. ఒక సేవకుడు వినయం మరియు నమ్రతను అవలంబించినప్పుడు, ఆకాశానికి అనుసంధానమైన గొలుసును పట్టుకున్న దేవదూత అతనిని పైకి లేపుతాడు.” మరో మాటలో చెప్పాలంటే, ఒక వ్యక్తి వినయంతో తనను తాను తగ్గించుకున్నప్పుడు, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అతనికి ఉన్నతమైన స్థాయిని ప్రసాదిస్తాడు. “కానీ అతను గర్వం మరియు తిరుగుబాటును అవలంబించినప్పుడు, భూమికి అనుసంధానమైన గొలుసు అతనిని క్రిందికి లాగుతుంది.”

**(అల్ జామిఉ షుఅబిల్ ఈమాన్, లిల్‌బైహఖీ, సంపుటి 10, పేజి 456, హదీసు 7791, మక్తబతుల్ రుష్ద్)**

అహంకారపూరిత వ్యక్తి యొక్క కర్మలు ఇకపై ఆమోదయోగ్యమైనవిగా ఉండవు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దృష్టిలో అతని స్థానం దిగజారిపోతుంది మరియు అతను భూమిపైకి పడద్రోయబడిన వాడవుతాడు.

హజ్రత్ ఇబ్న్ అబ్బాస్ (రజి)గారి మరొక కథనంలో ఇలా పేర్కొనబడింది:

“ఒక సేవకుడు వినయాన్ని అవలంబించినప్పుడు, అల్లాహ్ అతనిని ఏడవ ఆకాశం వరకు ఉన్నత పరుస్తాడు.” (కన్జుల్ ఆమాల్, సంపుటి 2, భాగం 3, పేజి 49, హదీసు 5717, దారుల్ కుతుబుల్–ఇల్మియ్యా, 2004)

అందువల్ల, మనం అల్లాహ్ సాన్నిత్యాన్ని పొందాలని కోరుకుంటే, అందుకు వినయం అత్యంత అవసరమైన గుణాలలో ఒకటి.

హజ్రత్ అబూహురైరా (రజి) ఇలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త (స) ఇలా తెలిపారు: “దానం చేయడం వల్ల సంపద ఏ విధంగానూ తగ్గదు. క్షమించడం ద్వారా అల్లాహ్ ఒక వ్యక్తికి గౌరవాన్ని తప్ప మరేమీ పెంచడు (అంటే, క్షమించడం వ్యక్తి గౌరవాన్ని పెంచుతుంది). మరియు అల్లాహ్ కోసం ఎవరైనా వినయాన్ని అవలంబిస్తే, అల్లాహ్ తప్పకుండా అతని స్థాయిని ఉన్నతపరుస్తాడు.”

(జామిఅ త్తిర్మిజి, అబ్వాబుల్ బిర్రి వస్సిలహ్, హదీసు 2029)

కాబట్టి, ఈ ప్రాథమిక సూత్రాలు ఒక విశ్వాసికి నిర్దేశించబడినవి. దానం చేయడం మరియు ఆర్థిక త్యాగం చేయడం వల్ల సంపద తగ్గదు. నిజానికి అది దానిని పెంచుతుంది. అందువల్ల, ఆర్థిక త్యాగం చేయడం వల్ల మీ సంపద తగ్గిపోతుందనే అపోహను మీ హృదయాల నుండి తొలగించండి. క్షమించడం మరియు ఇతరుల తప్పులను పట్టించుకోకుండా ఉండటం వల్ల మీ గౌరవం తగ్గిపోదు. నిజానికి, అవి మీకు గౌరవాన్ని ప్రసాదిస్తాయి. ప్రజలు నిజంగా ఈ వాస్తవాన్ని

అర్థం చేసుకుంటే, ప్రపంచంలోని అనేక సామాజిక వివాదాలు మరియు ఘర్షణలు పరిష్కరించబడతాయి. మరల ఇలా తెలిపారు: “వినయాన్ని అవలంబించడం ద్వారా అల్లాహ్ తాలా ఒక వ్యక్తిని ఉన్నతపరుస్తాడు.” ఒక వ్యక్తి ఎంత ఎక్కువగా వినయాన్ని పెంపొందించుకుంటాడో, అల్లాహ్ తాలా అతనికి అంత గొప్ప స్థాయిని ప్రసాదిస్తాడు.

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారు స్వయంగా వినయానికి ఎలాంటి ప్రమాణాలను స్థాపించారు?.

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి ఒక వ్యక్తి ప్రవక్త (స)ను ఉద్దేశించి ఇలా అన్నాడు: “ఓ ముహమ్మద్ (స)! ఓ మా నాయకుడా, మా నాయకుని కుమారుడా! మా అందరిలోకెల్లా ఉత్తముడా, మా ఉత్తముని కుమారుడా!” అప్పుడు ప్రవక్త (స) ఇలా అన్నారు: “ప్రజలారా! షైతాన్ మిమ్మల్ని తప్పుదారి పట్టించకుండా ఉండేందుకు, మీ కొరకు ధర్మనిష్ఠను కోరుకోండి. నేను అబ్దుల్లా కుమారుడైన ముహమ్మద్‌ను. నేను అల్లాహ్ సేవకుడిని మరియు ఆయన ప్రవక్తను. నేను అల్లాహ్ ప్రమాణం చేసి చెబుతున్నాను: అల్లాహ్ నాకు ప్రసాదించిన స్థాయికంటే మీరు నన్ను ఉన్నత స్థాయికి చేర్చడం నాకు ఇష్టం లేదు.”

**(మస్నద్ అహ్మద్ బిన్ హన్బల్, సంపుటి 4, పేజి 394, హదీసు 12579, ఆలంఉల్‌కుతుబ్, బీరూట్)**

అల్లాహ్ తాలా వారి ద్వార చేయించిన ప్రకటనను వారు తమ ఆచరణాత్మక ఉదాహరణ ద్వారా కూడా నిరూపించారు.

వారు చూపిన అత్యంత వినయానికి మరో ఉదాహరణ మరొక హదీస్‌లో కనిపిస్తుంది. హజ్రత్ అబూ హురైరా (రజి) ఇలా పేర్కొన్నారు: “నేను దైవ ప్రవక్త (స) ఇలా చెప్పడం విన్నాను: ‘ఏ వ్యక్తి కూడ కేవలం తన ఆచరణల కారణంగా స్వర్గంలో ప్రవేశించడు.’ సహచరులు అడిగారు: “ ఓ అల్లాహ్ ప్రవక్తా! మీరు కూడనా?’ వారు (స) ఇలా సమాధానమిచ్చారు: ‘అల్లాహ్ తన కృప మరియు దయతో నన్ను కప్పివేయకపోతే, నేను కూడా కాదు. కాబట్టి, మీరు చేసే ప్రతి కార్యాన్ని పరిపూర్ణంగా చేయండి మరియు అల్లాహ్ సమీప్యతను పొందాలనే ఉద్దేశంతో చేయండి. మీలో ఎవరూ ఎప్పుడూ మరణాన్ని కోరుకోకండి. ఒక వ్యక్తి సత్పురుషుడైతే, అతను ఇంకా సత్కార్యంలో పురోగమించవచ్చు, ఒకవేళ అతను పాపాత్ముడైతే, బహుశా పశ్చాత్తాపపడి తనను తాను సరిదిద్దుకుని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అసంతృప్తిని తొలగించుకోవచ్చును.”

**(సహీ బుఖారీ, కితాబుల్-మర్జా, బాబ్ తమన్నల్ మర్జుల్ మౌత్ హదీస్ 5673, అనువాదం, సంపుటి 14, పుటలు 45-46,నజారత్-ఎ-ఇషాఅత్)**

మరో కథనంలో హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఇలా పేర్కొన్నారు: “పేదలను మరియు అవసరంలో ఉన్నవారిని ప్రేమించాలి. ఎందుకంటే దైవ ప్రవక్త (స) తమ దుఆలలో ఇలా వేడుకోవడం నేను విన్నాను:

**అల్లాహుమ్మా అహ్‌యినీ మిస్‌కీనన్ వ్వ అమిత్‌నీ మిస్‌కీనన్ వహ్‌షుర్‌నీ ఫీ జుమ్రతిల్ మసాకీన** అనగా ‘ఓ అల్లాహ్! నన్ను పేదవానిగా జీవింపజేయి, పేదవానిగానే మరణింపజేయి, మరియు పేదల సమూహంలో నన్ను లేపు.’”

**(సునన్ ఇబ్న్ మాజా, కితాబ్ అజ్-జుహ్ద్, బాబ్ మజాలిసతుల్ ఫుఖ్‌రా, హదీస్ 4126)**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబీ ఔఫా(రజి) ఇలా ఉల్లేఖించారు: “దైవ ప్రవక్త (స) నిరంతరం అల్లాహ్ స్మరణలో నిమగ్నమై ఉండేవారు మరియు వ్యర్థమైన విషయాలలో పాల్గొనేవారు కాదు. వారు (స) సుదీర్ఘమైన నమాజ్‌లను చేసేవారు, కానీ ఖుత్బాను సంక్షిప్తంగా ఇచ్చేవారు. ఒక వితంతువు లేదా పేద వ్యక్తి పక్కన నడవడం లేదా వారి అవసరాలను తీర్చడం వారికి ఎప్పుడూ తక్కువగా అనిపించేది కాదు.” **(సునన్ అన్నిసాయీ, కితాబుల్-జుముఅహ్, హదీస్ 1415)**

వారి వినయం ఎంత ఉన్నత స్థాయిలో ఉండేదో దీనివల్ల అర్థమవుతుంది. వారి ఆరాధనా ప్రమాణాలు ఎంతో ఉన్నతమైనవే అయినప్పటికీ, వారి వినయం అలాంటిది. తనతో మాట్లాడాలని కోరుకునే ఏ పేద వ్యక్తికైనా లేదా వితంతువుకైనా వారు (స) పూర్తిగా సమయం కేటాయించి, ఓర్పుతో మరియు పూర్తి శ్రద్ధతో వారి మాటలు వినేవారు.

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఇలా ఉల్లేఖించారు: “మదీనాలోని బానిస స్త్రీలలోని ఏ స్త్రీ అయినా కూడా తన సమస్యను పరిష్కరించుకోవడానికి దైవ ప్రవక్త (స) చేతిని పట్టుకుని, ఆయా చోటికి వారిని తీసుకెళ్లగలిగేది.”

**(సహీ-బుఖారీ, కితాబుల్-అదబ్, బాబుల్ కిబర్, అనువాదం, సంపుటి 14, పేజి 489-490, కథనం 6072, నజారత్-ఎ-ఇషాఅత్)**

హజ్రత్ అనస్ (రజి) ఇలా పేర్కొన్నారు: “మందబుద్ధి కల్గిన ఒక స్త్రీ ఇలా చెప్పింది: ‘ఓ అల్లాహ్ ప్రవక్తా! నాకు మీతో ఒక పని ఉంది.’ అందుకు ప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు: ‘ఓ ఫలానా వారి తల్లీ! నీకు ఏ వీధిలో పని ఉన్నా అక్కడికి నన్ను తీసుకెళ్లు; నేను నీకు సహాయం చేస్తాను.’ ఆ తరువాత ఆమె తన సమస్యను చెప్పింది, కావున అది పరిష్కరించబడే వరకు ప్రవక్త (స) ఆమెతో కలిసి ఒక దారిలో నడిచారు.” (సహీ ముస్లిం, కితాబుల్-ఫజాయిల్, అనువాదం, సంపుటి 12, పేజి 235, హదీస్ 4279, నూర్ ఫౌండేషన్)

కొన్ని కథనాలలో ఆ మహిళ పేరు ఉమ్మ్ జుఫర్ అని, ఆమె హజ్రత్ ఖదీజా (రజి) సేవకురాలని పేర్కొనబడింది. ఆమె స్వభావం చాలా సరళమైనది, మరియు బహుశా ఆమెకు కొన్ని విషయాలను అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు ఉండేవి. కొంతమంది వ్యక్తులు విషయాలను సులభంగా అర్థం చేసుకోలేకపోవచ్చు లేదా కొన్ని విషయాలను గ్రహించడంలో ఇబ్బంది పడవచ్చు. నవూజు బిల్లాహ్ ఆమె పూర్తిగా పిచ్చిదని భావించాల్సిన అవసరం లేదు. నిజానికి ఆమె సరళమైన స్వభావం కలిగిన వ్యక్తి. అయినప్పటికీ, దైవ ప్రవక్త (స) ఆమె భావాలను ఎంతో గౌరవించి, శ్రద్ధ చూపారు. **(అల్-కౌకబుల్-వహాజ్ షరహ్, సహీ ముస్లిం, సంపుటి 23, మక్తబా దార్-ఉల్-మిన్హాజ్, పుట 155)**

మరో కథనంలో అద్దీ బిన్ హాతిమ్ (రజి) ఇలా పేర్కొన్నారు: “నేను అల్లాహ్ ప్రవక్త(స)ను కలుసుకోవడానికి బయలుదేరి మదీనాకు చేరుకున్నాను. నేను మస్జిద్‌లోకి ప్రవేశించి, అల్లాహ్ ప్రవక్త (స) సమక్షంలో హాజరై, వారికి సలాం చేశాను. దైవ ప్రవక్త (స) ‘నువ్వెవరు?’ అని అడిగారు. నేను, ‘నేను అద్దీ బిన్ హాతిమ్‌ను’ అని సమాధానమిచ్చాను. అప్పుడు దైవ ప్రవక్త (స) నిలబడి, నన్ను తన ఇంటి వైపు తీసుకెళ్లడం ప్రారంభించారు. మార్గమధ్యంలో ఒక వృద్ధురాలు వచ్చి, తన అవసరాల గురించి దైవ ప్రవక్త (స)తో చాలా సేపు మాట్లాడింది. ఆమె కోసం దైవ ప్రవక్త (స) అక్కడే నిలబడి ఉన్నారు.” అద్దీ (రజి) ఇలా అన్నారు: “నేను నా మనసులో, ‘ఈ వ్యక్తి రాజు అయి ఉండలేదు, రాజులు పేద ప్రజల కోసం ఇలా నిలబడరు. రాజులకు ఇలాంటి ఆదర్శప్రాయమైన నైతిక గుణాలు ఉండవు’ అని అనుకున్నాను. తరువాత దైవ ప్రవక్త (స) నన్ను తన ఇంటిలోకి తీసుకెళ్లి, ఒక మందమైన పరుపును తీసుకుని నా ముందు ఉంచి, ‘దీనిపై కూర్చో’ అని అన్నారు. (వారు ఇంట్లో ఉన్న ఒక పరుపును అతిథికి ఇచ్చారు.) నేను, ‘మీరు ఈ పరుపుపై కూర్చోండి’ అని అన్నాను. దైవ ప్రవక్త (స) ‘లేదు, నువ్వే కూర్చో’ అని సమాధానమిచ్చారు. చివరికి నేను ఆ పరుపుపై కూర్చున్నాను, దైవ ప్రవక్త (స) నేలపై కూర్చున్నారు. అప్పుడు నేను నా మనసులో, ‘ఇది ఖచ్చితంగా రాజుల ప్రవర్తన కాదు. ఇవి అత్యంత వినయశీలుడైన వ్యక్తి యొక్క లక్షణాలు’ అని అనుకున్నాను.”

**(సీరతున్నబవియ్యహ్, లిఇబ్న్ హిషామ్, పేజి 854, దారుల్-కుతుబ్ అల్-ఇల్మియ్యా, బీరూట్, 2001)**

దైవ ప్రవక్త (స) పిల్లల పట్ల కూడా ప్రేమను వ్యక్తం చేసి, వినయాన్ని ప్రదర్శించేవారు. వారిని ముందుగా పలకరించేవారు.

హజ్రత్ అనస్ (ర) ఇలా వివరించారు: దైవ ప్రవక్త (స) ఎప్పుడైనా అన్సార్ ప్రజలను సందర్శించినప్పుడు, వారి పిల్లలకు సలాం చేసేవారు, వారి తలలపై తన చేతిని ప్రేమగా ఉంచి, వారి కోసం ప్రార్థించేవారు.

**(సునసుల్-కుబ్రా, లిన్నిసాయి, కితాబుల్-మనాఖిబ్, సంపుటి 5, పేజి 92 హదీస్ 8349, దారుల్-కుతుబుల్-ఇల్మియ్యా)**

హజ్రత్ ఇబ్న్ మసూద్ (ర) ఇలా వివరించారు: ఒక సందర్భంలో ఒక వ్యక్తిని దైవ ప్రవక్త (స) సమక్షానికి తీసుకువచ్చారు. ప్రవక్త (స) అతనితో మాట్లాడుతు ఉండగా, దైవ ప్రవక్త (స) వారి గంభీరత మరియు ప్రభావం కారణంగా ఆ వ్యక్తి భుజాలు వణకడం ప్రారంభించాయి. అప్పుడు ప్రవక్త (స) అతనితో ఇలా అన్నారు: “భయపడకండి, నేను రాజును కాను. ఎండబెట్టిన మాంసాన్ని తినే ఒక స్త్రీ కుమారుడిని మాత్రమే.” **(సునన్ ఇబ్న్ మాజా, కితాబుల్-అత్ఇమా, హదీస్ 3312)**

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు: “చూడండి, మన ప్రవక్త (స) సాధించిన విజయాలు ఎంత గొప్పవంటే, గత ప్రవక్తలలో ఎవరి విజయాలతోనూ వాటిని పోల్చలేము. అయినప్పటికీ, అల్లాహ్ వారికి ఎన్ని ఎక్కువ విజయాలను ప్రసాదించాడో, వారు (స) అంత ఎక్కువగా వినయ శీలుడయ్యారు. ఒక సందర్భంలో ఒక వ్యక్తిని పట్టుకుని ప్రవక్త (స) సమక్షానికి తీసుకువచ్చినట్లు వివరించబడింది. ప్రవక్త (స) అతని వైపు చూసినప్పుడు, అతను వణుకుతూ భయభ్రాంతులకు గురయ్యాడు. అతను దగ్గరకు వచ్చినప్పుడు, ప్రవక్త (స) ఎంతో మృదువుగా, ప్రేమతో అతనిని అడిగారు: ‘నీవెందుకు ఇంత భయపడు తున్నావు? చివరికి, నేనూ నీ వలె ఒక మనిషినే కదా! నేను ఒక స్త్రీ కుమారుడిని.”

**(మల్ఫూజాత్, సంపుటి 10, పుటలు 217-218, ప్రచురణ 2022)**

బాహ్య ఆడంబరం మరియు ప్రదర్శనలకు ప్రవక్త (స) పూర్తిగా దూరముండేవారు.

ఈ విషయం ముఖ్యంగా ప్రవక్త (స) మదీనాకు హిజ్రత్ (వలస) చేసిన సందర్భంలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సంఘటనను మనం అనేకసార్లు విన్నాము. అల్లాహ్ ప్రవక్త (స) మదీనాకు చేరుకున్నప్పుడు, ప్రవక్త (స) వచ్చిన వార్త విని ముస్లింలు ఉత్సాహంగా లేచి, తమ ఆయుధాలను తీసుకుని, హర్రా మైదానానికి ప్రవక్త (స)ను స్వాగతించడానికి బయలుదేరారు. ప్రవక్త (స) వారితో కలిసి కుడివైపుకు తిరిగి, బను అమర్ బిన్ ఔఫ్ ప్రాంతంలో బస చేశారు. అది రబీఉల్ అవ్వల్ నెలలోని ఒక సోమవారం రోజు. హజ్రత్ అబూ బకర్ (రజి) ప్రజలను స్వాగతించడానికి నిలబడి ఉండగా, దైవ ప్రవక్త (స) నిశ్శబ్దంగా కూర్చున్నారు. అప్పటి వరకు ప్రవక్త (స)ను చూడని అన్సార్ ప్రజలు ముందుకు వచ్చి, హజ్రత్ అబూ బకర్ (రజి)కు సలాం చేయడం ప్రారంభించారు. చివరకు సూర్యకాంతి ప్రవక్త (స)పై పడసాగింది. అప్పుడు హజ్రత్ అబూబకర్ (రజి) నిలబడి తన వస్త్రంతో ప్రవక్త (స)కు నీడను కల్పించారు. అప్పుడే ప్రజలు ప్రవక్త (స)ను గుర్తించారు.

**(సహీబుఖారీ, కితాబుల్-మనాఖిబ్ అల్-అన్సార్, బాబ్ హిజ్రతున్నబి సల్లల్లాహు అలైహి వసల్లం వ అస్‌హాబ్..... అనువాదం : సంపుటి 7, పేజి 400, హదీస్ 3906, నజారత్-ఎ-ఇషాఅత్)**

హజ్రత్ ఇబ్న్ అబ్బాస్ (రజి) ఇలా వివరించారు: హజ్రత్ ఉమర్ (ర) మింబర్‌పై నిలబడి ఇలా చెప్పారు: “నేను ప్రవక్త (స) ఇలా తెల్పుచుండగా విన్నాను: ‘మర్యమ్ కుమారుడిని ప్రశంసించడంలో క్రైస్తవులు అతిగా వ్యవహరించినట్లుగా, నన్ను ప్రశంసించడంలో మీరు అతిగా వ్యవహరించకండి.

నేను కేవలం అల్లాహ్ సేవకుడిని మాత్రమే. కాబట్టి మీరు "ఆయన అల్లాహ్ సేవకుడు మరియు అల్లాహ్ ప్రవక్త" అని మాత్రమే చెప్పండి."

**(సహీ బుఖారీ, కితాబుల్ అహాదీసి అల్-అంబియా, బాబ్ ఖౌలుల్లాహ్ వ ఇజ్‌కారు ఫిల్ కితాబిల్ మరియమ, అనువాదం, సంపుటి6, పేజ 426, హదీస్ 3445, నజారత్-ఎ-ఇషాఅత్)**

అదేవిధంగా, అలీ బిన్ హుసైన్ తన తండ్రిని ఆధారం చేసుకోని ఇలా వివరించారు: "ఇస్లాం పట్ల ఉన్న ప్రేమ కారణంగా మమ్మల్ని ప్రేమించండి. ఎందుకంటే దైవ ప్రవక్త (స) నాతో ఇలా అన్నారు: 'నాకు తగిన స్థాయికి మించి, నా స్థానాన్ని ఉన్నత పరచకండి. ఎందుకంటే అల్లాహ్ నన్ను తన ప్రవక్తగా చేయక ముందే తన సేవకునిగా చేశాడు." ప్రవక్త (స) ఇలా తెలిపారు. ఇస్లాం పట్ల ఉన్నటు వంటి ప్రేమ వలన మీరు ప్రేమించండి.

**(అల్-ముఅజమిల్ కబీర్,తిబ్రానీ, సంపుటి 3, పేజ 138-139, హదీస్ 2889, మక్తబా ఇబ్న్ తైమియ్యా)**

ముతర్రిఫ్ ఇలా వివరించారు: నా తండ్రి నాతో ఇలా చెప్పారు: "నేను బను ఆమిర్ ప్రతినిధి బృందంలో భాగంగా ప్రవక్త (స) వద్దకు వెళ్లాను. మేము ఇలా అన్నాము: 'మీరు మా నాయకులు.' ప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు: 'నాయకుడు అల్లాహ్, ఆయన శుభప్రదుడు, మహోన్నతుడు.' మేము ఇలా అన్నాము: 'మీరు మాలో పుణ్యం విషయంలో అత్యుత్తములు, ఉపకారం చేయడంలో మాలో అత్యంత గొప్పవారు.' అప్పుడు ప్రవక్త (స) ఇలా అన్నారు: 'మీరు చెప్పదలచుకున్నది చెప్పండి. అయితే ఈ విషయంలో షైతాన్‌ను మిమ్మల్ని ధైర్యపరచనివ్వకండి."

**(సునన్ అబూ దావూద్, కితాబుల్-అదబ్, బాబ్ కరాఅతిల్ తమాద హదీస్ 4806)**

ఇది ప్రవక్త (స) వారి వినయం. వారు అలాంటి మాటలు చెప్పగానే వెంటనే వారిని ఆపారు. ఇవన్నీ పక్కన పెట్టండి. మీలో ఇలాంటి భావాలు కలగవచ్చు, అవి కొనసాగవచ్చు కూడా. మీరు ఇక్కడికి ఎందుకు వచ్చారో ఆ ఉద్దేశాన్ని చెప్పండి. నా గురించి ఈ విధమైన వ్యర్థమైన ప్రశంసా మాటలు మాట్లాడకండి. నిజానికి వారు ప్రవక్త (స)ను ప్రశంసిస్తూ ఉపయోగించిన మాటలు వాస్తవానికి ప్రవక్త (స) కు వర్తించగలిగినవే.

హుజ్రత్ రుబయ్యీ బింత్ ముఅవ్విజ్ బిన్ అఫ్రా ఇలా చెప్పారు: "నా వివాహ రాత్రి ప్రవక్త (స) మా ఇంటికి వచ్చి, మీరు ఇప్పుడు నాతో కూర్చున్నట్లుగానే నా మంచంపై కూర్చున్నారు." (ఆమె ఈ విషయాన్ని తాను ఎవరికి వివరిస్తున్నారో ఆ వ్యక్తితో చెప్పింది.) "ఆ సమయంలో మా యువతులలో కొందరు దప్పు వాయిస్తూ, బదర్ యుద్ధంలో మరణించిన నా పూర్వీకులను ప్రశంసిస్తూ పాటలు పాడుతున్నారు. ఆ పాటలలో ఒక యువతి ఇలా పాడింది: 'మాలో రేపు ఏమి జరుగుతుందో తెలిసిన ఒక ప్రవక్త (స) ఉన్నారు.' వెంటనే ప్రవక్త (స) ఇలా అన్నారు: 'ఆ మాటను వదిలేయండి; ఇంతకుముందు మీరు పాడుతున్నదే పాడండి."

**(సహీ-బుఖారీ, కితాబున్నికాహ్, బాబ్ జరబుల్ దఫ్, ఫిన్నికాహ్ వల్ వలీమా, సంపుటి 13, పేజ 84-85, హదీస్ 5147 నజారతే ఇషాఅత్)**

అనగా "నాకు అదృశ్య విషయాల జ్ఞానం ఉంది" అనే భావాన్ని సూచించే ఈ మాటలు తప్పు. వాస్తవానికి అదృశ్య జ్ఞానం అల్లాహ్‌కు మాత్రమే చెందుతుంది.

హుజ్రత్ అబ్దుల్లాహ్ (రజి) ప్రవక్త (స) ను ఆధారం చేసుకోని ఇలా వివరించారు: వారు (స) ఇలా అన్నారు: "నేను మత్తాయి కుమారుడైన యూనస్ కంటే శ్రేష్ఠుడిని అని ఎవరూ చెప్పకూడదు." వారు (స) శ్రేష్ఠులైనప్పటికీ, ఇలాంటి పోలికలను పోల్చడాన్ని వారు (స) నిషేధించారు మరియు అత్యంత వినయాన్ని వ్యక్తం చేశారు. (సహీ బుఖారీ, కితాబుత్తఫ్సీర్, బాబ్ ఇన్నా అవ్‌హైనా ఇలైక కమా అవ్‌హైనా ఇలా నూహిన్. (అన్నిసా :163) హదీస్ 4603, అనువాదం: సంపుటి 10, పేజ 227, ప్రచురణ నజారతే ఇషాఅత్).

అదేవిధంగా, హుజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి.) ఇలా వివరిస్తున్నారు: ఒక వ్యక్తి ప్రవక్త (స) సన్నిధికి వచ్చి ఇలా అన్నాడు: "ఓ సృష్టిలో శ్రేష్ఠుడా!" అందుకు ప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు: "అది ఇబ్రాహీం (అ) గారు."

**(సహీ ముస్లిం, కితాబుల్ ఫజాయిల్, బాబ్ మిన్ ఫజాయిలుల్ ఇబ్రాహీముల్ ఖలీల్ సల్లల్లాహు అలైహి వసల్లం.... అనువాదం: సంపుటి 12, పేజ 280, హదీస్ 4353, నూర్ ఫౌండేషన్)**

నిస్సందేహంగా ప్రవక్త (స) ఖైరుల్ బరియ్యాహ్, సృష్టిలో శ్రేష్ఠుడు మరియు సమస్త సృష్టిలో అత్యున్నతుడు; అంతేకాక, సమస్త ప్రవక్తలలో కూడా అత్యున్నతుడు. అయినప్పటికీ, అత్యంత వినయంతో, ఆ బిరుదును ప్రవక్త ఇబ్రాహీం (అ) గారికి ఆపాదించారు.

వారి వినయానికి చెందిన మరో ఉదాహరణ హుజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి.) వారి కథనములో కనిపిస్తుంది. ఒక సందర్భంలో ఒక వ్యక్తి ప్రవక్త (స)ను మూడుసార్లు పిలిచాడు. ప్రతి సారి ప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు: "నేను ఇక్కడ ఉన్నాను, నేను ఇక్కడ ఉన్నాను."

**(మజ్మఅ,అజ్-జవాయిద్ వ మన్‌బఅల్-ఫవాయిద్, కితాబ్ అలామాతిన్ నుబువ్వహ్, హదీస్ 14224, దారుల్-కుతుబ్ అల్-ఇల్మియ్యాహ్, బీరూట్, 2001)**

సుమారు అరేబియా మొత్తాన్ని జయించిన తరువాత, ఈ అరేబియా మహానుభావుడు లక్షకు పైగా సహచరులతో కలిసి హజ్ నిర్వహించారు. అయినప్పటికీ, ఆ సందర్భంలో కూడా ప్రవక్త (స) చూపిన వినయం అపూర్వమైనది. హుజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) గారు ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) ఒక సాధారణ వాహనంపై, కేవలం నాలుగు దిర్హమ్‌ల కంటే ఎక్కువ విలువ లేని సాధారణ జీను వస్త్రంతో హజ్ చేశారు. వాస్తవానికి దాని విలువ అంతకంటే కూడా తక్కువ. అది ఎంతో సాధారణమైన వస్త్రం. ప్రవక్త (స) ఇలా ప్రార్థించారు: **అల్లాహుమ్మ హజ్జతున్ లా రియాఅ ఫీహా వలా సుమ్అత** అనగా "ఓ అల్లాహ్! ఇది ఎటువంటి ప్రదర్శనకోసం గానీ, కీర్తి ప్రతిష్ఠలను పొందాలనే ఆకాంక్షతో గానీ చేయబడని హజ్."

**(సునన్ ఇబ్న్ మాజ, కితాబుల్ మనాసిక్, హదీస్ 2890; సీరతుల్ హలబియ్యాహ్, సంపుటి 3, దారుల్-కుతుబుల్-ఇల్మియ్యాహ్, బీరూట్, పుట 361)**

హుజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ప్రవక్త (స)ను ప్రశంసిస్తూ, వారి పేర్లను కొనియాడుతూ, ఇలా పేర్కొన్నారు: "అహ్మద్' అనే పేరు సౌందర్యం, కృప మరియు దయ యొక్క ప్రతిఫలనం. దీనికి భిన్నంగా, 'ముహమ్మద్' అనే పేరు గాంభీర్యం, మహోన్నతత్వం యొక్క ప్రతిఫలనం. దీనికి కారణం ఏమిటంటే, 'ముహమ్మద్' అనే పేరులో ప్రియతముడిగా ఉండే గుణం అంతర్లీనంగా ఉంది (అంటే సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు ప్రియతముడిగా ఉండటం). ఎందుకంటే అన్ని ప్రశంసనీయమైన శ్రేష్ఠతలను కలిగి ఉండటం, అత్యున్నతమైన సౌందర్యాన్ని మరియు సంపూర్ణమైన ప్రశంసనీయ గుణాలను కలిగి ఉండటం. ఇవన్నీ వైభవం, గాంభీర్యం, భయమిశ్రిత గౌరవం మరియు మహిమను కోరుకుంటాయి. (అంటే, వారు (స) అన్ని సంపూర్ణమైన నైతిక గుణాలను కలిగి ఉన్నారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క గాంభీర్యత ఒక వ్యక్తిపై అవతరించి, ఆ వ్యక్తి దానిని వ్యక్తపరిచినప్పుడు మాత్రమే ఇది సంభవిస్తుంది. అలాగే ఆయన యొక్క ఉన్నత స్థానం కూడా వ్యక్తమవుతుంది.) "అయితే 'అహ్మద్' అనే పేరులో ప్రేమలో పడే గుణం అంతర్లీనంగా ఉంది. ఎందుకంటే ఒకరిని ప్రశంసించడం అనేది వినయం, ప్రేమికుని విధేయత మరియు నమ్రతను కోరుతుంది. దీనినే నిజంగా సౌందర్య (జమాలీ) స్థితి అని పిలుస్తారు, ఎందుకంటే అది గాఢమైన ప్రేమతో నిండి ఉంటుంది; ఈ స్థితికి వినయం మరియు నమ్రత అవసరం. "మన ప్రవక్త (స) 'ముహమ్మద్' అనే పేరుకు అవసరమైన విధంగా అత్యంత ప్రియతముడు. (అంటే, వారు సర్వశక్తిమంతుడైన దేవునికి ప్రియతముడు.) ఎందుకంటే అన్ని ప్రశంసనీయమైన శ్రేష్ఠతలను కలిగి ఉన్న 'ముహమ్మద్' అనే స్థితి, అత్యంత ప్రియతముడిగా ఉండే స్థితిని సృష్టిస్తుంది. "అదేవిధంగా, ప్రవక్త (స) 'అహ్మద్' అనే పేరుకు అవసరమైన అత్యుత్తమ ప్రేమికుని దేవుని మరియు మానవాళి ప్రేమికుని గుణాలను కూడా కలిగి ఉన్నారు. (అంటే, 'అహ్మద్' అనే పేరు వారిలో ప్రేమించే సామర్థ్యం ఉండాలని కోరుతుంది.) ఎందుకంటే (హామిద్) ప్రశంసించేవాడు తప్పనిసరిగా (ముహిబ్ ) ప్రేమించేవాడు కూడా అయి ఉండాలి. ఒక వ్యక్తి మరొకరిని నిజమైన మరియు సంపూర్ణమైన రీతిలో ప్రశంసించగలిగేది అతడు ప్రేమలో ఉన్నప్పుడు మాత్రమే. అంతేకాదు, గాఢమైన ప్రేమలో ఉన్నప్పుడు మాత్రమే. ప్రేమికునిగా, ముహిబ్బా ఉండటానికి విధేయత మరియు వినయం అవసరం. (గాఢమైన ప్రేమలో ఉండటానికి వినయాన్ని ప్రదర్శించడం అవసరం; కేవలం తన గౌరవం మరియు ప్రభావాన్ని ప్రదర్శించడం ద్వారా ఎవరూ గాఢమైన ప్రేమలో పడలేరు.) "అహ్మదీయత్ యొక్క సారాన్ని గ్రహించడానికి అవసరమైన (జమాలీ) సౌందర్య స్థితి కూడ ఇదే. 'ముహమ్మద్' అనే పేరులో అంతర్లీనంగా ఉన్న ప్రియతమత్వం సహాబాల ద్వారా వ్యక్తమైంది. ఇక అవమానపరిచేవారిని మరియు తిరుగుబాటు చేసేవారిని దేవుని ప్రియతముడిగా ఉండటంలోని (జలాల్) గాంభీర్యత అణచి వేసింది."

**(అర్బయీన్ నం. 4, రూహానీ ఖజాయిన్, సంపుటి 17, పుటలు 447-448)**

ప్రవక్త (స) అల్లాహ్‌కు ప్రియతములు అయినందున, వారు (స) తన జలాల్ (మహిమ, వైభవం)ను ప్రత్యక్షపరిచాడు. ఈ (జలాల్ ) గాంభీర్యత సహాబాల ద్వారా వ్యక్తమైనది, తద్వారా శత్రువు పూర్తిగా నాశనం చేయబడ్డాడు.

దీనిని మరింత వివరిస్తూ, హుజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఒక సందర్భంలో ఇలా పేర్కొన్నారు: " ప్రవక్త (స) వారి పవిత్ర నామాలలో ఒక అంతర్లీన రహస్యం ఉంది. 'ముహమ్మద్' మరియు 'అహ్మద్' అనే రెండు నామాలలో ఒక్కొక్క దానికి ప్రత్యేకమైన శ్రేష్ఠతలు ఉన్నాయి. 'ముహమ్మద్' అనే నామం మహిమ మరియు గంభీరమైన వైభవానికి సంబంధించిన లక్షణాలను కోరుతుంది, ఎందుకంటే ఈ నామానికి 'అత్యంతగా ప్రశంసించబడిన వాడు' అనే అర్థం ఉంది. ఇది ప్రియతముని లక్షణం కూడా. ఎందుకంటే ప్రియమైన వ్యక్తి ప్రశంసించబడతాడు. అందువల్ల ఈ నామం మహిమ మరియు గాంభీర్యపు లక్షణాలను కోరుతుంది. అదే విధంగా, 'అహ్మద్' అనే నామంలో ప్రేమికుని లక్షణాలు అంతర్లీనంగా ఉన్నాయి, ఎందుకంటే ప్రేమికుడు ప్రశంసలు సమర్పించేవాడు. కాబట్టి, 'ముహమ్మద్' అనే నామం తన మహిమలోను, ప్రియతమునిగా ఉండటంలోను వైభవం మరియు గాంభీర్యాన్ని కోరినట్లే, 'అహ్మద్' అనే నామం తన ప్రేమ మరియు భక్తితో కూడిన వైభవంలో వినయాన్ని, మృదుత్వాన్ని కోరుతుంది. (ఈ రెండవ నామమైన 'అహ్మద్' వినయం మరియు మృదుత్వం అనే గుణాన్ని వ్యక్తపరుస్తుంది.) "ఈ నామాలలోని అంతర్లీన రహస్యం ఏమిటంటే, ప్రవక్త (స) జీవితాన్ని ప్రధానంగా రెండు భాగాలుగా విభజించవచ్చు. మొదటిది మక్కాలో గడిపిన వారి జీవితం, అది పదమూడు సంవత్సరాల పాటు కొనసాగింది. రెండవది మదీనాలో గడిపిన వారి జీవితం, అది పది సంవత్సరాల పాటు కొనసాగింది. మక్కాలోని జీవితకాలంలో వారు (స) 'అహ్మద్' అనే నామం యొక్క వ్యక్తీకరణగా కనిపిస్తారు. ఆ కాలంలో దైవ ప్రవక్త (స) రాత్రింబవళ్ళు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సమక్షంలో ఏడుస్తూ, విలపిస్తూ, దైవిక సహాయం కోసం ప్రార్థిస్తూ, దుఆలో సమయాన్ని గడిపేవారు. (ఇది అత్యంత వినయం మరియు మృదుత్వంతో కూడిన కాలం. ఈ స్థితులు తరువాత కూడా కొనసాగాయి, అయితే ఆ సమయంలో ప్రధానంగా ఈ లక్షణాలే వ్యక్తమయ్యాయి.)

ప్రవక్త (స) ఈ కాలంలో తన జీవితాన్ని ఏ విధంగా గడిపారో పూర్తిగా తెలిసిన ఎవరైనా, తమ ప్రియతముని అన్వేషణలో ఏ ప్రేమికుడూ ప్రవక్త (స) మక్కా జీవితంలో చేసినంతగా ఆర్తితో, ఏడ్చి విలపించలేదని, ఇకపై కూడా ఈ విషయంలో ఎవరూ వారితో సమానమవ్వలేరని గ్రహిస్తారు. (ఇక్కడ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ), ప్రవక్త (స) సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రేమలో ఏ విధంగా పూర్తిగా లీనమయ్యారో ఉదాహరణగా వివరిస్తున్నారు. ఈ స్థితి వారి జీవితమంతా ఉన్నప్పటికీ, ఆ కాలంలో ఇది ప్రత్యేకంగా వారి జీవితానికి గుర్తింపుగా నిలిచింది.) "అయితే ప్రవక్త (స) చేసిన ఈ విలాపాలు వారి స్వీయ ఆత్మ కోసం కాదు. ప్రపంచ స్థితిగతుల గురించి వారికి ఉన్న స్పష్టమైన జ్ఞానం కారణంగా. అల్లాహ్ ఆరాధన పూర్తిగా కనుమరుగైపోయింది. ప్రవక్త (స) వారి ఆత్మ మరియు సహజ స్వభావం మహోన్నతుడైన అల్లాహ్‌పై విశ్వాసంతో నిండిపోయి ఉండేది. ఆ విశ్వాసం వారిలో ఆనందాన్ని, పరమ సంతోషాన్ని కలిగించేది. ప్రవక్త (స) సహజంగానే ఈ ఆనందం మరియు సంతోషంతో ప్రపంచాన్ని కూడా నింపాలని కోరుకున్నారు. కానీ వారు(స) ప్రపంచాన్ని పరిశీలించినప్పుడు, ప్రజల సామర్థ్యాలు మరియు స్వభావాలు విచిత్రంగా వికృతమైపోయాయని, అనేక కష్టాలు మరియు బాధలు వారి ముందున్నాయని గమనించారు. సంక్షిప్తంగా చెప్పాలంటే, ప్రవక్త (స) ప్రపంచం యొక్క ఈ దుస్థితిని చూసి ఏడుస్తూ, విలపించేవారు. వారు ఈ స్థితిలో అంతగా విలపించేవారు కాబట్టి, దాదాపు తన ప్రాణాన్నే కోల్పోయేంతగా బాధపడేవారు. మహోన్నతుడైన అల్లాహ్ ఈ క్రింది వాక్యంలో దీనినే సూచిస్తున్నాడు: లఅల్లక బాఖిఉన్ న్నఫ్సక అల్లా యకూనూ మోమినీన్ (షుఅర:4) అనగా 'వారు విశ్వసించనందుకు నీవు దుఃఖంతో నీ ప్రాణాన్నే పోగొట్టుకునే స్థితికి చేరుతావా?' "ఇదే ప్రవక్త (స) వారి ఆ జీవితం. వారు అత్యంత వినయంతో దైవిక కృప మరియు కరుణ కోసం వేడుకున్న జీవితం. ఇది వారి 'అహ్మద్' అనే నామం యొక్క వ్యక్తీకరణను చూపించిన జీవితం. ఆ కాలంలో ప్రవక్త (స) లోతైన ధ్యానం మరియు చింతనలో నిమగ్నమై ఉండేవారు. ఈ ధ్యానం మరియు ప్రార్థన యొక్క ప్రభావాలు మదీనాలోని జీవితంలో స్పష్టంగా కనిపించాయి. అక్కడ 'ముహమ్మద్' అనే నామం వ్యక్తమైంది. (వారి జీవితంలోని మొదటి కాలం 'అహ్మద్' నామం యొక్క వ్యక్తీకరణగా ఉండగా, మదీనాలోని వారి జీవితం 'ముహమ్మద్' నామం యొక్క ప్రకాశానికి వ్యక్తీకరణగా నిలిచింది. ఇంతకు ముందు పేర్కొన్నట్లుగా, సహాబాల ద్వారా కూడా శత్రువు నాశనం చేయబడ్డాడు.) దీనికి క్రింది ఆయత్ స్పష్టమైన సాక్ష్యంగా ఉంది: **వస్తఫ్తహూ వఖాబ కుల్లు జబ్బారిన్ అనీద్** (ఇబ్రాహీం:16) అనగా 'వారు విజయాన్ని కోరుతూ ప్రార్థించారు; ఫలితంగా సత్యానికి విరోధిగా ఉన్న ప్రతి అహంకారి శత్రువు నాశనమయ్యాడు." (మల్ఫూజాత్, సంపుటి 2, పుటలు 62--63) మదీనాలో వారి జీవితకాలంలో శత్రువు తీవ్రంగా విరుచుకు పడినప్పుడు, ఆ సమయంలో ప్రవక్త (స) యొక్క "ముహమ్మద్" అనే నామంలోని లక్షణాలు వ్యక్తమయ్యాయి. ప్రతి శత్రువు నాశనమై, ధ్వంసమయ్యాడు. **వస్తఫ్తహూ వఖాబ కుల్లు జబ్బారిన్ అనీద్** అనగా వారు అల్లాహ్‌ను విజయాన్ని ప్రసాదించమని ప్రార్థించారు. ఫలితంగా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారికి శత్రువుపై విజయాన్ని ప్రసాదించాడు. తమ శత్రువులపై ప్రవక్త (స)కు విజయాన్ని అనుగ్రహించి, వారిని నాశనం చేశాడు.

మరో సందర్భంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇలా పేర్కొన్నారు: "అందువల్ల, దైవ ప్రవక్త (స) వారి వినయం, అణకువ పరిపూర్ణత యొక్క అత్యున్నత స్థాయికి చేరుకున్నట్లు కనిపించే వివిధ సందర్భాల్లో, అదే స్థాయిలో వారికి పవిత్రాత్మ యొక్క సహాయం మరియు వెలుగు తోడుగా ఉన్నట్లు స్పష్టమవుతుంది. మన మహనీయ ప్రవక్త (స) వారి కార్యాలు మరియు ఆచరణల స్థితి దీనిని స్పష్టంగా నిరూపిస్తుంది. వాస్తవానికి, వారి వెలుగు మరియు ఆశీర్వాదాల పరిధి ఎంత విస్తృతమైనదంటే, వారి ప్రతిబింబం మరియు ప్రభావం సమస్త శాశ్వతత్వంలోనూ కొనసాగుతున్నట్లు గమనించవచ్చు. (ఈ ఉదాహరణ ఎప్పటికీ కనిపిస్తూనే ఉంటుంది.) "అదేవిధంగా, ఈ యుగంలో సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రసాదిస్తున్న సమస్త అనుగ్రహాలు మరియు కృపలు ప్రవక్త (స) పట్ల విధేయత మరియు సంపూర్ణ అనుసరణ ద్వారానే పొందబడుతున్నాయి.

"నా స్వీయ అనుభవం ఆధారంగా నేను నిజాయితీగా చెబుతున్నాను మరియు ప్రకటిస్తున్నాను. అల్లాహ్ యొక్క ప్రవక్త (స) పట్ల సంపూర్ణ విధేయతలో లీనమయ్యేంతవరకు, ఎవరూ నిజమైన సత్కార్యాలను చేయలేరు, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రసన్నతను పొందలేరు, లేదా తన ఆత్మను అత్యున్నత స్థాయిలో పవిత్రపరచుకున్న వ్యక్తికి ప్రసాదించబడే దైవిక అనుగ్రహాలు, ఆశీర్వాదాలు, అంతర్దృష్టులు, సత్యాలు మరియు దర్శనాలను పొందే అదృష్టానికి నోచుకోలేరు. దీనికి సాక్ష్యం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వాక్యాలలోనే ఉంది: ఖుల్ ఇన్‌కుతుమ్ తుహిబ్బునల్లాహ ఫత్తబిఊని యుహ్‌బిబ్‌కుముల్లాహు (ఆలే ఇమ్రాన్:32) అనగా నీవిట్లు ప్రకటించుము: మీరు అల్లాహ్‌ను ప్రేమిస్తే, నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు."

"సర్వశక్తిమంతుడైన అల్లాహ్ చేసిన ఈ ప్రకటనకు ఒక ఆచరణాత్మకమైన, సజీవమైన సాక్ష్యాన్ని నేను.

హుజూర్ (అ) మరల ఇలా తెలిపారు:

ఇందుకు నేనే ప్రత్యక్ష సాక్షాన్ని. నేను ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను ప్రేమిస్తున్నాను. కావున అల్లాహ్ తాలా యొక్క అనుగ్రహాలు నాపై అవతరించబడుతున్నాయి. "పవిత్ర ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ యొక్క సద్గురువులు మరియు ప్రియమైనవారి కొరకు నిర్దేశించబడిన లక్షణాల వెలుగులో మీరు నన్ను గుర్తించండి. అందువల్ల, మహనీయ ప్రవక్త (స) అత్యంత పరిపూర్ణమైన నైతిక గుణాలను కలిగి ఉన్నారు. ఒక వృద్ధురాలు వారి చేయిని పట్టుకున్నా, ప్రవక్త (స) అక్కడే ఉండి ఆమె మాటలను ఎంతో శ్రద్ధగా వినేవారు. ఆమె వారిని విడిచి వెళ్లేంతవరకు, వారు కూడా ఆమెను విడిచి వెళ్లేవారు కాదు."

**(మల్ఫూజాత్, సంపుటి 1, పేజీలు 188-189, ప్రచురణ 2022)**

ఒక హదీసులో ప్రవక్త (స) వారి వినయం మరియు నిరాడంబరత ఈ విధంగా వర్ణించబడింది.

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (ర) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త (స) అనారోగ్యంతో ఉన్నవారిని పరామర్శించేవారు, అంత్యక్రియల ఊరేగింపుల్లో పాల్గొనేవారు, గాడిదపై ప్రయాణించేవారు. అది చాలా సాధారణమైన ప్రయాణ సాధనంగా పరిగణించబడినప్పటికీ మరియు ఒక బానిస ఇచ్చిన ఆహ్వానాన్ని కూడా స్వీకరించేవారు. బను ఖురైజా సంఘటన జరిగిన రోజున, వారు (స) ఒక గాడిదపై ప్రయాణించారు. దాని పగ్గాలు ఖర్జూరపు చెట్టు బెరడుతో తయారు చేసిన తాడుతో చేయబడ్డాయి. దాని జీను కూడా ఖర్జూరపు చెట్టు నారతో తయారు చేయబడింది. మరో మాటలో చెప్పాలంటే, అది అత్యంత సరళమైన మరియు నిరాడంబరమైనదిగా ఉండేది. **(జామిఅ త్తిర్మిజి, అబ్వాబుల్-జనాయిజ్, హదీసు 1017)**

మరో ఉల్లేఖనంలో, హజ్రత్ ఉస్మాన్ (రజి.) ఒక ప్రసంగంలో ఇలా పేర్కొన్నారు: "అల్లాహ్ ప్రమాణం! మేము ప్రవక్త (స) వారి సన్నిధిలో ప్రయాణాల్లోనూ, ఇంటి వద్ద ఉన్నప్పుడూ సహవాసం చేశాము. ప్రవక్త (స) మా అనారోగ్యులను పరామర్శించే వారు, మా అంత్యక్రియలకు హాజరయ్యేవారు, ప్రతి పరిస్థితిలోనూ, ప్రతి విషయంలోనూ మాతోనే ఉండేవారు."

**(ముస్నద్ అహ్మద్ బిన్ హన్బల్, సంపుటి 1, హదీస్ 504, ఆలం-ఉల్-కుతుబ్, బీరూట్, 1998, పుట 226)**

అదేవిధంగా, హజ్రత్ అబూహురైరా (రజి.) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త (స) ఇలా అన్నారు: "ఒక గొర్రె ముందు కాలు లేదా దాని కాలి భాగాన్ని తినడానికి నన్ను ఆహ్వానించినా, నేను తప్పకుండా ఆ ఆహ్వానాన్ని స్వీకరిస్తాను. అలాగే ఒక గొర్రె ముందు కాలు లేదా దాని కాలి భాగాన్ని నాకు బహుమతిగా పంపించినా, నేను తప్పకుండా దానిని స్వీకరిస్తాను." అంటే, ఎంతో సాధారణమైన ఆహారం కోసం చేసే ఆహ్వానమైనా లేదా చాలా సాధారణమైన బహుమతైనా ప్రవక్త (స) వారు స్వీకరించేవారు.

**(సహీ-బుఖారీ, కితాబుల్-హిబా, హదీస్ 2568, అనువాదం: నజారత్-ఎ-ఇషాఅత్)**

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి.) ఇలా వర్ణించారు: "ఒక రోజు ప్రవక్త (స) వారిని బార్లీ రొట్టె మరియు పాత కొవ్వుతో వండిన భోజనానికి ఆహ్వానించారు. వారు సంతోషంగా ఆ ఆహ్వానాన్ని స్వీకరించారు."

(ముస్నద్ అహ్మద్ బిన్ హన్బల్, సంపుటి 4, పుటలు 610-611, హదీస్ 13531, ఆలం-ఉల్-కుతుబ్, బీరూట్, 1998)

మరో ఉల్లేఖనంలో ప్రవక్త (స) వారి భోజనంలోని సరళత ఈ విధంగా వివరించబడింది. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి.) ఇలా ఉల్లేఖించారు: ఒక రోజు ఒక దర్జీ ప్రవక్త (స) వారిని తాను సిద్ధం చేసిన భోజనానికి ఆహ్వానించాడు. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి.) ఇలా అన్నారు: "నేను ప్రవక్త (స) వారితో కలిసి ఆ భోజనానికి వెళ్లాను. వారి ముందు రొట్టెను, సొరకాయ ముక్కలు మరియు మాంసపు ముక్కలు కలిగిన పులుసును ఉంచారు. ప్రవక్త (స) వారు మాంసాన్ని పక్కన ఉంచి, పాత్రలో సొరకాయ ముక్కల కోసం వెతుకుతున్నట్లు నేను గమనించాను." హజ్రత్ అనస్ (రజి.) ఇలా అన్నారు: "ఆ రోజు నుండి నేను సొరకాయ తినడం ప్రారంభించాను మరియు దానిని ఇష్టపడసాగాను."

**(సహీ-బుఖారీ, కితాబుల్-బుయూ', హదీస్ 2092, అనువాదం: నజారత్-ఎ-ఇషాఅత్)**

ఇక్కడ మన అతిథుల కోసం కూడా ఒక విషయాన్ని ప్రస్తావించాలనుకుంటున్నాను. ఇందులో వారికి కూడా ఒక పాఠం ఉంది. జల్సా రోజులలో,

**అహాదీస్ బోధనలు**

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు:

**"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."**

(కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్దీ, 38671)

**దుఆ ఆశించువారు:** ***Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)***

**అహాదీస్ బోధనలు**

**"ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.**

(మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్)

**దుఆ ఆశించువారు:** ***Muhammad Vazeer Ahmad sb***

ముఖ్యంగా లంగర్‌లో, కొంతమంది అప్పుడప్పుడు ఫిర్యాదు చేస్తూ, బంగాళాదుంపలు మరియు మాంసంతో చేసిన వంటకంలో తమకు బంగాళాదుంపలు ఇవ్వకూడదని, కేవలం మాంసమే ఇవ్వాలని అంటుంటారు. అలాంటి వారు ప్రవక్త (స) వారి ఆదర్శాన్ని ఎల్లప్పుడూ మనస్సులో ఉంచుకోవాలి. ఆహారం ఒక నిర్దిష్ట పరిమాణం మరియు అవసరమైన మోతాదుకు అనుగుణంగా సిద్ధం చేయబడుతుంది. కాబట్టి అందుబాటులో ఉన్నదానిని స్వీకరించి, ఏది వడ్డించబడితే, అది కూరగాయలైనా, మాంసమైనా దానిని సంతృప్తితో తినాలి.

ఇతరుల మనోభావాలను గౌరవించడంలో ప్రవక్త (స) వారు చూపిన శ్రద్ధను, అలాగే వారి వినయాన్ని తెలియజేసే మరో ఉదాహరణ ఈ క్రింది ఉల్లేఖనంలో కనిపిస్తుంది. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి.) ఇలా వర్ణించారు: ప్రవక్త (స) వారు కుష్ఠురోగంతో బాధపడుతున్న ఒక వ్యక్తి చేతిని పట్టుకుని, అతనిని తనతో పాటు అదే పాత్రలో భోజనం చేయించారు. అనంతరం ఇలా అన్నారు: "అల్లాహ్ నామంతో భుజించు; ఆయనపైనే సంపూర్ణంగా విశ్వాసం ఉంచు."

(జామిఅ అత్తిర్మిజీ, అబ్వాబుల్-అత్ఇమా, హదీస్ 1817)

అదేవిధంగా, హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి.) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త (స) వారు ఫిదక్‌లో తయారు చేసిన ఒక వస్త్రంతో కప్పబడిన గాడిదపై స్వారీ చేశారు మరియు హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి.)ను తన వెనుక కూర్చోబెట్టుకున్నారు. తన పక్కన ఎవరు కూర్చున్నారనే విషయంలో వారికి ఎటువంటి సంకోచమూ ఉండేది కాదు. (సహీ బుఖారీ, కితాబుత్-తఫ్సీర్, హదీస్ 4566)

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి.) ఇలా వర్ణించారు: బక్రీద్ పండుగ రోజున, ప్రవక్త (స) వారు ఫజల్ బిన్ అబ్బాస్‌ను తన ఒంటె వెనుక కూర్చోబెట్టుకున్నారు. (సహీ బుఖారీ, కితాబుల్-ఇస్తిజాన్, హదీస్ 6228)

అదేవిధంగా, హజ్రత్ అనస్ (రజి.) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త (స) వారు మక్కాలో ప్రవేశించినప్పుడు, ప్రజలు వారిని చూడటానికి ముందుకు వచ్చారు. వారి వినయం కారణంగా, వారి పవిత్ర శిరస్సు ఎంతగా వంగి ఉందంటే, అది దాదాపు వారి ఒంటె జీను వరకు తాకేంతగా ఉంది. ప్రజలతో చుట్టుముట్టబడి, విజయం సాధించి, పెద్ద సంఖ్యలో ముస్లింలు వారి చుట్టూ ఉన్నప్పటికీ, వారి వినయం ఎంతగా ప్రతిఫలించిందంటే, వారి పవిత్ర గడ్డం జీనును తాకేంతగా లేదా దానికి అత్యంత సమీపంగా వంగి ఉంది. ఆ సమయంలో వారు ఇలా అన్నారు: అల్లాహుమ్మ ఇన్నల్ అయిష అయిషల్ ఆఖిరతి అనగా "ఓ అల్లాహ్! నిశ్చయంగా, నిజమైన జీవితం పరలోక జీవితమే." (సుబులుల్-హుదా, సంపుటి 5, పుట 226, దారుల్-కుతుబ్ అల్-ఇల్మియ్యా, బీరూట్)

ప్రవక్త (స) చూపిన న్యాయం, సమానత్వం, వినయం మరియు అణకువకు ఒక ఉదాహరణ ఏమిటంటే, ఖురైష్ నాయకులు మరియు బను హాశిమ్ వంశానికి చెందినవారి సమక్షంలో కూడా, తన విముక్త దాసుడైన జైద్ బిన్ హారిసా కుమారుడు ఉసామాను తన వెనుక కూర్చోబెట్టుకున్నారు.

**(షరహ్ అల్-జుర్కానీ, సంపుటి 3, దార్-ఉల్-కుతుబ్ అల్-ఇల్మియ్యా, బీరూట్, పుట 414)**

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు: "సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు ప్రత్యేక సేవకులకు ప్రసాదించబడే ఔన్నత్యం వినయంతో కూడి ఉంటుంది. అయితే సైతాను యొక్క ఔన్నత్యం అహంకారంతో కూడి ఉంటుంది. అంటే, దానిలో గర్వం అంతర్లీనంగా ఉంటుంది. మన గౌరవనీయ ప్రవక్త, సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా విజయ సమయంలో తన తలను వంచి సాష్టాంగ ప్రణామం చేసిన విధానాన్ని గమనించండి. అదే మక్కాలో వారికి అన్ని విధాలుగా వ్యతిరేకత ఎదురై, హింసకు గురైన కష్టాలు మరియు పరీక్షల కాలంలో వారు ఎలా వంగి సాష్టాంగ ప్రణామం చేసేవారో, అదే విధంగా వారు మక్కా విజయ సమయంలో కూడా సాష్టాంగ ప్రణామం చేశారు. వారు(స) ఆ నగరం నుండి బయలుదేరినప్పుడు ఉన్న పరిస్థితిని, ఇప్పుడు తిరిగి వచ్చినప్పుడు ఉన్న పరిస్థితిని తలచుకున్నప్పుడు, వారి హృదయం అల్లాహ్ పట్ల కృతజ్ఞతతో నిండిపోయింది; వారు సాష్టాంగ ప్రణామంలో పడిపోయారు."

(మల్ఫూజాత్, సంపుటి 3, పుట 260 ఫుట్‌నోట్,ప్రచురణ 2022)

అబ్దుల్లాహ్ ఇబ్న్ మసూద్ (ర) ద్వారా వివరించబడిన ఒక కథనంలో ఇలా ఉంది: "బదర్ యుద్ధం జరిగిన రోజున, మా మధ్య ప్రతి ముగ్గురు వ్యక్తులకు ఒక ఒంటె కేటాయించబడింది. హజ్రత్ అబూ లుబాబా (ర) మరియు హజ్రత్ అలీ (ర) ప్రవక్త (స)తో కలిసి ఉన్నారు. ప్రవక్త (స) నడిచే వంతు వచ్చినప్పుడు, ఆ ఇద్దరు సహచరులు ఇలా విన్నవించుకున్నారు: 'ఓ అల్లాహ్ ప్రవక్తా (స), మేము మీ స్థానంలో నడుస్తాము; మీరు స్వారీ చేస్తూ ఉండండి.' ప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు: 'నడవడంలో మీరు నాకంటే బలవంతులు కారు; అలాగే ప్రతిఫలం పొందడంలో మీ ఇద్దరికంటే నాకు తక్కువ అవసరం లేదు."

(ముస్నద్ అహ్మద్ బిన్ హన్బల్, సంపుటి 2, హదీస్ 4009, ఆలం అల్-కుతుబ్, బీరూట్, 1998, పుటలు 116-117)

మరో కథనంలో ఇలా పేర్కొనబడింది: ఒకసారి ప్రవక్త (స) తన సహచరులతో ప్రయాణిస్తున్నప్పుడు, భోజనం కోసం ఒక మేకను సిద్ధం చేయమని ఆదేశించారు. ఒక వ్యక్తి, "ఓ అల్లాహ్ ప్రవక్తా (స), నేను దానిని కోస్తాను" అని అన్నాడు. మరొకరు, "నేను దాని చర్మాన్ని తీస్తాను" అని అన్నారు. మూడవ వ్యక్తి, "నేను దానిని వండుతాను" అని అన్నాడు. అప్పుడు ప్రవక్త (స) ఇలా అన్నారు: "మరి కట్టెలు సేకరించడం నా బాధ్యత." సహచరులు, "ఓ అల్లాహ్ ప్రవక్తా (స), మీ తరపున ఈ పని చేయడానికి మేము సరిపోతాము" అని విన్నవించుకున్నారు. అందుకు ప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు: "మీరు నా తరపున ఈ పని చేయగలరని నాకు తెలుసు. అయితే మీ మధ్య నేను ప్రత్యేకంగా కనిపించాలని కోరుకోవడం లేదు. ఎందుకంటే ఒక సేవకుడు తన సహచరుల మధ్య ప్రత్యేకతను కోరుకోవడం సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు ఇష్టం లేదు." (తారీఖ్-ఉల్-ఖమీస్, సంపుటి 1, పుటలు 387--388, దార్-ఉల్-కుతుబ్ అల్-ఇల్మియ్యా, బీరూట్, 2009)

ఆ తరువాత ప్రవక్త (స) స్వయంగా లేచి కట్టెలను సేకరించడం ప్రారంభించారు. ప్రవక్త (స) వారి వినయం ప్రతి సందర్భంలోనూ స్పష్టంగా కనిపించేది.

మరో కథనంలో, అస్వద్ ఇలా వివరించారు: అతడు హజ్రత్ ఆయిషా (ర)ను ప్రవక్త (స) ఇంట్లో ఏమి చేసేవారని అడిగారు. ఆమె ఇలా సమాధానమిచ్చారు: "వారు (స) తన కుటుంబ సభ్యులకు సేవ చేయడంలో నిమగ్నమై ఉండేవారు. అంటే, వారి ఇంటి పనుల్లో వారికి సహాయం చేసేవారు. నమాజ్ సమయం వచ్చినప్పుడు, నమాజ్ కోసం బయటకు వెళ్లేవారు." (సహీహ్ అల్-బుఖారీ, కితాబ్-ఉల్-అజాన్, హదీస్ 676, అనువాదం: నజారత్-ఎ-ఇషాత్)

కావున, ఇంటి వ్యవహారాల్లో సహాయం చేయడానికి పూర్తిగా నిరాకరించే పురుషులకు ఇందులో ఒక గొప్ప పాఠం ఉంది. అలాంటి ప్రవర్తన వారి భార్యలలో ఫిర్యాదులకు దారితీస్తుంది.

అదేవిధంగా, హిషామ్ బిన్ ఉర్వా తన తండ్రి ద్వారా ఇలా వివరించారు: ఒక వ్యక్తి హజ్రత్ ఆయిషా (ర)ను, అల్లాహ్ ప్రవక్త (స) ఇంట్లో ఏదైనా పని చేసేవారా అని అడిగాడు. ఆమె ఇలా సమాధానమిచ్చారు: "అవును. అల్లాహ్ ప్రవక్త (స) తన చెప్పులను స్వయంగా కుట్టుకునేవారు, తన వస్త్రాలను స్వయంగా కుట్టుకునే వారు, అలాగే మీలో ప్రతి ఒక్కరూ తన ఇంట్లో పనిచేసినట్లే ప్రవక్త (స) కూడా తన ఇంట్లో పని చేసేవారు." (ముస్నద్ అహ్మద్ బిన్ హన్బల్, సంపుటి 8, హదీస్ 25855, ఆలం అల్-కుతుబ్, బీరూట్, 1998, పుట 313)

ప్రవక్త (స)వారి ఈ ఉన్నతమైన ఆదర్శాన్ని అనుసరించి సహచరులు కూడా తమ భార్యలకు ఇంటి పనుల్లో సహాయం చేసేవారని ఇది స్పష్టంగా తెలియజేస్తుంది. అయితే, ఇంటిని చూసుకోవడం వంటి ప్రధాన బాధ్యత భార్యపై ఉంటుందని కూడా స్పష్టంగా గుర్తుంచుకోవాలి. దీనిని స్త్రీలు తమ స్వంత బాధ్యతల నుండి విముక్తి పొందుతారని అర్థం చేసుకోకూడదు. అయినప్పటికీ, పురుషులు వారికి సహాయం చేయడం మరియు మద్దతు ఇవ్వడం వారి బాధ్యతగానే ఉంటుంది.

అదేవిధంగా, ఖాసిమ్ నుండి వచ్చిన మరో కథనంలో, హజ్రత్ ఆయిషా (ర)ను అల్లాహ్ ప్రవక్త (స) ఇంట్లో ఎలాంటి పనులు చేసేవారని అడిగినప్పుడు, ఆమె ఇలా సమాధానమిచ్చారు: "వారు (స) ఇతర మనుషుల మధ్య ఒక సాధారణ మనిషిలా ఉండేవారు. తన వస్త్రాలపై ఉన్న దుమ్మును తానే దులిపేవారు, తన మేకకు తానే పాలు పితికేవారు, తన పనులను తానే చూసుకునేవారు."

**(ముస్నద్ అహ్మద్ బిన్ హన్బల్, సంపుటి 8, పుట 507, హదీస్ 26724, ఆలం అల్-కుతుబ్, బీరూట్, 1998)**

హజ్రత్ అబూ బుర్దా రజి కథనంలో అదనంగా ఇలా పేర్కొనబడింది: ప్రవక్త (స) ఉన్ని వస్త్రాలను ధరించేవారు, తన జంతువులను తానే కట్టేసేవారు, అలాగే తన అతిథుల గురించి స్వయంగా విచారించి, వారిని గౌరవించడానికి వెళ్లేవారు. వారికి ఆతిథ్యం కూడా వారే స్వయంగా ఇచ్చేవారు. వారు అన్ని రకాల వస్త్రాలను, ముతక మరియు సాధారణ వస్త్రాలను కూడా ధరించేవారు. వారి (స) వస్త్రధారణలో సరళత స్పష్టంగా కనిపించేది.

**(దలాయిల్ అన్-నుబువ్వహ్, బైహఖీ, సంపుటి 1, దార్-ఉల్-కుతుబ్ అల్-ఇల్మియ్యా, బీరూట్, 1988, పుట 329)**

హజ్రత్ అమీర్ బిన్ రబీఅహ్ (రజి) ఇలా వివరిస్తున్నారు: ఒక వ్యక్తి ఇలా తెలిపాడు: "ఒకసారి నేను ప్రవక్త (స)తో కలిసి మస్జిద్‌కు వెళ్తున్నాను. మార్గమధ్యంలో వారి చెప్పుల పట్టీ తెగిపోయింది. దానిని బాగు చేయడానికి నేను నా చేతిలోకి తీసుకున్నాను. అప్పుడు ప్రవక్త (స) నా చేతి నుండి ఆ చెప్పును తీసుకుని, 'ఇది

| వర్తమాన ఖలీఫా వాఖ్యములు | **"అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్లె ఆందోళన కూడ దూరం కాదు."** **(జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)** |
| --- | --- |

**దుఆ ఆశించువారు:** ***Darga sb, jamat AhmadiyyaVizag (A.P)***



ప్రత్యేకమైన సేవను స్వీకరించడమే అవుతుంది. నాకు ఇలాంటి ప్రత్యేక సేవ నచ్చదు' అని అన్నారు."

(మజ్మయే జవాయిద్, వ ముంబఉల్ ఫవాయిద్, లిల్ హేష్మీ, సంపుటి 8, పేజి 422, కితాబు ఎలామాతు న్నబువ్వత్, బాబ్ ఫీ తవాజుఅ సల్లల్లాహు అలైహి వసల్లం కథనము 14232, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ 2001)

హసన బిన్ ఖాలిద్ (రజి) మరియు సువాఅబిన్ ఖాలిద్ (రజి) ఇలా వివరిస్తున్నారు: వారు ఇద్దరూ అల్లాహ్ యొక్క ప్రవక్త (స) సన్నిధికి వచ్చినప్పుడు, ప్రవక్త (స) తమ ఇళ్లలోని ఒక ఇంటి గోడను మరమ్మతు చేస్తూ లేదా ఏదో నిర్వహణ పనిలో నిమగ్నమై ఉన్నారు.

**(సుబూలుల్ హుదా వర్రిషాద్, సంపుటి 7, పేజి 36, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)**

అనగా ప్రవక్త (స) స్వయంగా తన ఇంటిలోని పనులను తన చేతులతోనే చేసేవారు.

అదేవిధంగా, బుఖారిలో మస్జిద్-ఎ-నబవీ నిర్మాణానికి సంబంధించిన ఒక విపులమైన వివరణ ఉంది. ప్రవక్త (స)వారి ఆడ ఒంటె ఇద్దరు బాలురకు చెందిన స్థలంలో ఆగినప్పుడు, వారు (స) "ఈ స్థలం మనకు అనుకూలంగా ఉంది" అని అన్నారు. ఆ బాలురు ఆ స్థలానికి డబ్బు తీసుకోవడానికి ఇష్టపడక పోయినప్పటికీ, ప్రవక్త (స) ఆ భూమి విలువను వారికి చెల్లించారు. ఆ తరువాత మస్జిద్ నిర్మాణం ప్రారంభమైనప్పుడు, ప్రవక్త (స) ప్రజలతో కలిసి ఇటుకలను మోస్తూ, మస్జిద్ నిర్మాణంలో స్వయంగా శ్రమించారు.

**(సహీ బుఖారి, కితాబుల్ మనాకిబుల్ అన్సార్, బాబ్ హిజ్రతున్నబి సల్లల్లాహు అలైహి వసల్లం, వ అస్హాబ ఇలల్ మదీనాతి అనువాదం: సంపుటి 7, పేజి 401, కథనము 3906, ప్రచురణ నజారత్ ఇషాఅత్)**

అదేవిధంగా, హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) ఇలా వివరిస్తున్నారు: "ఖందక్ యుద్ధం జరిగిన రోజున, అల్లాహ్ ప్రవక్త (స) స్వయంగా మట్టిని మోస్తుండటాన్ని నేను చూశాను. వారి ఛాతిపై ఉన్న వెంట్రుకలను సైతం దుమ్ము కప్పివేసింది."

(సహీ బుఖారి, కితాబుల్ జిహాద్ వ సరాయ, అనువాదం : సంపుటి 5, పేజి 378-379, కథనము 3034, నజారత్ ఇషాఅత్)

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఇలా పేర్కొన్నారు: "ఒక ఉదయం నేను అబ్దుల్లాహ్ బిన్ అబీ తల్హాను అల్లాహ్ యొక్క ప్రవక్త (స) వద్దకు తీసుకువచ్చాను. వారు తన పవిత్ర హస్తంతో ఆ నవజాత శిశువుకు కొద్దిగా తేనె తినిపించాలని ఉద్దేశించాను. అక్కడికి వెళ్లినప్పుడు, ప్రవక్త (స) తన చేతిలో జంతువులకు ముద్ర వేయడానికి ఉపయోగించే ఒక పరికరాన్ని పట్టుకుని ఉండటం చూశాను."అంటే, ఒక నవజాత శిశువును తేనె తినిపించడానికి ప్రవక్త (స) వద్దకు తీసుకువచ్చిన సమయంలో కూడా ప్రవక్త (స) ఒక పనిలో నిమగ్నమై ఉన్నారు. వారి చేతిలో జంతువులపై గుర్తులు వేయడానికి ఉపయోగించే ఒక పరికరం ఉంది. తద్వారా వాటిని గుర్తించగలిగేవారు. వారు (స) సదఖా కోసం కేటాయించిన ఒంటెలకు గుర్తులు వేస్తున్నారు.

**(సహీ బుఖారి, కితాబుల్ జకాత్, అనువాదం:సంపుటి 3, పేజి 154, కథనం 1502, ప్రచురణ నజారత్ ఇషాఅత్)**

ప్రతి విషయంలోనూ ప్రవక్త (స) ఆచరణ ఇదే విధంగా ఉండేది: ఏదైనా పనిని స్వయంగా చేసే అవకాశం లభించినప్పుడు, సహాయకులను పిలవడం కంటే వారే స్వయంగా ఆ పనిని చేసేవారు.

ఒక కథనంలో, హజ్రత్ అబూ ఉమామా అల్-బాహిలీ (రజి) ఇలా వివరిస్తున్నారు: ప్రవక్త (స) ఒక కర్రపై ఆనుకుని మా వద్దకు వచ్చారు. ప్రవక్త (స)ను చూసినప్పుడు మేమంతా లేచి నిలబడ్డాము. అప్పుడు ప్రవక్త (స) ఇలా అన్నారు: "పర్షియన్లు తమ పెద్దల కోసం నిలబడినట్లుగా మీరు ఇలా చేయకండి." మేము వినయపూర్వకంగా ఇలా సమర్పించాము: "ఓ అల్లాహ్ యొక్క ప్రవక్త (స), మా కొరకు అల్లాహ్‌ను ప్రార్థించండి." అప్పుడు ప్రవక్త (స) ఈ దుఆ చేశారు:

**అల్లాహుమ్మ అఘ్ఫిర్‌లనా వర్ హమ్‌నా వఅర్‌జ అన్నా వతఖబ్బల్ మిన్నా వ అద్‌ఖిల్‌నల్ జన్నత వనజ్జిన మినన్నారి వఅస్‌లిహ్‌లనా షనఅన కుల్లహు.**

అనగా "ఓ అల్లాహ్! మమ్మల్ని క్షమించు, మాపై కరుణ చూపు, మా పట్ల సంతోషించు, మా నుండి స్వీకరించు, మమ్మల్ని స్వర్గంలో ప్రవేశింపజేయి, అగ్ని నుండి మమ్మల్ని రక్షించు, మరియు మా సమస్త వ్యవహారాలను సరిదిద్దు."

కథకుడు ఇలా చెబుతున్నారు: ప్రవక్త (స) మా కోసం ఇంకా ఎక్కువగా ప్రార్థించాలని మేము కోరుకున్నట్లుగా అనిపించింది. అప్పుడు ప్రవక్త (స) ఇలా అన్నారు: "నేను మీ కోసం సమస్త విషయాలను ఒకచోట చేర్చలేదా?" అంటే, ఇది అత్యంత సమగ్రమైన ప్రార్థన అని అర్థం.

హజ్రత్ ముస్లిహ్-ఎ-మౌవూద్ (రజి) ఇలా పేర్కొన్నారు:

" ప్రవక్త (స) వారి వినయపూర్వక స్థితి ఎంత గొప్పదంటే, వారు వచ్చినప్పుడు ప్రజలు తన కోసం లేచి నిలబడకుండా వారిని ఆపేవారు. వారు ఇలా చెప్పేవారు: 'ఇది పర్షియన్ల ఆచారం. నేను రాజును కాను; బదులుగా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నన్ను ఒక ప్రవక్తగా నియమించాడు.'"

(తఫ్సీరే కబీర్, సంపుటి 15, పేజి 157, ప్రచురణ 2023)

ఈ విధంగా, ప్రవక్త (స) వినయానికి అటువంటి ఉన్నత ప్రమాణాలను స్థాపించారు. వాటికి సమానమైన ఉదాహరణలు మరెక్కడా కనిపించవు. మనం కూడా వారు చూపిన ఈ ఆదర్శాన్ని అనుసరించడానికి కృషి చేయాలి. తద్వారా మనం కూడా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సాన్నిత్యానికి అర్హులమయ్యే వారిలో చేరగలుగుతాము.

ప్రవక్త (స) వారి ఆదర్శాన్ని మన ముందుంచి మనలను హెచ్చరిస్తూ, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా పేర్కొన్నారు:

"నా దృష్టిలో, పవిత్రతను పొందడానికి ఇది అత్యుత్తమమైన మార్గం. దీనికంటే మెరుగైన మార్గాన్ని కనుగొనడం సాధ్యం కాదు. అంటే, ఒక వ్యక్తి ఏ విషయంలోనూ గర్వం లేదా అహంకారం కలిగి ఉండకూడదు. అది జ్ఞానమైనా, వంశపారం పర్యమైనా, సంపద అయినా సరే. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఒక వ్యక్తికి దృష్టిని ప్రసాదించినప్పుడు, ఈ అంధకారాల నుండి అతన్ని బయటకు తీసుకురాగల ప్రతి కాంతి కేవలం ఆకాశం నుంచే వస్తుందని, మరియు మనిషికి ఎల్లప్పుడూ ఆకాశీయ కాంతి అవసరమని అతడు గ్రహిస్తాడు. ఆకాశం నుండి వచ్చే సూర్యకాంతి ప్రసరించనంత వరకు కన్ను కూడా చూడలేదు. అదేవిధంగా, ప్రతి విధమైన అంధకారాన్ని తొలగించి, దాని స్థానంలో ధర్మనిష్ఠ మరియు పవిత్రత యొక్క కాంతిని ప్రసరింపజేసే ఆ కాంతి కూడా కేవలం ఆకాశం నుంచే వస్తుంది. నేను నిశ్చయంగా చెబుతున్నాను: మనిషి యొక్క ధర్మనిష్ఠ, విశ్వాసం, ఆరాధన మరియు పవిత్రత, ఇవన్నీ ఆకాశం నుంచే వస్తాయి. ఇవన్నీ సర్వశక్తిమంతుడైన అల్లాహ్ కృపపై ఆధారపడి ఉంటాయి. ఆయన కోరితే వాటిని స్థాపిస్తాడు; ఆయన కోరితే వాటిని తొలగించగలడు. కాబట్టి నిజమైన అవగాహన ఏమిటంటే, మనిషి తనను తాను పూర్తిగా నిస్సారమైన వాడిగా, విలువలేని వాడిగా భావించి, దైవ సన్నిధి ద్వారం వద్ద వినయంతో, అణకువతో సాష్టాంగపడాలి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ కృపను వినయపూర్వకంగా, మృదుత్వంతో కోరాలి. తన అహంకారపు వాంఛలను దహించి, తనలో సత్కార్యాల పట్ల కాంతిని, శక్తిని, ఉత్సాహాన్ని సృష్టించే ఆ అవగాహనా కాంతి కోసం ప్రార్థించాలి. "అప్పుడు, ఒక వ్యక్తికి ఈ కృపలో కొంత భాగం ప్రసాదించబడి, అతని హృదయం తెరచుకొని ప్రకాశిస్తే, దాని కారణంగా అతడు అహంకారిగా లేదా గర్విష్ఠిగా మారకూడదు. దానికి బదులుగా, అతడు మరింతగా వినయం మరియు అణకువలో అభివృద్ధి చెందాలి. ఎందుకంటే ఒక వ్యక్తి తనను తాను ఎంత ఎక్కువగా ఏమీ కాదని భావిస్తాడో, అంత ఎక్కువగా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ప్రత్యక్ష కృపలు మరియు కాంతి అతనిపై అవతరిస్తాయి. అవి అతనికి శక్తిని ప్రసాదిస్తాయి. ఒక వ్యక్తి ఈ విశ్వాసాన్ని కలిగి ఉంటే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ కృప ద్వారా అతని నైతిక స్థితి ఉత్తమంగా మారుతుందని భావించబడుతుంది. ఈ లోకంలో తనను తాను ఏదో ఒక గొప్ప వ్యక్తిగా భావించడమే అహంకారం. ఇదే స్థితి క్రమంగా మనిషిలో అభివృద్ధి చెందుతుంది. ఆ తరువాత, ఇతరులను దూషిస్తూ, వారిని నీచులుగా భావించే స్థితి అతనిపై ఆధిపత్యం చెలాయిస్తుంది."

(మల్ఫూజాత్, సంపుటి 7, పుటలు 59-60, ప్రచురణ 2022)

మరల హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా పేర్కొన్నారు:

"మనిషి కేవలం ఒక వినయపూర్వకమైన సృష్టి మాత్రమే అయినప్పటికీ, తన కర్మల పరిణామాల నుండి తాను రక్షించబడ్డానని భావిస్తాడు. దాని ఫలితంగా అతనిలో గర్వం మరియు అహంకారం అభివృద్ధి చెందుతాయి. ఒక వ్యక్తి అల్లాహ్ మార్గంలో తనను తాను అత్యంత అల్పుడిగా భావించనంత వరకు, అతడు విముక్తిని పొందలేడు. భారతదేశానికి చెందిన సూఫీ కవి కబీర్ భగత్ సత్యమే పలికాడు. అతను ఇలా అన్నాడు:

"నేను ఒక వినయపూర్వకమైన కుటుంబంలో జన్మించడం నా అదృష్టం; అందుకే నేను ప్రతి ఒక్కరినీ నమస్కరిస్తాను.

"నేను ఒక ప్రత్యేక హక్కులు కలిగిన కుటుంబంలో జన్మించి ఉంటే, మరి నేను దేవుణ్ణి ఎలా కనుగొనగలిగేవాడిని?'

"అంటే, నేను ఒక సాధారణమైన ఇంటిలో జన్మించడం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క గొప్ప కృప. నేను ఒక ఉన్నత వంశంలో జన్మించి ఉంటే, దేవుణ్ణి కనుగొనలేక పోయేవాడిని. ఇతరులు తమ ఉన్నత కులాన్ని గురించి గర్వపడుతుండగా, వస్త్రాలు నేసే కుటుంబానికి చెందిన కబీర్ తన స్వంత నేపథ్యాన్ని గురించి ఆలోచించి, దాని పట్ల కృతజ్ఞతతో ఉండేవాడు. అందువల్ల, మనిషి ప్రతి క్షణం తనను తాను పరిశీలించుకోవాలి మరియు తాను ఎంత అల్పుడో ఆలోచించాలి. అతని విలువ ఏమిటి? ఒక వ్యక్తి యొక్క వంశం ఎంత గొప్పదైనా, అతడు తన గురించి నిజంగా ఆలోచిస్తే, ఒక విధంగానైనా మరొక విధంగానైనా, చూడగల దృష్టి అతనికి ఉంటే మొత్తం విశ్వం ముందు తాను అల్పుడని, విలువలేనివాడని తప్పకుండా భావిస్తాడు.

ఒక వ్యక్తి ఉన్నత స్థాయి మరియు హోదా కలిగిన వ్యక్తి పట్ల చూపే లేదా చూపవలసిన అదే నైతిక ప్రవర్తనను ఒక పేద, నిస్సహాయ వృద్ధ మహిళ పట్ల చూపేంత వరకు, అలాగే ప్రతి రకమైన గర్వం, అహంకారం మరియు దురహంకారం నుండి తనను తాను కాపాడుకునేంత వరకు, అతడు ఎప్పటికీ, ఎన్నటికీ సర్వశక్తిమంతుడైన దేవుని రాజ్యంలో ప్రవేశించలేడు."

(మల్ఫూజాత్, సంపుటి 5, పుట 138, ప్రచురణ 2022)

ఎవరైనా సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను పొందాలని కోరుకుంటే, వినయం అనేది తప్పనిసరి అవసరం.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్, వినయం యొక్క నిజమైన స్వరూపాన్ని అర్థం చేసుకునే సామర్థ్యాన్ని మనకు ప్రసాదించుగాక!. ప్రవక్త (స) వారి ఆశీర్వాదకరమైన ఆదర్శాన్ని ఎల్లప్పుడూ మన ముందుంచుకొని, దాని ప్రకారం జీవించేలా మనలను అనుగ్రహించుగాక!. ఆమీన్.



# జుమా ప్రసంగము

హ్రజత్ ఉమర్ (ర) ప్రవక్త (స) వినయానికి సంబంధించిన మరో ఉదాహరణను ఉల్లేఖించారు. వారు ఇలా చెబుతారు: "ఉమ్రా చేయదానికి ప్రవక్త (స) వారి అనుమతి కోరాను. వారు(స) ఎంతో దయతో నాకు అనుమతి ఇచ్చి, 'నా సోదరా! నీ ప్రార్థనల్లో నన్ను మరచిపోవద్దు' అని అన్నారు." హ్రజత్ ఉమర్ (ర) ఇలా తెలిపారు. " ప్రవక్త (స) పలికిన ఆ మాటలు నాకు ఎంతటి ఆనందాన్ని కలిగించాయంటే, వాటికి బదులుగా నాకు మొత్తం ప్రపంచాన్నే ఇచ్చినా, అంతటి ఆనందం కలిగేది కాదు."

**ఒక వ్యక్తి ఎంతగా అల్లాహ్‌కు భయభక్తులు కలిగి ఉన్నాడో తెలుసుకొనుటకు, అతను ధనవంతులతో ఎలా వ్యవహరిస్తాడన్నదానికంటే, పేదలతో ఎలా ప్రవర్తిస్తాడన్నదే నిజమైన ప్రమాణం. ప్రవక్త (స) వారి బోధనలను అనుసరిస్తూ, వారి ఆశీర్వదిత సున్నత్‌కు అనుగుణంగా ఆచరిస్తూ, వినయానికి సంబంధించిన మార్గాలను అవలంబించే సామర్థ్యాన్ని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు ప్రసాదించుగాక!.**

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హ్రజత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 22 మే 2026 ( 22 హ్రజత్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيْكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُوْلُهُ

أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ- بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ-

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

ప్రవక్త (స) వారి జీవితం మరియు చరిత్రకు సంబంధించి, వారి వినయం మరియు అణకువ గురించి చర్చ జరుగుతోంది. ఈ రోజు కూడా దీనినే కొనసాగిస్తాను.

ప్రవక్త (స) వారి వినయం ఏ స్థాయిలో ఉండేది? వారు (స) చిన్న చిన్న ఉదాహరణల ద్వారా దానిని వ్యక్తపరచేవారు. యహ్యా బిన్ అబీ కతీర్ (రజి) వర్ణించారు: ప్రవక్త (స) ఇలా అన్నారు: "ఒక సేవకుడు ఎలా తింటాడో నేను అలాగే తింటాను; ఒక సేవకుడు ఎలా కూర్చుంటాడో నేను అలాగే కూర్చుంటాను. ఎందుకంటే నేను కూడా ఒక సేవకుడినే." (అల్ జామిఅ లి షుఅబిల్ ఈమాన్, సంపుటి 8, పుట 116 కథనము 5572, అల్-రుష్ద్, రియాద్, 2003)

మరో మాటలో చెప్పాలంటే, నాయకులు మరియు పాలకులలో కనిపించే అహంకారం, ఆత్మగర్వం, ఆడంబరం నాలో లేవు.

మరో కథనంలో హ్రజత్ అనస్ (రజి) చెబుతారు: ప్రవక్త (స) వద్ద 'అజ్బా' అనే ఆడ ఒంటె ఉండేది. అది ఎంత వేగంగా నడిచేదంటే, మరే ఇతర ఒంటె కూడా దానిని అధిగమించ లేకపోయేది. ఒక గ్రామీణ అరబ్బు తన వద్ద ఉన్న చిన్న ఒంటెపై వచ్చాడు. ఒక పందెంలో అతని ఒంటె 'అజ్బా'ను అధిగమించింది. 'అజ్బా' వెనుక బడిపోయి, దానిని అధిగమించడం చూసి ముస్లింలు బాధపడ్డారు. లేదా అతని ఒంటె ముందుకు వెళ్లబోతున్నప్పుడు, అది ప్రవక్త (స) వారి ఒంటె కాబట్టి అతను తన ఒంటెను ఆపివేయాల్సిందని వారు భావించారు. అయితే వారి ప్రవర్తనకు ప్రతిస్పందనగా ప్రవక్త (స) ఇలా అన్నారు: "అల్లాహ్ ఈ లోకంలో ఏదైనా వస్తువును పైకి లేపితే, దానిని కిందికి దించడం కూడా అల్లాహ్ హక్కే."

(సహీ బుఖారీ, కితాబుర్-రికాక్, బాబ్ అత్తవాజుఅ, హదీస్ 6501)

కాబట్టి కోపం తెచ్చుకోవడానికి ఎలాంటి కారణం లేదు. ఎందుకంటే ఇది సర్వశక్తిమంతుడైన అల్లాహ్ విధానం పరంగా ఎత్తుపల్లాలు ఎల్లప్పుడూ ఉంటాయి. సాధారణ ప్రజలు ఇలాంటి విషయంపై అసూయ చెందవచ్చు. అయితే ప్రవక్త (స) ఎల్లప్పుడూ సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సత్తాను తన దృష్టిలో ఉంచుకునేవారు. వారు ప్రపంచానికి అల్లాహ్ ఆధిక్యతను మాత్రమే ప్రదర్శించాలని కోరుకునేవారు. ఎంతటి వినయంతో వారు (స) ఇలా చెబుతున్నారో చూడండి: "దీని గురించి మీరు ఎందుకు కోపపడాలి?. అవసరం లేదు. ఎందుకంటే ఇది సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆధిక్యతను మాత్రమే తెలియజేస్తుంది."

హ్రజత్ ఉమర్ (ర) ప్రవక్త (స) వినయానికి సంబంధించిన మరో ఉదాహరణను ఉల్లేఖించారు. వారు ఇలా చెబుతారు: "ఉమ్రా చేయదానికి ప్రవక్త (స) వారి అనుమతి కోరాను. వారు(స) ఎంతో దయతో నాకు అనుమతి ఇచ్చి, 'నా సోదరా! నీ ప్రార్థనల్లో నన్ను మరచిపోవద్దు' అని అన్నారు." హ్రజత్ ఉమర్ (ర) ఇలా తెలిపారు. " ప్రవక్త (స) పలికిన ఆ మాటలు నాకు ఎంతటి ఆనందాన్ని కలిగించాయంటే, వాటికి బదులుగా నాకు మొత్తం ప్రపంచాన్నే ఇచ్చినా, అంతటి ఆనందం కలిగేది కాదు." (సునన్ అబీ దావూద్, కితాబుల్-వితర్, బాబుద్దుఆ, హదీస్ 1498)

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రవక్త (స) పై దురూద్ పంపడాన్ని తప్పనిసరి చేశాడు. అలాగే ప్రార్థనలు అంగీకరించబడటానికి దురూద్‌ను ఒక ముఖ్యమైన సాధనంగా కూడా చేశాడు. అయినప్పటికీ, ప్రవక్త (స) వారి వినయం ఎంతటి స్థాయిలో ఉండేదంటే, వారు తన అనుచరులలో ఒకరిని తన కోసం ప్రార్థించమని కోరేవారు. అదేవిధంగా, ఏ పనినైనా స్వయంగా చేయడానికి వారు (స) ఎప్పుడూ సంకోచించేవారు కాదు. ఇతరులకు చూపించి, వారికి నేర్పించడానికి అతి చిన్న పనులను కూడా స్వయంగా చేసేవారు.

ఈ విషయానికి సంబంధించి హ్రజత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఒక కథనంలో ఇలా తెలిపారు: "ప్రవక్త (స) ఒక మేక చర్మాన్ని వలుస్తున్న బాలుడి దగ్గరగా వెళ్లారు. ప్రవక్త (స) అతనిని పక్కకు జరిపి, 'వెనక్కి జరుగు. సరైన పద్ధతిని నేను నీకు చూపిస్తాను. ఎందుకంటే నీకు చర్మం వలవడంలో ఇంకా నైపుణ్యం లేదని నాకు అనిపిస్తోంది' అని అన్నారు. ఆ తర్వాత ప్రవక్త (స) తన చేతిని చర్మం మరియు మాంసం మధ్య ఉంచి, తన భుజం వరకు మొత్తం చేయి కనిపించకుండా లోపలికి చొప్పించారు. అనంతరం, 'ఇలా చేయాలి. యువకుడా, ఈ విధంగా చర్మాన్ని వలువు' అని అన్నారు." ప్రవక్త (స) స్వయంగా తన పనిని చేసుకుంటూనే, అదే సమయంలో ఆ బాలుడికి దానిని నేర్పించారు. (సునన్ అబీ దావూద్, కితాబుత్-తహారహ్, బాబుల్-వజూఉ మిన్ మస్సిల్-లహ్మ..., హదీస్ 185)

అదేవిధంగా, హ్రజత్ ఖబ్బాబ్ (రజి) కుమార్తె ఇలా ఉల్లేఖించారు: ఇది ప్రవక్త (స) ఎంతటి వినయంతో ఉండేవారో, ఇతరుల పనులను స్వయంగా ఎలా చేసేవారో చూపిస్తుంది. హ్రజత్ ఖబ్బాబ్ (రజి) కుమార్తె ఒక మేకను తీసుకుని దానిని పితకించేందుకు ప్రవక్త (స) వద్దకు వచ్చింది. ప్రవక్త (స) ఆ మేకను కట్టి, స్వయంగా పాలు పితికారు. అనంతరం ఆమెతో ఇలా అన్నారు: "నీ దగ్గర ఉన్న పెద్ద పాత్రను నా వద్దకు తీసుకురా." ఆమె అప్పటికే ఒక పాత్రను తీసుకువచ్చింది. అయితే ప్రవక్త (స) ఇలా అన్నారు: "లేదు, దీనికంటే పెద్ద పాత్రను తీసుకురా." ఆమె మరింత పెద్ద పాత్రను తీసుకువచ్చింది. ప్రవక్త (స) ఆ పాత్ర నిండే వరకు మేక పాలను అందులో పితికారు. ఆ తరువాత ఇలా అన్నారు: "మీరందరూ ఇందులోని పాలను త్రాగండి. మీ పొరుగు వారికి కూడా కొంత ఇవ్వండి." (మస్నద్ అబూ దావూద్, తయాలిసి, సంపుటి 3, పేజి 239-240, హదీస్ 1768, దారుల్ హిజర్ మిసర్ 1999)

నిశ్చయంగా, ప్రవక్త (స) చేసిన ప్రార్థన యొక్క శుభముల వల్ల ఆ పాలు అసాధారణంగా పెరిగినట్లు తెలుస్తోంది. సాధారణంగా లభించే దానికంటే రెండింతల పాలు ఆ మేక నుండి లభించాయి. అందువల్ల, ఈ శుభములను ఇతరులతో కూడా పంచుకోవాలని ప్రవక్త (స) ఆమెకు సూచించారు.

ఇతరులను పలకరించే విధానం మరియు సమావేశాలలో కూర్చునే విధానంలో కూడా ప్రవక్త (స) వారి వినయం మరియు ఉన్నతమైన నైతిక స్వభావానికి అనేక ఉదాహరణలు ఉన్నాయి.

హ్రజత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఇలా వివరిస్తున్నారు: "ఎవరైనా ప్రవక్త (స) వద్దకు వచ్చినప్పుడు, వారు (స) అతనితో కరచాలనం చేసేవారు. ఎదుటి వ్యక్తి స్వయంగా తన చేతిని వెనక్కి తీసుకునే వరకు వారు (స) తన చేతిని వెనక్కి తీసుకునే వారు కాదు. అలాగే, ఎదుటి వ్యక్తి స్వయంగా తన ముఖాన్ని తిప్పుకునే వరకు ప్రవక్త (స) తన పవిత్ర ముఖాన్ని అతని వైపు నుండి తిప్పుకునేవారు కాదు. అంతేకాకుండా, వారు (స) తన సహచరుడి ముందు మోకాళ్లు చాచి కూర్చున్నట్లు ఎప్పుడూ చూడబడలేదు." (జామిఅ తిర్మిజీ, కితాబు సిఫతుల్ ఖియామతు వర్రిఖాయిఖు, బాబ్ 46, హదీస్ 2490)

మరో ఉల్లేఖనం గలదు. హ్రజత్ అబూ ముసన్నా అమ్లూకీ (రజి) ఇలా ఉల్లేఖించారు. " ప్రవక్త (స) మరియు వారి కంటే పూర్వం వచ్చిన ప్రవక్తలు కూడా చేతి కర్రను ఆధారంగా చేసుకుని నడిచేవారు మరియు దానిపై ఆనుకునేవారు." (సుబూలుల్ హుదా వర్రిషాద్, సంపుటి 7, పేజి 32, దారుల్ కుతుబుల్ ఇల్మియత్)

ఈ చేతికర్రను ఇతరులలో భయభక్తులను కలిగించడానికి లేదా గొప్పతనాన్ని ప్రదర్శించడానికి ఉపయోగించలేదు. నిజానికి, అది సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సమక్షంలో వినయం మరియు అణకువకు ప్రతీకగా ఉండేది. ప్రవక్త (స) వారి వినయం అందరికంటే అత్యున్నతమైనది.

ప్రవక్త (స) ఎంతో విజ్ఞానవంతముగా ప్రజలకు వినయంగా ఉండమని ఉపదేశించేవారు.

ఇబ్న్ హజ్‌న్ ఇలా ఉల్లేఖించారు. ఒకసారి ఒంటెలను పెంచేవారికి, మేకలను పెంచేవారికి మధ్య గొప్పతనం మరియు ప్రగల్భాల విషయంలో వివాదం ఏర్పడింది. ప్రతి వర్గం మరొక వర్గం కంటే తామే గొప్పవారమని చెప్పుకుంటోంది. అనేక ఒంటెలను కలిగి ఉన్న ఒంటెల యజమానులు, "మేము మీకంటే గొప్పవాళ్లం, మాకు ఎక్కువ సంపద మరియు సౌకర్యాలు ఉన్నాయి" అని చెప్పేవారు. మేకల యజమానులు కూడా తమ ఆధిక్యతను చాటుకునేవారు. ఈ విధంగా చర్చ మరియు పోటీ జరుగుతున్న సమయంలో ప్రవక్త (స) అక్కడికి వచ్చారు. వారు (స) ఇలా అన్నారు: "మూసా (అ.) ప్రవక్తగా పంపబడారు. ఆయన మేకలను మేపేవారు. దావూద్ (అ) ప్రవక్తగా పంపబడారు. ఆయన మేకలను మేపేవారు. అలాగే నేను కూడా ప్రవక్తగా పంపబడ్డాను.

నేను అజ్యాద్‌లో నా కుటుంబానికి చెందిన మేకలను మేపేవాడిని." (సునన్ కుబ్రా, బ్లైన్నిసాయి, కితాబుతఫ్సీర్, హదీస్ 11262, సంపుటి 10, పేజి 171-172, బీరూట్)

ఈ విధంగా, ప్రగల్భాలు పలుకుతున్న వారికి వారు (స) వినయాన్ని బోధించారు. అదే సమయంలో, మేకలను మేపుతున్నారనే కారణంతో ఇతరులు తమ కంటే తక్కువవారిగా భావిస్తున్న వారికి వారు ధైర్యం మరియు ఓదార్పును అందించారు.

ప్రవక్త (స) ప్రస్తావించిన అజ్యాద్ అనే ప్రదేశం మక్కాలోని సఫా సమీపంలో ఉన్న ప్రాంతం. దీనిని జియాద్ అని కూడా పిలుస్తారు.

(ముఅజముల్ బల్దాన్, సంపుటి 1, పేజి 130)

ప్రవక్త (స)లో ఏమాత్రం అహంకారం లేదా గర్వం ఉండేది కాదు. వారు (స) పేదవారిని సైతం ఎంతో వినయంతో కలుసుకుని, వారిని ఓదార్చి, గౌరవించేవారు.

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఇలా ఉల్లేఖించారు: బదవీలలో అంటే గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారిలో జాహిర్ అనే ఒక వ్యక్తి ఉండేవాడు. అతను గ్రామీణ ప్రాంతం నుంచి ప్రవక్త (స) కోసం తరచుగా బహుమతులు తీసుకువచ్చేవాడు. అవి గ్రామీణ జీవితానికి సంబంధించిన వివిధ వస్తువులుగా ఉండేవి. అతను తిరిగి వెళ్లడానికి సిద్ధమైనప్పుడు, ప్రవక్త (స) కూడా అతనికి సమృద్ధిగా ఆహార సామగ్రి, ఇతర వస్తువులు ఇచ్చి పంపేవారు. ప్రవక్త (స) ఇలా అనేవారు: "జాహిర్ మన ఎడారి స్నేహితుడు (అంటే గ్రామీణ స్నేహితుడు), మనం అతని పట్టణ స్నేహితులం." ఒకరోజు జాహిర్ మార్కెట్‌లో కొన్ని వస్తువులను విక్రయిస్తున్నప్పుడు, ప్రవక్త (స) వెనుక నుంచి వచ్చి అతన్ని తన ఛాతీకి ఆనించి కౌగిలించుకున్నారు. హజ్రత్ జాహిర్‌కు అది ఎవరో కనిపించలేదు. అందువల్ల అతను, "ఎవరు ఇది? నన్ను వదిలేయండి!" అని అన్నాడు. అయితే అతను వెనక్కి తిరిగి ప్రవక్త (స)ను గుర్తించిన వెంటనే, ప్రేమతో తన వీపును ప్రవక్త (స) యొక్క పవిత్ర ఛాతీకి ఆనిస్తూ ఉండిపోయాడు. అప్పుడు ప్రవక్త (స) ఇలా అనడం ప్రారంభించారు: "ఈ బానిసను ఎవరు కొనుగోలు చేస్తారు?" హజ్రత్ జాహిర్ ఇలా సమాధానమిచ్చాడు: "అల్లాహ్ ప్రవక్తా (స), అలా అయితే మీరు నన్ను చాలా విలువలేని వస్తువుగా కనుగొంటారు. నన్నెవరు కొనుగోలు చేస్తారు?" దీనికి ప్రవక్త (స) ఇలా అన్నారు: "కాదు. అల్లాహ్ దృష్టిలో నీవు ఏమాత్రం విలువలేని వాడివి కావు." లేదా వారు (స) ఇలా అన్నారు: "అల్లాహ్ దృష్టిలో నీవు ఎంతో విలువైనవాడివి." (సహీ ఇబ్న్ హిబ్బాన్, కితాబ్ అల్-హజర్ వల్-ఇబాహహ్, బాబ్ అల్-మజాహ్ వద్-దహాక్, హదీసు 5790, దార్ అల్-మఅరిఫహ్, 2004, పుట 1543)

హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) తన ఒక ఖుత్బాలో ఈ సంఘటనను ప్రస్తావిస్తూ, దానిని ఈ విధంగా వివరించారు: "ప్రవక్త (స) సహచరుల్లో ఒకరికి పుట్టుకతోనే ఒక లోపం ఉండేది. దాని కారణంగా అతని రూపం చాలా ఆకర్షణీయంగా ఉండేది కాదు. అంతేకాకుండా, అతను అత్యంత పేదవాడు కూడా. అతని శరీరం, బట్టలు దుమ్ముతో కప్పబడి ఉండేవి. ఆ స్థితిలో, చెమటతో తడిసి, అతను మార్కెట్‌లో మరొకరి కోసం కొన్ని వస్తువులను విక్రయిస్తున్నాడు. అయితే ప్రవక్త (స) దృష్టిలో ఆ సహచరుడికి ఎంతో అపారమైన విలువ ఉంది. (ప్రవక్త (స) అతనిని ఎంతో గౌరవించే వారు.) "ఆ సమయంలో, ఆ సహచరుడు తన పరిస్థితి పట్ల తానే అసహ్యంగా భావించి ఉండవచ్చు. తాను చెమటతో తడిసి, దుమ్ముతో కప్పబడి ఉన్నానని అనుకుంటూ ఉండ వచ్చు. అప్పుడు ప్రవక్త (స) అతని వెనుక నుంచి వచ్చి, పిల్లలతో సరదాగా ఆడుకున్నట్లుగా, తన చేతులతో అతని కళ్లను మూసారు. "ఆ సహచరుడు ఆ చేతులను తాకి, అవి ప్రవక్త (స) చేతులని గుర్తించాడు. ఎందుకంటే ప్రవక్త (స) శరీరంపై వెంట్రుకలు చాలా తక్కువగా ఉండేవి లేదా అసలు ఉండేవి కావు, మరియు ప్రవక్త (స) శరీరం ఎంతో మృదువుగా ఉండేది. వారిని గుర్తించిన వెంటనే, ఆ సహచరుడు కూడా ప్రేమతో తన శరీరాన్ని ప్రవక్త (స) శరీరానికి రుద్దడం ప్రారంభించాడు. దాంతో ప్రవక్త (స) బట్టలు, శరీరం కూడా మురికిగా మారాయి. అయినప్పటికీ, ప్రవక్త (స) దానిని ఏమాత్రం పట్టించుకోలేదు. "తర్వాత ప్రవక్త (స) అతనిపై తన చేయి ఉంచి ఇలా అన్నారు: 'ఇతను నా బానిస. ఇతన్ని ఎవరైనా కొనుగోలు చేస్తారా?' "దానికి ఆ సహచరుడు భావోద్వేగానికి లోనై ఇలా అన్నాడు: 'ఓ నా ప్రియమైన యజమానీ! ఇది పనికిరాని, విలువలేని వస్తువు. ఇతన్ని ఎవరు కొనుగోలు చేస్తారు?' " ప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు: 'ఎప్పటికీ కాదు! సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దృష్టిలో ఇతనికి అపారమైన విలువ ఉంది.'"

(ఖుత్బాత్-ఎ-మహ్మూద్, సంపుటి 3, పుట 663)

హజ్రత్ హసన్ బిన్ అలీ (రజియల్లాహు అన్హు) ఒకసారి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి ఉన్నత నైతిక విలువలు, వినయం, ప్రజలతో వ్యవహరించే విధానంలోని మహోన్నత స్వభావం, అలాగే వారి సుందరమైన రూపురేఖలను వివరిస్తూ ఇలా ఉల్లేఖించారు: "నేను నా మేనమామ హింద్ బిన్ అబీ హాలహ్‌ను ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి పవిత్ర రూపురేఖల గురించి అడిగాను. ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి రూపురేఖలను ఎంతో వివరంగా వర్ణించేవారు. అందులో కొంతైనా నా ముందు చెప్పాలని నేను కోరుకున్నాను. అప్పుడు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి రూపురేఖలను ఇలా వివరించారు: ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎంతో గంభీరమైన, ఆకర్షణీయమైన రూపాన్ని కలిగి ఉండేవారు. వారి పవిత్ర ముఖకాంతి పౌర్ణమి రాత్రి పద్నాలుగో రోజు చంద్రుని వలె ప్రకాశిస్తూ ఉండేది."ఆ తరువాత ఆయన మొత్తం హదీసును వివరంగా వివరించి, ప్రతి విషయాన్ని వర్ణించారు. హజ్రత్ హసన్ (రజియల్లాహు అన్హు) ఇలా అన్నారు: "కొంతకాలం నేను ఈ వర్ణనను హజ్రత్ హుసైన్ (రజియల్లాహు అన్హు) నుండి దాచిపెట్టాను. అంటే, నా మేనమామ నుండి నేను తెలుసుకున్న విషయాలను ఆయనకు చెప్పలేదు. తరువాత నేను ఆయనకు ఈ విషయాలను వివరించాను. అయితే, ఈ విషయంలో ఆయన అప్పటికే నాకంటే ముందుకు వెళ్లిపోయారని తెలుసుకున్నాను. నేను అడగకముందే ఆయన ఇదే విషయాలను అడిగారు. అంతేకాకుండా, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇంట్లోకి రావడం, ఇంటి నుండి వెళ్లడం వంటి విషయాల గురించి, అలాగే వారి రూపురేఖల గురించి ఆయన తన తండ్రిని కూడా అడిగారని, ఒక్క వివరాన్ని కూడా అడగకుండా వదిలిపెట్టలేదని నేను తెలుసుకున్నాను." హజ్రత్ ఇమామ్ హుసైన్ (రజియల్లాహు అన్హు) ఇలా పేర్కొన్నారు: "నేను నా తండ్రిని ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తమ ఇంటిలోకి ప్రవేశించినప్పుడు వారి విధానం ఎలా ఉండేదని అడిగాను." (ఇంతకుముందు చర్చలు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి ఇంటి వెలుపలి జీవితానికి సంబంధించినవి. అయితే, ఇంటి లోపలి విషయాల గురించి హజ్రత్ అలీ (రజియల్లాహు అన్హు)ను అడిగినప్పుడు ఆయన ఇలా సమాధానమిచ్చారు:) " ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇంటిలోకి ప్రవేశించినప్పుడు, తమ సమయాన్ని మూడు భాగాలుగా విభజించేవారు. ఒక భాగాన్ని అల్లాహ్ కోసం, ఒక భాగాన్ని తమ కుటుంబం కోసం, మరొక భాగాన్ని తమ కోసం కేటాయించేవారు. తరువాత తమ కోసం కేటాయించిన భాగాన్ని కూడా తమకు మరియు ప్రజలకు మధ్య విభజించేవారు. ఈ విధంగా, కొంతమంది ఎంపికైన సహచరుల ద్వారా సాధారణ ప్రజలకు ధార్మిక బోధనలను చేరవేసేవారు. వారి నుండి ఏ విషయాన్నీ దాచేవారు కాదు. తమ జీవితంలో ఉమ్మత్ కోసం సమయాన్ని కేటాయించే విధానం ఏమిటంటే, సమావేశాలకు అనుమతి ఇస్తున్నప్పుడు, ప్రజల్లో శ్రేష్ఠత మరియు ప్రత్యేకత కలిగిన వారికి ప్రాధాన్యత ఇచ్చేవారు. వారి విశ్వాసం ఎంత గొప్పదో దానికి అనుగుణంగా వారికి స్థానం కల్పించేవారు. వారిలో కొందరికి ఒక ప్రశ్న ఉండేది, కొందరికి రెండు ప్రశ్నలు ఉండేవి, మరికొందరికి అనేక ప్రశ్నలు ఉండేవి. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి ప్రశ్నలకు సమాధానం ఇవ్వడంలో నిమగ్నమై ఉండేవారు. వారు కోరినప్పుడు, వారి వ్యక్తిగత జీవితాన్ని మరియు సమాజాన్ని రెండింటినీ సంస్కరించే విషయాలలో వారితో చర్చించేవారు. వారికి ప్రయోజనకరమైన విషయాలను తెలియజేసి ఇలా చెప్పేవారు: 'మీలో ఇక్కడ ఉన్నవారు, ఇక్కడ లేని వారికి ఈ విషయాలను తెలియజేయాలి. అలాగే, తమ అవసరాలను స్వయంగా నా వద్దకు తెలియజేయలేని వారి అవసరాలను నాకు తెలియజేయండి. ఎందుకంటే, ఒక వ్యక్తి తన అవసరాన్ని స్వయంగా తెలియజేయలేని పరిస్థితిలో, అతని అవసరాన్ని ఒక పాలకుని వద్దకు ఎవరు చేరవేస్తారో, అల్లాహ్ వారికి తీర్పు దినాన స్థిరత్వం మరియు దృఢ సంకల్పాన్ని ప్రసాదిస్తాడు.'"

అందువల్ల, వివిధ ప్రాంతాల్లో నియమించబడిన కార్యనిర్వాహకులకు కూడా ఇందులో ఒక పాఠం ఉంది. వారు ప్రజల అవసరాలను తప్పనిసరిగా కేంద్ర కార్యాలయానికి (మర్కజ్‌కు) తెలియజేయాలి.

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ఇలాంటి విషయాల గురించి ప్రశ్నించినప్పుడు, ప్రవక్త (స) వారి మాటలను స్వీకరించేవారు మరియు వారి సాక్ష్యం తప్ప మరెవరి సాక్ష్యాన్ని అంగీకరించేవారు కాదు. ప్రజలు తమ అవసరాలతో వారి వద్దకు వచ్చేవారు, వారు ఎన్నడూ ఖాళీ చేతులతో తిరిగి వెళ్లేవారు కాదు. బదులుగా, వారు ఇతరులకు సన్మార్గం చూపించే మార్గదర్శకులుగా మారి తిరిగి వెళ్లేవారు.

హజ్రత్ ఇమామ్ హుసైన్ (రజియల్లాహు అన్హు) ఇలా అన్నారు: "తరువాత నేను నా తండ్రిని ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇంటి వెలుపల ఉన్నప్పుడు వారి ప్రవర్తన ఎలా ఉండేదో, ఆ సమయంలో వారు ఏమి చేసేవారో అడిగాను."ఆయన ఇలా సమాధానమిచ్చారు: " ప్రవక్త (స) ఉద్దేశపూర్వకమైన మరియు ప్రయోజనకరమైన విషయం తప్ప మరేమీ మాట్లాడేవారు కాదు. వారు (స) తన సహచరుల మధ్య సామరస్యాన్ని, మనశ్శాంతిని నెలకొల్పేవారు. వారిని ఎప్పుడూ దూరం చేసేవారు కాదు. ప్రతి తెగకు, ప్రతి జాతికి చెందిన గౌరవనీయమైన వ్యక్తిని వారు (స) గౌరవించి, ప్రజలపై నాయకులుగా వారిని నియమించేవారు. వారు (స) ప్రజలను హెచ్చరించేవారు మరియు వారి విషయంలో అప్రమత్తంగా ఉండేవారు. అయితే, ఆ అప్రమత్తత వారి పట్ల వారి ఉల్లాసభరితమైన స్వభావాన్ని లేదా సద్భావపూర్వకమైన ప్రవర్తనను ప్రభావితం చేయనివ్వరు." అంటే, ఎవరి గురించి ఇతరులను హెచ్చరించినా లేదా ఒక వ్యక్తి విషయంలో అప్రమత్తంగా ఉన్నా, ఆ వ్యక్తి పట్ల వారు (స) బాహ్య ప్రవర్తనలో, మర్యాదలో ఎలాంటి మార్పు ఉండేది కాదు. జాగ్రత్త అవసరమైన చోట జాగ్రత్త వహిస్తూనే, అందరి పట్ల ప్రేమతో, మంచి మర్యాదతోనే వారు (స) వ్యవహరించేవారు. వారు (స)తన సహచరుల పరిస్థితిని గమనిస్తూ ఉండేవారు మరియు ఇతరుల పరిస్థితుల గురించి ప్రజలను అడిగి తెలుసుకునేవారు. మంచి పనులను ప్రశంసించి, వాటిని మరింత బలపరచడానికి సహాయపడేవారు. చెడు పనులను సూచించి, వాటి ప్రభావాన్ని తొలగించే వారు. ప్రతి విషయంలో వారు(స) సమతుల్యతతో ఉండేవారు. వారిలో ఎలాంటి వైరుధ్యం ఉండేది కాదు. ఇతరులు నిర్లక్ష్యంగా మారకుండా లేదా అలసిపోకుండా ఉండేందుకు వారు (స) ఎప్పుడూ అజాగ్రత్తగా ఉండేవారు కాదు. ప్రతి పరిస్థితికీవారు (స) సిద్ధంగా ఉండేవారు.

సత్యం మరియు న్యాయం విషయంలో వారు (స) ఎప్పుడూ వెనుకడుగు వేయలేదు. అలాగే హద్దులను కూడా దాటేవారు కాదు. తనకు చేయవలసిన హక్కు ఎంత ఉందో, అంతే చేసేవారు. ప్రజలలో వారికి అత్యంత సన్నిహితులైనవారు వారిలోని ఉత్తములు. వారి దృష్టిలో అత్యంత శ్రేష్ఠుడు అత్యంత నిజాయితీ, నిష్కపటత మరియు దయ కలిగిన వ్యక్తి. వారి సమీపంలో అత్యున్నత స్థానం పొందినవాడు ఇతరుల పట్ల అత్యధిక సానుభూతి, సహాయం చూపించేవాడు. ఎవరు ఈ లక్షణాలను ఎక్కువగా కలిగి ఉంటారో వారు వారికి అంతగా సన్నిహితులు. వారు(స) కూడా వారిని ఇష్ట పడేవారు." హజ్రత్ ఇమామ్ హుసైన్ (ర) ఇలా చెబుతున్నారు: "తర్వాత నేను ప్రవక్త (స) వారి సమావేశాల గురించి అడిగాను. ఆయన ఇలా సమాధానమిచ్చారు: 'వారు

(స) కూర్చున్నా, నిలబడినా, ఎల్లప్పుడూ అల్లాహ్ స్మరణలో నిమగ్నులై ఉండేవారు. ఎప్పుడైనా ఒక సమావేశంలో చేరితే, సమావేశం చివర్లో ఎక్కడ స్థలం ఉంటే అక్కడే కూర్చునే వారు. ఇతరులకు కూడా అలాగే చేయాలని ఉపదేశించేవారు.తనతో కూర్చున్న ప్రతి వ్యక్తికి వారు (స) అతనికి తగిన హక్కును అందించేవారు. ఎంతగా అంటే, వారి సమక్షంలో మరొక వ్యక్తికి తనకంటే ఎక్కువ గౌరవం లభిస్తోందని ఎవరికీ అనిపించేది కాదు. ఎవరైనా ఏదైనా అవసరం లేదా పని నిమిత్తం వారి (స)తో కూర్చుంటే, ఆ వ్యక్తి స్వయంగా వెళ్లిపోయే వరకు వారు (స) అతనితోనే ఉండేవారు. ఎవరైనా వారిని ఏదైనా అడిగితే, ఏదో ఒకటి ఇచ్చే అవకాశం లేకపోయినా, కనీసం ప్రేమతో మరియు మృదువుగా సమాధానం ఇవ్వకుండా ప్రవక్త (స) వారిని వెనక్కి పంపేవారు కాదు. అంటే, ఎవరైనా సహాయం కోరుతూ వారి వద్దకు వస్తే, సాధ్యమైతే ఏదైనా ఇచ్చేవారు; ఇవ్వలేని పరిస్థితిలో ఉంటే కూడా ఎంతో సౌమ్యంగా, మృదువుగా సమాధానం ఇచ్చేవారు."

ప్రవక్త (స) ఉల్లాసభరితమైన స్వభావం, ఔదార్యం, ఉత్తమమైన వ్యక్తిత్వం అందరికీ అందుబాటులో ఉండేవి. వారు (స) ప్రజలకు తండ్రివలె మారిపోయారు. హక్కుల విషయానికి వస్తే, వారి దృష్టిలో అందరూ సమానులే. వారి సమావేశాలు విజ్ఞానం, వినయం, సహనం మరియు విశ్వసనీయతతో నిండినవిగా ఉండేవి. అక్కడ స్వరాలు పెంచి మాట్లాడేవారు కాదు. పవిత్రమైన విషయాలను అవమానించేవారు కాదు. ఇతరుల బలహీనతలను గురించి చర్చించేవారు కాదు. అందరూ సమానులే, వారి స్థానాన్ని నిర్ణయించేది కేవలం వారి ధర్మనిష్ఠ స్థాయి మాత్రమే. (వారి సమావేశాలలో ఇతరుల బలహీనతలను ఎన్నడూ చర్చించేవారు కాదు.) వారి సమావేశాలలో ప్రజలు ఒకరితో ఒకరు ఎంతో వినయంగా వ్యవహరించేవారు. వృద్ధులను గౌరవించేవారు, చిన్న వారిపై కరుణ చూపేవారు, అవసరంలో ఉన్నవారికి ప్రాధాన్యత ఇచ్చేవారు, అపరిచితుల పట్ల కూడా శ్రద్ధ వహించేవారు. ఎవరైనా అపరిచితుడు వచ్చినప్పుడు అతన్ని నిర్లక్ష్యం చేసేవారు కాదు. అతని పట్ల కూడా శ్రద్ధ చూపించేవారు."

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా పేర్కొన్నారు: "అల్లాహ్ ప్రసన్నత కోసం పూర్తిగా అంకితమైన వారు తమకు ఏదైనా హోదా లేదా నాయకత్వం ప్రసాదించబడాలని కోరుకోరు. అలాంటి హోదాల కంటే, ఏకాంతంలో ఉండటం మరియు ఒంటరిగా ఆరాధన చేయడంలోని ఆనందాన్నే వారు ఎంతో ఇష్టపడతారు. అయినప్పటికీ, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారిని ముందుకు తీసుకువచ్చి, మానవాళి అభ్యున్నతి కోసం వారిని నియమిస్తాడు. మన గౌరవనీయ ప్రవక్త (స) కూడా ఒక గుహలో ఏకాంతంగా ఉండేవారు. తన గురించి ఎవరికీ తెలియకూడదని కోరుకునేవారు. కానీ చివరికి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారిని బయటకు తీసుకువచ్చి, ప్రపంచానికి మార్గదర్శకత్వం వహించే బాధ్యతను వారికే అప్పగించాడు. వేలాది మంది కవులు ప్రవక్త (స) వద్దకు వచ్చి, వారిని ప్రశంసిస్తూ పద్యాలు రచించేవారు. అయితే ప్రవక్త (స) వారి ప్రశంసలకు ఉప్పొంగిపోయేవారని ఎవరైనా ఊహిస్తే, అలాంటి హృదయం నిజంగా శపించబడినదే. వారు అలాంటి ప్రశంసలను మృత కీటకాలతో సమానంగా భావించే వారు. నిజమైన ప్రశంస అనేది అల్లాహ్ స్వర్గం నుండి ప్రకటించేదే. అలాంటి వ్యక్తులు పూర్తిగా అల్లాహ్ ప్రేమలో మునిగిపోయి ఉంటారు. ప్రపంచపు ప్రశంసలు, పొగడ్తల గురించి వారికి ఏమాత్రం ఆసక్తి ఉండేది కాదు. వారి స్థాయి చివరకు అలా మారుతుంది. అల్లాహ్ స్వయంగా ఆకాశాల నుండి, తన సింహాసనం నుండి వారిని ప్రశంసించి, కీర్తిస్తాడు." (మల్ఫూజాత్ సంపుటి 4, పేజీలు 338-339, ప్రచురణ 2022)

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) మరల ఇలా పేర్కొన్నారు: "ఒకసారి ఒక క్రైస్తవుడు ప్రవక్త (స) వద్దకు వచ్చాడు. వారు (స) అతనిపట్ల ఎంతో దయ మరియు ఆతిథ్యాన్ని చూపించారు. ఆ వ్యక్తి చాలా ఆకలితో ఉన్నాడు. ప్రవక్త (స) అతనికి సమృద్ధిగా ఆహారం పెట్టి, అతని ఆకలి పూర్తిగా తీరేలా చేశారు. రాత్రివేళ, పవిత్ర ప్రవక్త (స) ఎంతో ఔదార్యంతో తన స్వంత దుప్పటిని అతనికి ఇచ్చారు. ఆ వ్యక్తి నిద్రపోయిన తరువాత, అతనికి తీవ్రమైన విరేచనాలు వచ్చాయి. తనను తాను అదుపు చేసుకోలేక, ఆ దుప్పటిలోనే మలవిసర్జన చేశాడు. మరుసటి ఉదయం, ప్రవక్త (స) తన పరిస్థితిని చూసి అసహ్యించుకుంటారని అతను అనుకున్నాడు. సిగ్గుతో అతను నిశ్శబ్దంగా అక్కడి నుండి వెళ్లిపోయాడు. ప్రజలు దీనిని గమనించి, ఆ క్రైస్తవ అతిథి దుప్పటిని మలంతో అపవిత్రం చేశాడని ప్రవక్త (స)కు తెలియజేశారు. అప్పుడు ప్రవక్త (స) ఇలా అన్నారు: 'దానిని నా వద్దకు తీసుకురండి, నేను దానిని శుభ్రం చేస్తాను.' ప్రజలు ఇలా విన్నవించుకున్నారు: 'ఓ అల్లాహ్ ప్రవక్తా (స), మీరు ఎందుకు శ్రమపడాలి? మేము ఇక్కడ ఉన్నాము; మేమే దానిని శుభ్రం చేయగలము.' అయితే ప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు: 'అతను నా అతిథి; కాబట్టి అతని పట్ల ఈ బాధ్యత నాదే.' తర్వాత ప్రవక్త (స) నీటిని తెప్పించి, స్వయంగా ఆ దుప్పటిని శుభ్రం చేయడం ప్రారంభించారు. (అత్యంత వినయంతో, తన అతిథి వదిలివెళ్లిన అపవిత్రతను స్వయంగా శుభ్రం చేశారు.)" క్రైస్తవుడు సుమారు రెండు మైళ్ల దూరం ప్రయాణించిన తర్వాత, తాను తన బంగారు శిలువను మంచంపై మర్చిపోయినట్లు గుర్తు చేసుకున్నాడు. అందువల్ల అతను తిరిగి వచ్చాడు. అక్కడ ప్రవక్త (స) స్వయంగా ఆ దుప్పటి మీద ఉన్న మలినాన్ని కడుగుతున్నట్లు చూశాడు. తీవ్ర పశ్చాత్తాపానికి లోనైన అతను ఇలా అన్నాడు: "ఇది నా విషయంలో జరిగి ఉంటే, నేను దానిని ఎప్పటికీ స్వయంగా కడిగి ఉండే వాడిని కాదు." ఈ సంఘటన ఫలితంగా, ఇంతటి నిస్వార్థత మరియు వినయాన్ని కలిగి ఉన్న వ్యక్తి తప్పకుండా సర్వశక్తిమంతుడైన దేవునిచే నియమించబడిన వారై ఉండాలని ఆ క్రైస్తవుడు గ్రహించాడు. ఈ దృశ్యాన్ని ప్రత్యక్షంగా చూసిన తరువాత, ఆ క్రైస్తవుడు ఇస్లాంను స్వీకరించాడు." **(మల్ఫూజాత్, సంపుటి 5, పుట 205-206)**

ప్రవక్త (స) వారి వినయం మరియు అణకువ వారికి మొదటి దివ్యవాణి వచ్చిన సమయంలో కూడా వ్యక్తమయ్యాయి. హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (ర) హిరా గుహలో జరిగిన సంఘటనను వివరిస్తూ ఇలా పేర్కొన్నారు: "మొట్టమొదటి దివ్యవాణి హిరా గుహలో అవతరించింది. జిబ్రయీల్ ప్రవక్త (స) ఎదుట ప్రత్యక్షమై, 'చదవండి' అని అన్నారు. అందుకు ప్రవక్త (స) ఇలా అన్నారు: మా అనా బిఖారిఇన్. అనగా "నాకు చదవడం తెలియదు." దీని ద్వారా ప్రవక్త (స) ఉద్దేశించింది ఏమిటంటే, ఇంతటి భారాన్ని తనపై మోపకూడదని. దీని అర్థం ప్రవక్త (స) ఎదుట ఒక పుస్తకాన్ని ఉంచగా, వారు (స) దానిని చదవలేకపోయారని కాదు. వాస్తవానికి, జిబ్రయీల్ ఏదైతే తెలియజేశారో, దానిని ప్రవక్త (స) మౌఖికంగా పునరావృతం చేయవలసి ఉండేది; అది వారు (స) నిశ్చయంగా చేయగలిగిన విషయమే. అయినప్పటికీ ప్రవక్త (స) వినయాన్ని వ్యక్తం చేశారు. అయితే, అల్లాహ్ తాలా ఈ కార్యం కోసం ప్రత్యేకంగా వారిని ఎన్నుకున్నందున, జిబ్రయీల్ వారిని పదేపదే చదవమని ఆదేశించారు. చివరకు మూడవ ఆదేశం వచ్చినప్పుడు ప్రవక్త (స) పఠించారు. ఈ విధంగా జిబ్రయీల్ వారికి ఈ సూక్తిని బోధించారు: ఇఖ్రా బి ఇస్మి రబ్బికల్లజీ ఖలఖ అనగా "సృష్టించిన నీ ప్రభువు నామంతో చదవు."

**(ఫజాయిలుల్ ఖురాన్, సంఖ్య 2, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 11, పేజి 109)**

ఇదే సంఘటనకు సంబంధించి మరో సందర్భంలో, సూరహ్ అల్-కౌసర్‌ను వివరించేటప్పుడు హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (ర) తఫ్సీర్-ఎ-కబీర్‌లో ఇలా వ్రాశారు:

"ప్రవక్త (స)కు దివ్యవాణి వచ్చినప్పుడు, వారు (స) అసాధారణమైన వినయాన్ని ప్రదర్శించారు. సాధారణ ప్రజలకు దివ్యవాణి వచ్చినా లేదా వారు ఒక కలను చూసినా, వారు వెంటనే ఇతరుల వద్దకు పరుగెత్తి వెళ్లి, 'నాకు ఇలాంటి దివ్యవాణి వచ్చింది' లేదా 'నేను ఇలాంటి కలను చూశాను' అని ప్రకటించడాన్ని మనం చూస్తాము. కానీ జిబ్రయీల్ ప్రవక్త (స) వద్దకు వచ్చి, 'చదవండి' అని చెప్పినప్పుడు, వారు (స) ఇలా సమాధానమిచ్చారు: మా అనా బి ఖారిఇన్ అనగా "నాకు చదవడం తెలియదు." ప్రవక్త (స) ఈ మాటను మూడుసార్లు పునరావృతం చేశారు. అయితే, అల్లాహ్ తాలా ఈ విషయాన్ని పట్టుదలగా ఆదేశిస్తున్నారని వారు గ్రహించినప్పుడు, ఆ ఆదేశాన్ని విధేయతతో స్వీకరించారు. వాస్తవానికి, వారు (స) అంతటి ధైర్యంతో ఆ ఆదేశాన్ని పాటించారు కాబట్టి, మూసా (అ) వలె 'నా ప్రభువా! నాకు ఒక సహాయకుడిని నియమించు' అని చెప్పలేదు. బదులుగా, మొత్తం బాధ్యతను ఒంటరిగా తమ భుజాలపై స్వీకరించారు మరియు తనకు సహాయం చేయడానికి ఏ ఒక్క సహచరుడిని కోరలేదు."

**(తఫ్సీర్-ఎ-కబీర్, సంపుటి 15, పుటలు 138-139, ప్రచురణ 2023)**

హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (ర) ప్రవక్త (స) వినయానికి మరొక ఉదాహరణను ఇలా పేర్కొన్నారు: "మరోసారి, అన్సారులలో ఒక వ్యక్తి అనారోగ్యానికి గురయ్యాడు. ప్రవక్త (స) అతనిని పరామర్శించడానికి వెళ్లారు. ప్రవక్త (స) తిరిగి బయలుదేరుతున్నప్పుడు, ఆ అన్సారీ వ్యక్తి ప్రవక్త (స) స్వారీ చేయడానికి ఒక గుర్రాన్ని ఇచ్చి, తన కుమారునితో ఇలా అన్నాడు: 'అల్లాహ్ యొక్క సందేశవారుడు (స)తో పాటు వెళ్లు. మార్గమధ్యంలో వారికి మరొక సహచరుడు దొరకడం కష్టమవుతుందేమో అంటే, ప్రయాణంలో తోడుగా ఉండే మరొక వ్యక్తి దొరకకపోవచ్చు. అలాగే, తరువాత గుర్రాన్ని తిరిగి తీసుకురా.' "కొద్దిసేపటి తరువాత ఆ బాలుడు ఇంటికి తిరిగి వచ్చాడు. అతని తండ్రి అడిగాడు: 'అల్లాహ్ యొక్క సందేశవారుడి (స)తో పాటు ప్రయాణంలో ఉండి, వారికి భద్రత కల్పించడానికి మరియు గుర్రం అదుపులో ఉండేలా చూసేందుకు నేను నిన్ను పంపాను. మరి నువ్వెందుకు తిరిగి వచ్చావు?' "ఆ బాలుడు సమాధానమిచ్చాడు: 'నేను తిరిగి రావలసి వచ్చింది. అల్లాహ్ యొక్క సందేశవారుడు (స) బయటకు వచ్చినప్పుడు, వారు నాతో, "గుర్రంపై నా వెనుక కూర్చో" అని అన్నారు. నేను, "ఓ అల్లాహ్ యొక్క సందేశహరుడా (స), నేను ఇలాంటి అగౌరవానికి పాల్పడలేను" అని సమాధానమిచ్చాను. అప్పుడు ప్రవక్త (స) ఇలా అన్నారు: "అయితే, నేను గుర్రంపై స్వారీ చేస్తూ ఉండగా నువ్వు నడవడం కూడా నేను సహించలేను. నాతో పాటు గుర్రంపై స్వారీ చేయి, లేకపోతే ఇంటికి తిరిగి వెళ్లు."'"(ఆ బాలుడు ఇలా అన్నాడు:) అందువల్ల, ఇంటికి తిరిగి వెళ్లడమే మంచిదని నేను భావించాను. ప్రవక్త (స) ఒంటరిగా గుర్రంపై స్వారీ చేస్తూ వెళ్లారు." (తఫ్సీర్-ఎ-కబీర్, సంపుటి 15, పుట 157, ప్రచురణ 2023)

హజ్రత్ అబ్దుల్లా (రజి) ఇలా ఉల్లేఖించారు:"ఒకసారి అల్లాహ్ ప్రవక్త (స) ఒక ఈత చెట్ల ఆకులతో చేసిన చాపపై నిద్రించారు.వారు లేచినప్పుడు, ఆ చాప గుర్తులు వారి పవిత్ర ప్రక్కపై కనిపించాయి. మేము వినయపూర్వకంగా, 'ఓ అల్లాహ్ ప్రవక్తా (స), మీ కోసం మృదువైన పరుపును సిద్ధం చేసేందుకు మాకు అనుమతించండి' అని విన్నవించుకున్నాము. అందుకు ప్రవక్త (స.అ.వ.) ఇలా సమాధానమిచ్చారు: 'ఈ లోకంతో నాకేమి పని? ఈ లోకంలో నా ఉదాహరణ కేవలం ఒక ప్రయాణికుడి వంటిది. అతడు కొంతసేపు ఒక చెట్టు నీడలో విశ్రాంతి తీసుకుని, ఆపై దానిని వెనుక విడిచి వెళ్లిపోతాడు.'"

**(జామిఅ అత్తిర్మిజీ, కితాబ్ అజ్-జుహ్ద్, హదీస్ 2377)**

సహీ బుఖారీలో హజ్రత్ ఉమర్ (రజి) ఇలా ఉల్లేఖించారు. వారు (రజి ఇలా పేర్కొన్నారు: "ఒకసారి నేను ప్రవక్త (స)ను కలవడానికి వెళ్లాను. వారు ఒక పై గదిలో, అల్లిన చాపపై పడుకున్నారు. వారికి మరియు ఆ చాపకు మధ్య మరేదీ లేదు. వారి తల క్రింద ఖర్జూరపు తంతువులతో నింపిన తోలు దిండు ఉంది. వారి పాదాల సమీపంలో అకేషియా చెట్ల ఆకుల కుప్ప ఉండేది. వారి తల సమీపంలో కొన్ని శుద్ధి చేయని తోలు ముక్కలు వేలాడుతూ ఉండేవి. ఆ కఠినమైన చాపపై వారు (స) విశ్రాంతి తీసుకోవడం వల్ల వారి పవిత్ర ప్రక్కపై ఏర్పడిన చాప గుర్తులను కూడా నేను చూడగలిగాను. ఇది చూసినప్పుడు నేను ఏడవడం ప్రారంభించాను. ప్రవక్త (స) అడిగారు: 'నీవెందుకు ఏడుస్తున్నావు?' నేను సమాధానమిచ్చాను: 'ఓ అల్లాహ్ ప్రవక్తా (స), ఖిస్రా మరియు కైసర్‌లు ఎంతో విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారు, మరి మీరు అల్లాహ్ ప్రవక్త

(స). అందుకు ప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు: 'వారికి ఈ లోకం, మనకు పరలోకం ఉండటం పట్ల నీవు సంతృప్తి చెందలేవా?"

**(సహీ బుఖారీ, కితాబ్ తఫ్సీరి ఖుర్ఆన్, బాబ్ తబ్తగీ మర్జాత అజ్వాజిక, హదీస్ 4913, సంపుటి 12, నజారత్ ఇషాఅత్, పుటలు 264, 267)**

హజ్రత్ మసీహ్ మవూద్ (అ) ఇదే సంఘటనను వివరిస్తూ ఇలా అన్నారు:

" ప్రవక్త (స) తన ప్రాపంచిక అవసరాల విషయంలో ఎంతటి సంతృప్తిని కలిగి ఉండేవారో దీనివల్ల తెలుస్తుంది. ఒకసారి హజ్రత్ ఉమర్ (రజి) వారిని దర్శించడానికి వెళ్లారు. లోపలికి ప్రవేశించడానికి అనుమతి కోరేందుకు ముందుగా ఒక బాలుడిని పంపించారు. ప్రవక్త (స) ఖర్జూరపు ఆకులతో చేసిన ఒక చాపపై పడుకుని ఉన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) లోపలికి వచ్చినప్పుడు, ప్రవక్త (స) కూర్చున్నారు. "హజ్రత్ ఉమర్ (రజి) చుట్టూ చూశారు. ఆ ఇల్లు పూర్తిగా ఖాళీగా ఉంది. అలంకరణకు సంబంధించిన ఏ వస్తువూ లేదు. ఒక మేకుకు వేలాడుతున్న ఒక కత్తి మాత్రమే ఉంది. అలాగే ప్రవక్త (స) పడుకుని ఉన్న ఆ చాప మాత్రమే ఉంది. ఆ కఠినమైన చాప గుర్తులు వారి పవిత్ర వీపుపై ముద్రించబడి ఉన్నాయి. "ఇది చూసిన హజ్రత్ ఉమర్ (రజి) ఏడ్చారు. ప్రవక్త (స) అడిగారు: 'ఓ ఉమర్, నీవెందుకు ఏడుస్తున్నావు?' హజ్రత్ ఉమర్ (రజి) ఇలా విన్నవించుకున్నారు: 'ఖిస్రా మరియు కైసర్‌లు ఈ లోకంలోని అన్ని సుఖసౌకర్యాలు, విలాసాలను అనుభవిస్తున్నారు.మరి మీరు అల్లాహ్ ప్రవక్త (స), రెండు లోకాల రాజు, ఇలాంటి పరిస్థితిలో జీవిస్తున్నారు.' ప్రవక్త (స.) ఇలా సమాధానమిచ్చారు: 'ఓ ఉమర్, ఈ లోకంతో నాకేమి పని? నేను ఒంటెపై తన గమ్యస్థానం వైపు ప్రయాణించే ఒక ప్రయాణికుడిలా ఈ లోకం గుండా వెళ్తున్నాను. ఎడారి మార్గంలో తీవ్రమైన వేడి కారణంగా ఒక చెట్టు కనిపిస్తే, దాని నీడలో కొంతసేపు కూర్చుంటాడు. అతని చెమట కొద్దిగా ఆరగానే, మళ్లీ తన ప్రయాణాన్ని కొనసాగిస్తాడు." (మల్ఫూజాత్, సంపుటి 6, పుటలు 228-229, ప్రచురణ 2022)

మర్యాద లేని వ్యక్తులతో కూడా ప్రవక్త (స) ఎల్లప్పుడూ అత్యున్నతమైన సౌమ్యత, వినయం మరియు శ్రేష్ఠమైన ప్రవర్తనను ప్రదర్శించేవారు. హజ్రత్ అబూ హురైరా (రజి) ఇలా వివరించారు: ఒక వ్యక్తి తనకు రావలసిన బాకీని అడగడానికి ప్రవక్త (స) వద్దకు వచ్చాడు. అయితే అతడు చాలా కఠినమైన, అసభ్యమైన స్వరంతో మాట్లాడాడు. సహాబీలు దీనికి కోపగించుకున్నారు. కానీ ప్రవక్త (స) ఇలా అన్నారు: "అతడిని వదిలేయండి. ఎవరికైనా హక్కు రావలసి ఉంటే, తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచే హక్కు అతనికి ఉంది. అతనికి రావలసినది నేను ఎలాగైనా చెల్లించాలి. తన మాటను వ్యక్తపరిచే హక్కు అతనికి ఉంది."ఆ తర్వాత వారు (స) ఇలా అన్నారు: "అతనికి ఒక ఒంటెను కొనుగోలు చేసి ఇవ్వండి." అతడు తన బాకీని వసూలు చేసుకోవడానికి వచ్చాడు కాబట్టి, అతనికి ఒక ఒంటెను కొనుగోలు చేసి ఇవ్వమని ఆదేశించారు. సహాబీలు ఇలా అన్నారు: "అతనికి రావలసిన విలువకు సమానమైన ఒంటె మాకు దొరకలేదు. అంతకంటే ఎక్కువ విలువైన ఒంటె మాత్రమే అందుబాటులో ఉంది." ప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు: "అయితే దానినే కొనుగోలు చేసి అతనికి ఇవ్వండి. తన అప్పులను అత్యుత్తమంగా తీర్చేవాడే మీలో అత్యుత్తముడు." (మిష్కాతుల్-మసాబీహ్, కితాబ్ అల్-బుయూ, బాబ్ అల్-ఇఫ్లాస్ వల్-ఇన్జార్, అల్-ఫస్ల్ అల్-అవ్వల్, హదీస్ 2906, సంపుటి 1, దార్ అల్-కుతుబ్ అల్-ఇల్మియ్యా, పుట 537)

నేడు ఏర్పడే అనేక వివాదాలలో, ప్రజలు తమపై ఉన్న అసలు బాకీ మొత్తాన్ని కూడా చెల్లించడానికి ఇష్టపడరు. దానికి బదులుగా వాదిస్తూ, చెల్లించాల్సిన మొత్తాన్ని కూడా తగ్గించాలని కోరుతారు. మనం ఈ విషయాలను నిజమైన భావంతో అర్థం చేసుకోగలిగితే, మనలోని అనేక వివాదాలు అంతమైపోతాయి.

అదేవిధంగా, వారి వినయానికి మరో ఉదాహరణ మక్కా విజయం సందర్భంగా జరిగిన సంఘటనలో కనిపిస్తుంది. ప్రవక్త (స) మస్జిద్ అల్-హరామ్‌లోకి ప్రవేశించినప్పుడు, హజ్రత్ అబూ బకర్ (రజి) తన తండ్రిని వెంట తీసుకుని వారి సమక్షానికి వచ్చారు. ప్రవక్త (స) ఆయనను చూసి ఇలా అన్నారు: "ఓ అబూ బకర్, ఈ వృద్ధుడిని ఇంటివద్దనే ఉంచి ఉండాల్సింది. నేను స్వయంగా ఆయన వద్దకు వచ్చేవాడిని." హజ్రత్ అబూ బకర్ (రజి) ఇలా విన్నవించుకున్నారు: "ఓ అల్లాహ్ ప్రవక్తా (స), మీరు ఆయన వద్దకు వెళ్లడం కంటే, ఆయన మీ వద్దకు రావడమే సముచితం." హజ్రత్ అబూబకర్ (రజి) తన తండ్రిని ప్రవక్త (స) ముందు కూర్చోబెట్టారు. ప్రవక్త (స) ఆయన ఛాతిపై తన చేయి ఉంచి ఇలా అన్నారు: "ఇస్లాంను స్వీకరించండి; మీరు శాంతిలో ప్రవేశిస్తారు." అందువల్ల అబూ ఖుహాఫా ఇస్లాంను స్వీకరించారు. (అల్-ఇసాబా ఫీ తమ్యీజ్ అస్-సహాబా, సంపుటి 4, దార్ అల్-కుతుబ్ అల్-ఇల్మియ్యా, 1995, పుట 375)

అదేవిధంగా, ఇంటిలో ప్రవక్త (స) గడిపిన సరళమైన జీవన విధానం గురించి హజ్రత్ హసన్ రజి ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త (స) వారి తలుపులు అందరికీ తెరిచి ఉండేవి. వారి ఇంటి వద్ద ఎటువంటి ద్వారపాలకుడు ఉండేవాడు కాదు. ఉదయం, సాయంత్రం పెద్ద పాత్రలలో విస్తారమైన విందులు వారికి వడ్డించబడేవి కాదు. విలాసవంతమైన లేదా రుచికరమైన ప్రత్యేక ఆహారం వారికి సమర్పించబడేది కాదు. ప్రవక్త (స)ను కలవాలని ఎవరైనా కోరుకుంటే, వారు సులభంగా వారిని కలుసుకో గలిగేవారు. వారు(స) నేలపై కూర్చునేవారు, తన ఆహారాన్ని కూడా నేలపైనే ఉంచు కునేవారు. సాధారణమైన, ముతక వస్త్రాలను ధరించేవారు. గాడిదపై స్వారీ చేసేవారు; తన వాహనంపై ఇతరులను కూడా తన వెనుక కూర్చోబెట్టుకునేవారు. భోజనం చేసిన తరువాత తన వేళ్లను శుభ్రంగా నాకేవారు. (అల్-బైహఖీ, అస్-సునన్ అల్-కుబ్రా, సంపుటి 10, హదీసు 20838, అల్-రుష్ద్, పుట 171)

వేళ్లను నాకడం విషయానికి వస్తే, బుఖారీలోని ఒక హదీసులో ప్రవక్త (స) ఇలా చెప్పారు: భోజనం చేసిన తరువాత చేతులు కడుక్కోవడానికి ముందు, తన వేళ్లను శుభ్రంగా నాకాలి. (సహీహ్ అల్-బుఖారీ, కితాబ్ అల్-అత్ఇమహ్, బాబ్ లఅఖి అల్-అసాబిఇ వ మస్సిహా..., హదీసు 5456)

ఈ ఆచారం గురించి హజ్రత్ జైన్-ఉల్-ఆబిదీన్ వలీయుల్లాహ్ షా సాహిబ్ (ర) గారు బుఖారీపై తమ వ్యాఖ్యానంలో ఒక గమనికను నమోదు చేశారు. అందులో హజ్రత్ సయ్యద్ డా. మీర్ ముహమ్మద్ ఇస్మాయిల్ సాహిబ్ (ర) ఇలా పేర్కొన్నారు: మానవ చేతి వేళ్లలో ఒక ప్రత్యేకమైన స్పర్శ శక్తి కేంద్రీకృతమై ఉంటుందని వైద్యులందరి అనుభవం ద్వారా నిర్ధారించబడింది మరియు వైద్యశాస్త్రంలో నిపుణులందరూ దీనిని అంగీకరించారు. ఉదాహరణకు, ఒక వస్త్రం ఎంత మెత్తగా ఉందో తెలుసుకోవాలంటే, దానిని వేళ్ల ద్వారా స్పర్శించకుండా సరిగ్గా అంచనా వేయడం సాధ్యం కాదు. శరీర మంతటా స్పర్శజ్ఞానం ఉన్నప్పటికీ, కాలితో ఆ మెత్తదనాన్ని పరీక్షించడానికి ప్రయత్నిస్తే, అంత సమర్థవంతంగా అంచనా వేయలేము. చేతికి మాత్రమే కాకుండా, ప్రత్యేకంగా వేళ్లలో ఒక నిర్దిష్టమైన విద్యుత్ స్వభావం ఉంటుందని భావించబడింది. అంతేకాకుండా, ఏకాగ్ర దృష్టికి సాధనమైన కంటితో వేళ్లకు ప్రత్యేకమైన సంబంధం ఉంది. అందువల్ల ఏకాగ్రత సాధన చేసే వారు తాము ప్రభావితం చేయదలచిన వ్యక్తి యొక్క వేళ్లపై ప్రధానంగా దృష్టిని కేంద్రీకరిస్తారు. ఈ విధంగా వారు సమ్మోహన ప్రభావాలను అత్యంత సమర్థవంతంగా ప్రయోగించి తమ ఉద్దేశ్యాన్ని సాధించగలరని చెప్పబడింది.

అదేవిధంగా, చేతితో తయారు చేసిన ఔషధాలు ఇతర విధానాల్లో తయారు చేసిన వాటికంటే ఎక్కువ ప్రయోజనాన్ని కలిగిస్తాయని కూడా చెప్పబడింది. మన కాలంలో ప్రతి వస్తువూ యంత్రాల ద్వారా తయారవుతోంది. అయితే ఆ కాలంలో వైద్యులు మరియు వైద్యశాస్త్ర నిపుణులు ఈ అభిప్రాయాన్ని కలిగి ఉండేవారు. డా. ఇస్మాయిల్ సాహిబ్ స్వయంగా ఉన్నత విద్యను అభ్యసించిన శస్త్రచికిత్స నిపుణుడు మరియు వైద్యుడు. యంత్రాల ద్వారా తయారు చేసిన ఔషధాల కంటే ఇలాంటి విధానాల్లో తయారు చేసిన ఔషధాలు ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఇదే సూత్రం ప్రకారం, ఒక వ్యక్తి తన వేళ్లతో భోజనం చేసినప్పుడు, ప్రతి ముద్ద తీసుకునే సమయంలో అతని దృష్టి ఆ వేళ్ల చివరలపై పడుతుంది. అందువల్ల భోజనం చేసిన తరువాత, వేళ్లను కడుక్కోవడానికి లేదా తుడుచుకోవడానికి ముందు వాటిని నాకినప్పుడు, వాటికి అంటుకున్న కొంత కొవ్వు లేదా ఆహార అవశేషం నేరుగా కడుపులోకి చేరుతుంది. తద్వారా కడుపు పనితీరు, అంటే జీర్ణక్రియ ప్రక్రియ బలపడుతుంది మరియు ఆహారం మరింత సులభంగా జీర్ణమవుతుందని భావించబడింది. ఆ కాలంలోని వైద్యులు మరియు వైద్యశాస్త్ర నిపుణులు ఈ అభిప్రాయాన్ని కలిగి ఉండేవారు. నేటి వైద్యులు దీనితో ఏకీభవిస్తారా లేదా విభేదిస్తారా అనేది వేరే విషయం. ఏదేమైనా, భోజనం చేసిన తరువాత చేతిపై మిగిలిన ఆహారాన్ని నాకడంలో ప్రయోజనం ఉందని ప్రవక్త (స) స్వయంగా పేర్కొన్నారు.

బుఖారీకి చెందిన కథనములో ఇలా ఉంది: ఫలా యమ్‌సహ యదహూ హత్తా యల్అఖహా అవ్ యుల్ఇఖహా అనగా "ఒక వ్యక్తి తన చేతిని తుడుచు కోకూడదు; ముందుగా తానే తన వేళ్లను నాకి శుభ్రం చేసుకోవాలి లేదా వాటిని మరొకరితో నాకించుకోవాలి." "వాటిని నాకించుకోవాలి" అనే పదబంధానికి సంబంధించి కొందరు వ్యాఖ్యాతలు, దాని అర్థం తన సేవకునితో గానీ, తన కుమారునితో గానీ, లేదా వేళ్లను నాకడం పట్ల అసహ్యభావం కలగని మరెవరితోనైనా తన వేళ్లను నాకించుకోవడం అని పేర్కొన్నారు. అయితే భోజనం చేసిన వ్యక్తికి అలా చేయాల్సిన అవసరమే లేదు, అతను తన వేళ్లను తానే సులభంగా నాకి శుభ్రం చేసుకోవచ్చు. వ్యాఖ్యాతలు కొన్నిసార్లు చాలా దూరం వెళ్లే విధమైన అర్థాలను కూడా ప్రతిపాదిస్తారు. ఏదేమైనా, అలాంటి వ్యాఖ్యానం అనుచితమైనదే కాక, మానవ గౌరవానికి కూడా విరుద్ధమైనది. ఒక వ్యక్తి తన వేళ్లను మరొకరితో నాకించుకోవడం అనేది సముచితం కాదు.

దీనికి సహేతుకమైన అర్థం ఏమిటంటే, ఒక వ్యక్తి భోజనం చేసిన తర్వాత తన వేళ్లను తానే నాకి శుభ్రం చేసుకోవాలి. అలాగే తన సంరక్షణలో, తన బాధ్యతలో ఉన్నవారికి కూడా తమ వేళ్లను అదే విధంగా శుభ్రం చేసుకోవాలని సూచించాలి. తద్వారా వారు కూడా ప్రవక్త (స) బోధనలో నిక్షిప్తమై ఉన్న వైద్యపరమైన ప్రయోజనాలను

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దువా ఆశించువారు: *SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)*


Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

మరియు ఇతర ప్రయోజనాలను పొందగలుగుతారు. (సహీ బుఖారీ, కితాబుల్ అత్ ఇమహ్,బాబ్ లఅఖీ అల్-అసాబిఈ వ మస్నిహో ఇస్లాం ఇంటర్నేషనల్ పబ్లికేషన్స్, లండన్)

ప్రవక్త (స) మస్జిద్‌ను శుభ్రం చేయడం, దుమ్ము దులపడం వంటి పనులను కూడా తన స్థాయికి తక్కువైనవిగా ఎన్నడూ భావించలేదు. ఈ క్రమంలోనే హజ్రత్ యాకూబ్ బిన్ జైద్ (రజి) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త (స) మస్జిద్‌లో పేరుకుపోయిన దుమ్ము, మురికిని ఒక కర్రతో తొలగించేవారు. అంటే, బహుశా కర్ర చివర ఒక గుడ్డను లేదా దానికి సమానమైన వస్తువును కట్టి, దానితో దుమ్ము దులిపి శుభ్రం చేసే వారని అర్థం కావచ్చు. (ఇబ్న్ అబీ షైబా, అల్-ముసన్నఫ్, సంపుటి 2, హదీస్ 4044, అల్-ఫారూక్ అల్-హదీసియ్యా లిత్-తబాఅహ్ వన్-నష్ర్, 2008, పేజీ 321)

హజ్రత్ అబూ హురైరా (రజి) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త (స) వద్ద జిబ్రాయీల్ (అ) కూర్చుని ఉండగా, ప్రవక్త (స) ఆకాశం వైపు చూశారు. అప్పుడు ఒక దేవదూత దిగివస్తున్నట్లు చూశారు. జిబ్రాయీల్ (అ) ఇలా అన్నారు: "ఇతను ఒక దేవదూత. ఇతను సృష్టించబడిన రోజు నుండి ఈ క్షణం వరకు ఇంతకుముందెన్నడూ భూమికి దిగివచ్చింది లేదు." ఆ దేవదూత దిగివచ్చినప్పుడు ఇలా అన్నాడు: "ఓ ముహమ్మద్ (స)! మీ ప్రభువు మిమ్మల్ని ఉద్దేశించి నన్ను పంపాడు. అల్లాహ్ తఆలా మిమ్మల్ని రాజైన ప్రవక్తగా చేయాలా, లేక సేవకుడైన సందేశహరునిగా చేయాలా అని అడుగుతున్నాడు." జిబ్రాయీల్ (అ) అన్నారు: "ఓ ముహమ్మద్ (స)! మీ ప్రభువు ఎదుట వినయాన్ని అవలంబించండి." అప్పుడు ప్రవక్త (స) ఇలా అన్నారు: "అలాగే, నేను సేవకుడైన సందేశహరునిగా పంపబడటాన్నే ఇష్టపడుతున్నాను." (ముస్నద్ అహ్మద్ బిన్ హన్బల్, సంపుటి 3, హదీస్ 7160, ఆలం అల్-కుతుబ్, 1998, పేజీ 13)

నిజానికి, ఇదే ప్రవక్త (స) వారి సహజ స్వభావం. జిబ్రాయీల్ (అ) ఈ మాట చెప్పకపోయినా, ప్రవక్త (స) ఇదే సమాధానం ఇచ్చేవారు.వారు ఎల్లప్పుడూ ఇదే విషయాన్ని బోధించేవారు మరియు పదేపదే దీనిని ఉపదేశించేవారు. తన అనుచరులకు కూడా వారు (స) ఇలా బోధించారు: "నేను కేవలం సందేశహరునిగా పంపబడిన ఒక మానవుడిని."

అయితే ఈ కథనం యొక్క ఉద్దేశం ఏమిటంటే, అలాంటి సందర్భం వచ్చిన ప్పుడు ప్రవక్త (స) తన వినయభావంతో, రాజు హోదా కలిగిన ప్రవక్తగా ఉండాలని తాను కోరుకోవడం లేదని, బదులుగా అల్లాహ్‌కు వినయపూర్వకమైన సేవకుడిగా, వినయపూర్వకమైన మానవుడిగా మరియు ఆయన సందేశహరునిగా ఉండటాన్నే కోరుకుంటున్నానని ప్రకటించారు. ఇదే సూత్రం మన విశ్వాస ప్రకటన (కలిమా) లో కూడా పేర్కొనబడింది.

మరి ఒక నిజమైన ముస్లిం ఎంతవరకు వినయాన్ని అవలంబించాలి?. ఒక కథనములో హజ్రత్ ఇయాద్ బిన్ హిమార్ (రజి) ఇలా పేర్కొన్నారు: ప్రవక్త (స) ఇలా అన్నారు: "నిశ్చయంగా, మీరు అంతటి వినయాన్ని అవలంబించాలని అల్లాహ్ తఆలా నాకు వెల్లడించాడు. ఎవరూ మరొకరిపై అతిక్రమణ చేయకూడదు, అలాగే ఎవరూ మరొకరిపై గొప్పలు చెప్పుకోకూడదు." (సునన్ అబూ దావూద్, కితాబ్ అల్-అదబ్, బాబ్ ఫిత్-తవాదుఅ?, హదీస్ 4895)

మనకు హితబోధ చేస్తూ, ప్రవక్త (స) వారినిజమైన సేవకుడైన హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా పేర్కొన్నారు: "వినయాన్ని అలవరచుకోవాలి. వినయాన్ని నేర్చుకోవడం ఏమీ కష్టం కాదు. నిజానికి, అందులో నేర్చుకోవడానికి ఏముంది? మానవుడు స్వభావరీత్యానే వినయశీలుడు, మరియు అతడు సృష్టించబడినదే వినయం కోసం. వమా ఖలఖ్తుల్ జిన్నా వల్ ఇన్‌సా ఇల్లా లియాఅబుదూన్ అనగా 'జిన్నులను మరియు మానవులను వారు నన్ను ఆరాధించేందుకు తప్ప మరే ఉద్దేశంతోనూ నేను సృష్టించలేదు.' "గర్వం మరియు అహంకారం అన్నీ కృత్రిమమైన విషయాలు. ఒక వ్యక్తి ఈ కృత్రిమత్వాన్ని విడిచిపెడితే, అతని సహజ స్వభావంలో వినయం మాత్రమే వ్యక్తమవుతుంది." (మల్ఫూజాత్, సంపుటి 5, పేజీ 38, ప్రచురణ 2022)

మనకు సలహా ఇస్తూ, ప్రవక్త (స) వారి వినయ స్థాయిని వివరిస్తూ, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఒక సందర్భంలో ఇలా పేర్కొన్నారు: "సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అత్యంత కరుణామయుడు, అత్యంత దాతృత్వశీలుడు. ఆయన మానవుడిని ప్రతి విధంగానూ పోషిస్తూ, అతనిపై కరుణ చూపుతాడు. మరియు ఆయన యొక్క ఈ కరుణ కారణంగానే ప్రజలను పాపభరితమైన జీవితం నుండి విముక్తి చేయడానికి తన నియమితులను మరియు ప్రవక్తలను పంపుతాడు. అయితే అహంకారం అత్యంత ప్రమాద కరమైన వ్యాధి. అది ఎవరిలో అభివృద్ధి చెందుతుందో, ఆ వ్యక్తికి ఆధ్యాత్మిక మరణంతో సమానం. ఈ వ్యాధి హత్యకంటే కూడా తీవ్రమైనదని నాకు ఖచ్చితంగా తెలుసు. అహంకారి వ్యక్తి సైతాన్‌కు సోదరుడిగా మారుతాడు, ఎందుకంటే సైతాన్‌ను అవమానపరచి నాశనం చేసింది కూడా అహంకారమే."అందువల్ల ఒక విశ్వాసిలో అహంకారం ఏమాత్రం ఉండకూడదు; దానికి బదులుగా అతనిలో వినయం, అణకువ మరియు సౌమ్యత ఉండాలి. ఇదే అల్లాహ్ నియమితుల ప్రత్యేక లక్షణం. వారిలో అత్యున్నత స్థాయిలో వినయం మరియు సౌమ్యత ఉంటాయి. ఈ లక్షణాలు అందరి కంటే ఎక్కువ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కలిగి ఉన్నారు.

"ప్రవక్త (స)కు సేవకుడిగా ఉన్న ఒక వ్యక్తిని, ప్రవక్త (స) తనతో ఎలా ప్రవర్తించే వారని అడిగారు. దానికి అతడు ఇలా సమాధానమిచ్చాడు: 'వాస్తవానికి, నేను వారికి సేవ చేసిన దానికంటే ఎక్కువగా వారే నాకు సేవ చేసేవారు.'

**అల్లాహుమ్మ సల్లెఅలా ముహమ్మదిన్ వ అలా ఆలే ముహమ్మదిన్ వ బారిక్ వసల్లిమ్.**

"ఇదే అత్యున్నత నైతికత మరియు సౌమ్యతకు ప్రమాణం. సాధారణంగా ఒక వ్యక్తికి సేవ చేసేవారిలో, అతని చుట్టూ ఎల్లప్పుడూ ఉండే ప్రియమైన వారే ఎక్కువగా ఉంటారనే విషయం కూడా నిజమే. కాబట్టి ఒక వ్యక్తి యొక్క వినయం, సౌమ్యత, సహనం మరియు ఓర్పు స్థాయిని చూడాలనుకుంటే, అతనికి అత్యంత సమీపంగా ఉండే వారి ద్వారా దానిని అత్యుత్తమంగా తెలుసుకోవచ్చు. "కొంతమంది పురుషులు లేదా స్త్రీలు తమ సేవకుడు చేసిన చిన్న తప్పుకే, ఉదాహరణకు, టీ తయారీలో కొద్దిగా లోపం ఉన్నా, వెంటనే అతన్ని మాటలతో దూషించడం లేదా కొరడాతో కొట్టడం ప్రారంభిస్తారు. లేదా పులుసులో ఉప్పు కొద్దిగా ఎక్కువైతే, ఆ పేద సేవకులకు అది పెద్ద విపత్తుగా మారుతుంది. "మరో సందర్భం పేదలతో వారి వ్యవహారం. పేదలు ఆకలితో అలమటిస్తూ, కేవలం పొడి రొట్టెతో జీవిస్తున్నారని తెలిసినా, వారు వారి గురించి ఏమాత్రం పట్టించుకోరు. సహాయం కోసం పేదలు వారి వద్దకు వచ్చినప్పుడు వారిని పరీక్షకు గురిచేస్తారు. (ఒక పేదవాడు సహాయం కోసం ధనవంతుడి వద్దకు వచ్చినప్పుడు, వాస్తవానికి ఆ సమయంలో ధనవంతుడే ఒక పరీక్షకు గురవుతున్నాడు. ఆ సమయంలో పేదవాని అవసరాలను తీర్చడమే నిజమైన భక్తి.) "సర్వశక్తిమంతుడైన దేవుడు ప్రతి అణువుకూ సృష్టికర్త. ఆయనతో ఎవ్వరూ పోటీ పడలేరు. ఒక వ్యక్తికి ఎంత దైవభక్తి గలదో, దైవభీతి లేదో అనే విషయం అతడు పేదలతో ఎలా వ్యవహరిస్తాడో చూడటం ద్వారా మాత్రమే తెలుసుకోవచ్చు."

(మల్ఫూజాత్, సంపుటి 7, పేజీలు 312-313, ప్రచురణ 2022)

ఒక వ్యక్తి ఎంతగా అల్లాహ్‌కు భయభక్తులు కలిగి ఉన్నాడో తెలుసుకొనుటకు, అతను ధనవంతులతో ఎలా వ్యవహరిస్తాడన్నదానికంటే, పేదలతో ఎలా ప్రవర్తిస్తాడన్నదే నిజమైన ప్రమాణం.

ప్రవక్త (స) వారి బోధనలను అనుసరిస్తూ, వారి ఆశీర్వదిత సున్నత్‌కు అనుగుణంగా ఆచరిస్తూ, వినయానికి సంబంధించిన మార్గాలను అవలంబించే సామర్థ్యాన్ని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు ప్రసాదించుగాకా!.

నమాజ్ తరువాత మాలిక్ దావూద్ మహ్మూద్ సాహిబ్ గారి పరోక్ష జనాజా నమాజ్‌ను కూడా నేను చదివించుతాను. ఆయన ముహమ్మద్ ఇస్‌హాక్ సాహిబ్ గారి కుమారుడు. ఆయన మొదట వెహారీకి చెందినవారు, తరువాత కరాచీలో నివసించారు. ఆయన ఇటీవల మరణించారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్. అల్లాహ్ కృపవల్ల మృతుడు ఒక మూసీ (వసీయత్ చేసిన వ్యక్తి)గా ఉన్నారు. ఆయన తాతగారైన ముహమ్మద్ దీన్ సాహిబ్, సియాల్‌కోట్ జిల్లాలోని బర్హన్‌వాలా గ్రామ నివాసి. 1914లో హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సానీ (రజి) చేతుల మీదుగా బైఅత్ చేసే గౌరవాన్ని ఆయన పొందారు. మాలిక్ దావూద్ సాహిబ్ స్థానికంగా జమాఅత్‌కు సదర్ జమాఅత్, సెక్రటరీ మాల్‌గా, అలాగే మజ్లిస్ అన్సారుల్లాహ్‌లో సేవ చేసే అవకాశం పొందారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, నలుగురు కుమారులు ఉన్నారు. ఆయన కుమారుల్లో ఒకరైన ముహమ్మద్ అకమల్ సాహిబ్, గాంబియాలో జమాఅత్ మిషనరీగా సేవలందిస్తున్నారు. సేవా రంగంలో నిమగ్నమై ఉండటం వల్ల, ఆయన తన తండ్రి జనాజాకు హాజరు కాలేకపోయారు.

మిషనరీ అయిన ఆయన కుమారుడు అకమల్ సాహిబ్ ఇలా వ్రాశారు: "నా తండ్రి ఎంతో సంతోషంగా ఉండే, ఆత్మీయత కలిగిన, ఉత్సాహభరితమైన వ్యక్తి. తబ్లీఘ్ పట్ల ఆయనకు ఎంతో ఆసక్తి ఉండేది. సింధ్‌లోని తన వ్యవసాయ భూములను సందర్శించి నప్పుడల్లా, తబ్లీఘ్ చేసే అవకాశాల కోసం వెతికేవారు. పాకిస్తాన్‌లో ఆంక్షలు విధించే చట్టాలు అమలులోకి వచ్చే వరకు, ఆయన తనతో కరపత్రాలను కూడా తీసుకెళ్లి, క్రమం తప్పకుండా ప్రచారం చేసేవారు. ఫలితంగా, ఆయన అనేకమంది ప్రజలపై ఎంతో ప్రభావం చూపారు. "ఆయన అత్యంత అతిథి సత్కారశీలి. మర్కజ్ నుంచి వచ్చిన అతిథులైనా, ఇతర సందర్శకులైనా, అందరినీ ఎంతో ఆతిథ్యంతో గౌరవించేవారు. మస్జిద్ నిర్మించబడే వరకు, ఆయన తన ఇంటిలోనే ఒక నమాజ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ క్రమం తప్పకుండా జమాఅత్‌తో నమాజ్‌లు నిర్వహించబడేవి. ఫజర్ నమాజ్ అనంతరం, ఆయన పవిత్ర ఖుర్‌ఆన్‌ను బిగ్గరగా, మధురమైన స్వరంతో పఠించేవారు. "ఇతర జమాఅతులకు చెందినవారు కూడా జుముఅ నమాజ్ కోసం ఆయన కేంద్రానికి వచ్చేవారు. తాను తన పొలాలకు వెళ్లిన ప్రతిసారీ, తన భూమిలోని ప్రతి మూలలో నఫిల్ నమాజులు చదివేవాడినని ఆయన తరచూ చెప్పేవారు. దీనివల్ల సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన పంటలకు బరకత్ ప్రసాదించేవాడని, ఇతరుల కంటే తన పంట దిగుబడి రెండింతలు ఎక్కువగా ఉండేదని చెప్పేవారు. "అదేవిధంగా, తన గ్రామంలో నిర్మించిన ఇంటి గురించి ఆయన తన పిల్లలతో మాట్లాడుతూ, దానిని శాశ్వతంగా జమాఅత్‌కు అంకితం చేయాలని, అది జమాఅత్ కేంద్రంగా మారాలని తన కోరిక అని చెప్పారు. తరువాత ఆయన నిజంగానే ఆ ఇంటిని జమాఅత్‌కు దానం చేశారు."మానవాళికి సేవ చేయడం, జమాఅత్‌కు సంపూర్ణ విధేయత చూపడం, శుక్రవారం ప్రసంగాలను క్రమం తప్పకుండా వినడంతో పాటు, అతిథి సత్కారం ఆయన అత్యంత విశిష్టమైన గుణాలలో ఒకటి.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆయనను మన్నించి, తన దయను ప్రసాదించుగాకా! .

---

**(1వ పేజీ తరువాత)**

అల్లాహ్ తఆలా ఇలా ఉపదేశిస్తున్నాడు: 'మీరు ఉపకార స్థాయిని పొందిన తరువాత, అనగా, పొందడంకంటే ఇవ్వాలనే కోరిక మీలో ఎక్కువై నప్పుడు, ఇంకా ఉన్నతమైన సద్గుణ స్థాయిని కూడా పొందండి. అప్పుడు సమస్త మానవజాతి మీకు మీ సొంత పిల్లల వలె కనిపించాలి. వారిని సేవించాలనే ఉత్సాహం, ఒక తల్లి తన బిడ్డ పట్ల కలిగిన ప్రేమలా, మీ హృదయంలో ఎల్లప్పుడూ ఉప్పొంగుతూ ఉండాలి."

(తఫ్సీర్-ఏ-కబీర్, సంపుటి 6, పుట 169, యూకే ముద్రణ)

**సీరత్ ఖాతమున్నబియ్యీన్ (సల్లల్లాహు అలైహి వసల్లం):-**

**రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).**

**ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి సంతానం:-**

ప్రవక్త ముహమ్మద్ (స) వారికి జన్మించిన సంతానం మొత్తం, వారి జీవిత చివరి దశలో మారియా కిబ్తియా (రజి.) గారి ద్వారా జన్మించిన ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) తప్ప, మిగిలిన వారందరు హజ్రత్ ఖదీజా (రజి.) గారి ద్వారానే జన్మించింది. హజ్రత్ ఖదీజా (రజి.) గారి ద్వారా ప్రవక్త (స) వారికి ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు జన్మించారు. కుమారుల పేర్లు ఖాసిం, తాహిర్, తయ్యిబ్. కొన్ని కథనాలలో నాల్గవ కుమారుడిగా అబ్దుల్లాహ్ పేరు కూడా పేర్కొనబడింది. అయితే సాధారణంగా తయ్యిబ్‌కే మరో పేరు అబ్దుల్లాహ్ అని భావిస్తారు. కుమార్తెల పేర్లు జైనబ్ (రజి.), రుకయ్యా (రజి.), ఉమ్ము కుల్సూమ్ (రజి.), ఫాతిమా (రజి.). హజ్రత్ ఖదీజా (రజి.) గారి ద్వారా జన్మించిన ప్రవక్త వారి సంతానం మొత్తం, ప్రవక్తత్వం ప్రకటించక ముందు జన్మించింది. ప్రవక్త (స)వారి బిరుదు అబుల్ ఖాసిం వారి పెద్ద కుమారుడు ఖాసిం పేరు ఆధారంగానే ఏర్పడింది.

ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి కుమారులందరూ బాల్యదశలోనే మృతి చెందారు. అయితే కుమార్తెలందరూ పెద్దవారై ఇస్లాం స్వీకరించారు. కానీ చిన్న కుమార్తె ఫాతిమతుజ్జుహ్రా (రజి.) తప్ప మిగిలిన కుమార్తెల వంశం కొనసాగలేదు. పెద్ద కుమార్తె జైనబ్ (రజి.) గారి వివాహం, ఖదీజా (రజి.) గారి బంధువైన అబుల్ ఆస్ ఇబ్ను రబీతో జరిపించారు. వీరికి అలీ అనే కుమారుడు, ఉమామా అనే కుమార్తె జన్మించారు. కుమారుడు చిన్నతనంలోనే మరణించాడు. కుమార్తె ఉమామా పెద్దదై, ఫాతిమా (రజి.) మరణించిన తర్వాత అలీ (రజి.) గారిని వివాహం చేసుకుంది. అయితే ఆమె ద్వారా కూడా వంశం కొనసాగలేదు. ప్రవక్త (స) వారికి ఉమామా అంటే ఎంతో ప్రేమ ఉండేది. అబుల్ ఆస్ హిజ్రత్ జరిగిన తర్వాత కూడా అనేక సంవత్సరాలు ఇస్లాం స్వీకరించలేదు. దాంతో జైనబ్ (రజి.) కొన్ని కష్టాలను ఎదుర్కొన్నారు. జైనబ్ (రజి.) ప్రవక్త (స) వారి జీవితకాలంలోనే మరణించారు.

రుకయ్యా (రజి.) మరియు ఉమ్ము కుల్సూమ్ (రజి.)లను ప్రవక్త (స) వారి పినతండ్రి అబూ లహబ్ కుమారులు ఉత్బా మరియు ఉతైబాలతో వివాహం నిశ్చయించారు. అయితే ఇస్లాం ఆవిర్భవించిన తర్వాత అబూ లహబ్ ప్రవక్త (స) వారిని తీవ్రంగా వ్యతిరేకించడంతో, గృహప్రవేశానికి ముందే ఆ రెండు వివాహాలు రద్దయ్యాయి. అనంతరం రుకయ్యా (రజి.) మరియు ఉమ్ము కుల్సూమ్ (రజి.) వరుసగా ఉస్మాన్ ఇబ్నూ అఫ్ఫాన్ (రజి.) గారిని వివాహం చేసుకున్నారు. అందువల్ల ఉస్మాన్ (రజి.) గారిని జున్-నూరైన్ (రెండు వెలుగుల యజమాని) అని పిలుస్తారు. అయితే వీరిద్దరి ద్వారా కూడా వంశం కొనసాగలేదు. రుకయ్యా (రజి.) గారికి అబ్దుల్లాహ్ అనే కుమారుడు జన్మించినప్పటికీ చిన్నతనంలోనే మరణించాడు. ఉమ్మే కుల్సూమ్ (రజి.) గారికి సంతానం కలగలేదు. రుకయ్యా (రజి.) బదర్ యుద్ధం జరిగిన కాలంలో మరణించగా, ఉమ్ము కుల్సూమ్ (రజి.) మక్కా విజయం అనంతరం మరణించారు.

అత్యంత చిన్న కుమార్తె ఫాతిమా (రజి.). వారు ప్రవక్త (స) వారికి అత్యంత ప్రియమైన కుమార్తె. హిజ్రత్ అనంతరం ఆమె అలీ (రజి.) గారిని వివాహం చేసుకున్నారు. వీరికి ఇమామ్ హసన్ (రజి.) మరియు ఇమామ్ హుసైన్ (రజి.) జన్మించారు. వీరి సంతానాన్నే సయ్యిద్ వంశంగా పిలుస్తారు. ఫాతిమా (రజి.) ప్రవక్త (స) వారి మరణం జరిగిన ఆరు నెలల తరువాత మరణించారు.

ఖదీజా (రజి.) గారికి వారి మొదటి ఇద్దరు భర్తల ద్వారా కూడా సంతానం ఉంది. వారికి హింద్, హాలా అనే ఇద్దరు కుమారులు, హింద్ అనే ఒక కుమార్తె ఉన్నారు. అల్లాహ్ కృపవల్ల వీరందరూ ఇస్లాం స్వీకరించారు.

**కాబా యొక్క ఆధునిక పునర్నిర్మాణం:-**

కాబా పునర్నిర్మాణానికి సంబంధించిన సంఘటనను రెండవ అధ్యాయంలో కొంత వివరంగా ప్రస్తావించాము. కాబా భవనం కొన్ని కారణాల వల్ల దెబ్బతినడంతో, ఖురైష్ ప్రజలు దానిని కూల్చివేసి మళ్లీ కొత్తగా నిర్మించాలని నిర్ణయించారు. అయితే అది అల్లాహ్ గృహం కావడంతో, దానిని కూల్చడం ప్రారంభించడానికి అందరూ భయపడ్డారు. "దేవుని ఇంటిని కూల్చితే ఏదైనా ఆపద వస్తుందేమో" అనే భయం వారిలో ఉండేది. చివరకు ఖురైష్ నాయకులలో ఒకరైన, వృద్ధుడైన వలీద్ బిన్ ముఘీరా ధైర్యం చేసి కూల్చివేత పనిని ప్రారంభించాడు. ఒక రాత్రి గడిచిన తరువాత కూడా అతనికి ఎలాంటి అపాయం సంభవించలేదని ప్రజలు గమనించగా, మిగతా వారూ ఈ పనిలో చేరారు. పాత నిర్మాణాన్ని కూల్చుకుంటూ ప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) వేసిన పునాదుల వరకు చేరినప్పుడు, అక్కడే ఆపి, అదే పునాదులపై కొత్త నిర్మాణాన్ని ప్రారంభించారు.అదే సమయంలో సముద్ర తీరంలో ఒక పెద్ద ఓడ కూలిపోయింది. ఆ ఓడలోని కలపను ఖురైష్ కొనుగోలు చేశారు. అయితే ఆ కలప మొత్తం పైకప్పు నిర్మాణానికి సరిపోలేదు. అందువల్ల, ముందే చెప్పినట్లుగా, వారు కాబాను ప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) నిర్మించిన అసలు పునాదుల మొత్తం విస్తీర్ణంపై నిర్మించలేకపోయారు. ఒక వైపున సుమారు ఏడు చేతుల మేర స్థలాన్ని ఖాళీగా వదిలివేశారు. అదనంగా వారు మరికొన్ని మార్పులు కూడా చేశారు. అయితే వాటి వివరాలు ముందే చెప్పబడినందున, వాటిని ఇక్కడ మళ్లీ వివరించాల్సిన అవసరం లేదు.

కాబా నిర్మాణం కొనసాగుతుండగా, హజ్-ఎ-అస్వద్ (నల్లరాయి)ను దాని స్థానంలో అమర్చే సమయం వచ్చింది. అప్పుడు ఖురైష్ తెగల మధ్య తీవ్రమైన వివాదం చెలరేగింది. ఆ గౌరవం తమ తెగకే దక్కాలని ప్రతి తెగ కోరుకుంది. పరిస్థితి ఎంత తీవ్రమైయిందనగా, వారు పరస్పరం యుద్ధానికి సిద్ధమయ్యారు. మూర్ఖత్వపు కాలపు ఆచారం ప్రకారం, కొందరు రక్తంతో నిండిన ఒక పాత్రలో తమ వేళ్లను ముంచి, "ఈ గౌరవాన్ని తమ తెగ నుండి ఇతరులకు వెళ్లనివ్వకుండా పోరాడి మరణిస్తాము" అని ప్రమాణం కూడా చేశారు. ఈ వివాదం కారణంగా కాబా నిర్మాణం అనేక రోజుల పాటు నిలిచిపోయింది. చివరకు అబూ ఉమయ్యా బిన్ ముఘీరా ఒక సూచన చేశాడు. "హరమ్‌లోకి మొదటగా ప్రవేశించే వ్యక్తినే న్యాయనిర్ణేతగా అంగీకరించి, అతని తీర్పును పాటిద్దాం" అని అన్నాడు. అల్లాహ్ ఆకాంక్షమేరకు, కొద్దిసేపటికే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అక్కడికి రావడాన్ని అందరూ చూశారు. వారిని చూడగానే అందరూ ఒకే స్వరంతో, "అల్-అమీన్! అల్-అమీన్!" (విశ్వసనీయుడు! విశ్వసనీయుడు!) అని పలికారు. "వారి తీర్పును మేమంతా అంగీకరిస్తాము" అని ఏకగ్రీవంగా చెప్పారు.ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గరకు రాగానే, జరిగిన విషయాన్ని వివరించి తీర్పు కోరారు. అల్లాహ్ ప్రసాదించిన జ్ఞానంతో ప్రవక్త (స) అందరినీ ఆశ్చర్యపరిచే విధంగా ఒక అద్భుతమైన పరిష్కారాన్ని సూచించారు.

**(సీరత్ ఖాతమున్నబియ్యీన్ (స), పేజి 122-124)**

---

**(2వ పేజీ తరువాత)**

కొన్ని సంవత్సరాల క్రితం ఒక షియా కుటుంబం అహ్మదీయత్‌ను స్వీకరించింది. వారు ఇలా అన్నారు: "అహ్మదీయులమైన తర్వాతే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పట్ల నిజమైన ప్రేమ అంటే ఏమిటో మాకు తెలిసింది." హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) నాలుగురు ఖలీఫాలను, వారందరూ రాషిదీన్ (సన్మార్గదర్శక ఖలీఫాలు) అని పేర్కొన్నారు. నేను కూడా నా ఖుత్బాలలో ఇదే విషయాన్ని పదేపదే ప్రస్తావించాను. యుద్ధాలలో హజ్రత్ అబూ బకర్ (రజియల్లాహు అన్హు) ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)తో కలిసి అత్యంత ప్రమాదకర ప్రాంతాల్లో ఉండేవారు. హజ్రత్ అలీ స్వయంగా, "నేను కూడా అలాంటి ప్రదేశంలో ఉండేవాడిని కాదు" అని చెప్పారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) యజీద్‌ను "పలీద్" (అపవిత్రుడు) అని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మరింత తెలుసుకోవడానికి ఇస్లాంలో విభేదాల ఆరంభం అనే చిన్న పుస్తకాన్ని చదవండి. అలాగే హుజూర్ (అ) రచించిన హజ్రత్ అలీ గురించి ఉన్న మరో పుస్తకాన్ని కూడా చదవండి.

**ఒక ప్రశ్న: "మనము జమాఅత్‌కు మరియు ప్రపంచమంతటికీ ఎలా ఒక ఉత్తమ ఆదర్శంగా నిలవగలము?"**

హుజూర్ అన్వర్ దీనికి సమాధానంగా ఇలా ఇచ్చారు: "నిన్ననే నేను ఆ ఆదర్శం గురించి వివరించాను. మీరు బైఅత్ (ప్రతిజ్ఞ) షరతులను ఆచరిస్తే, అదే నిజమైన ఆదర్శం అవుతుంది. చాలా మంది 'అహ్మదీయుల ఆచరణాత్మక ఆదర్శాన్ని చూసి మేము బైఅత్ చేశాము' అని చెబుతుంటారు."

మరల ఇలా చెప్పారు: "కొన్ని రోజుల క్రితం నేను దావత్ ఇలల్లాహ్ (అల్లాహ్ వైపు ఆహ్వానం) గురించి ఖుత్బా ఇచ్చాను. అందులో కూడా మీ ఆచరణ ద్వారా ఆదర్శాన్ని చూపించాలని చెప్పాను."

ఈ సందర్భంలో హుజూర్ అన్వర్ ఒక సంఘటనను వివరించారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఒక మౌల్వీ గురించి చెప్పిన సంఘటన అది. ఆ మౌల్వీ మసీదులో ఆర్థిక త్యాగం గురించి ఎంతో ఉత్సాహంగా ప్రసంగించాడు. ఆ ప్రసంగం విని ప్రభావితమైన అతని భార్య తన బంగారు గాజులను చందాగా ఇవ్వడానికి అతనికి ఇచ్చింది. అప్పుడు ఆ మౌల్వీ ఇలా అన్నాడు: "అది ప్రజల భావోద్వేగాలను రేకెత్తించడానికి మాత్రమే చెప్పాను. అది మన కోసం కాదు."

దీనిపై ఇలా వ్యాఖ్యానించారు: "ఇలాంటి చెడు ఆచరణ ఉన్నప్పుడు దాని ప్రభావం ఎలా ఉంటుంది? కానీ మనలో ప్రతి ఒక్కరూ ఆర్థిక త్యాగం చేస్తారు. నేనూ చేస్తాను. మీరు కూడా చేస్తారు."

పై ఆన్‌లైన్ సమావేశం యొక్క సారాంశాన్ని అందిస్తూ, జమాఅత్ సభ్యులందరికీ, ముఖ్యంగా ఖుద్దామ్‌కు వినయపూర్వకంగా చేయబడు విజ్ఞప్తి ఏమిటనగా, ఎం.టి.ఏ. ద్వారా ప్రసారమయ్యే ఈ కార్యక్రమాన్ని తప్పకుండా వినండి మరియు ఇతరులకు కూడా వినిపించండి.

అల్లాహ్ తఆలా మనందరికీ మన ప్రియమైన ఇమామ్ వారి పవిత్రమైన ఉపదేశాలను శ్రద్ధగా ఆలకించి, వాటిని మనస్ఫూర్తిగా ఆచరించే భాగ్యాన్ని ప్రసాదించుగాకా!. ఆమీన్.

## సీరతుల్ మహ్దీ (అలైహిస్సలాతు వస్సలాం):-

రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

**(28) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం:** ఖాజీ అమీర్ హుసైన్ సాహిబ్ నాకు ఇలా వివరించారు: "ఒకసారి మౌల్వీ సాహిబ్ (హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అవ్వల్) ఖాదియాన్ నుండి ఇతర ప్రాంతానికి వెళ్లినప్పుడు, నేను మఘ్రిబ్ నమాజుకు వచ్చాను. అప్పటికే హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) స్వయంగా నమాజు చదివించుతున్నారు. ఖాజీ సాహిబ్ చెప్పారు: హుజూర్ రెండు చిన్న సూరాలు మాత్రమే పారాయణం చేశారు. కానీ ఎంతో ఆవేదన, హృదయవిదారక భక్తిభావంతో వాటిని చదివారు కాబట్టి, అక్కడ ఉన్నవారి నుండి ఏడుపులు, విలాపనలు వినిపించాయి. నమాజు పూర్తయిన తరువాత నేను ముందుకు వెళ్లగా, నన్ను చూసి హుజూర్ ఇలా అన్నారు: 'ఖాజీ సాహిబ్! నేను మిమ్మల్ని చాలా వెతికాను, కానీ మీరు కనిపించలేదు. ఈ నమాజులో నాకు చాలా ఇబ్బంది కలిగింది. ఇషా నమాజును మీరు చదివించండి.' ఈ సంఘటన ప్రారంభకాలానికి చెందినదని ఈ భవదీయుడు భావిస్తున్నాడు.

**(29) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం:** మౌల్వీ షేర్ అలీ సాహిబ్ నాకు ఇలా వివరించారు: "ఆ రోజుల్లో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) మరియు కరమ్ దీన్ మధ్య గుర్దాస్‌పూర్‌లో ఒక కోర్టు కేసు నడుస్తోంది. ఆ కేసు నిమిత్తం హుజూర్ (అ)గుర్దాస్‌పూర్‌కు వెళ్ళారు. ఒక రోజు యాదృచ్ఛికంగా అందరూ కోర్టుకు లేదా ఇతర పనుల కోసం వెళ్లిపోయారు. హుజూర్ వద్ద నేను మరియు ముఫ్తీ సాదిక్ సాహిబ్ మాత్రమే మిగిలాము. హుజూర్ (అ)పడుకుని ఉన్నారు. చూస్తే నిద్రలో ఉన్నట్టే అనిపించింది. ఆ స్థితిలోనే ఒక్కసారిగా తల పైకెత్తి ఇలా అన్నారు: 'నాపై ఒక దైవవాణి (వహీ) అవతరించింది. దానిని రాసుకోండి.' ఆ సమయంలో అక్కడ కలం, సిరా లేదా పెన్సిల్ ఏదీ లేకుండెను. చివరకు మేము వంటగదిలో నుండి ఒక బొగ్గు ముక్క తీసుకొచ్చాము. దానితో ముఫ్తీ సాదిక్ సాహిబ్ కాగితంపై ఆ దైవవాణి పదాలను రాశారు. తర్వాత హుజూర్ (అ) మళ్లీ అలాగే పడుకున్నారు. కొద్దిసేపటి తరువాత మళ్లీ మరో దైవవాణిని చెప్పి వ్రాయించారు. ఈ విధంగా ఆ సమయంలో హుజూర్ (అ) కొన్ని దైవవాణులను వ్రాయించారు. మౌల్వీ షేర్ అలీ సాహిబ్ ఇలా చెప్పారు: "వాటిలో నాకు ఇప్పటికీ గుర్తున్న ఒక దైవవాణి ఇలా గలదు. "یسئلونک عن شانک قل اللہ ثم ذرھم فی خوضھم یلعبون" అర్థం: 'వారు నీ మహిమ గురించి నిన్ను అడుగుతారు. అప్పుడు వారికి చెప్పు: "అల్లాహ్." ఆ తరువాత వారిని వారి నిరర్థక వాగ్వాదాలలోనే వదిలివేయిను.' మరుసటి రోజు హుజూర్ (అ)కోర్టులో హాజరైనప్పుడు, వాది తరఫు న్యాయవాది ఇతర ప్రశ్నలతో పాటు ఇలా ప్రశ్నించాడు: 'మీరు మీ గ్రంథం తోహఫ గోలడ్వియాలో మీ గురించి ఈ విధంగా వ్రాశారు...' అని ఆ పుస్తకంలోని ఒక భాగాన్ని చదివి వినిపించాడు. అందులో హుజూర్ (అ) తన జ్ఞానం మరియు ఆధ్యాత్మిక స్థానం గురించి బలమైన పదాలతో పేర్కొన్నారు. తరువాత న్యాయవాది ఇలాఅడిగాడు: 'మీరు నిజంగానే మీ స్థానం గురించి ఇంత గొప్ప అభిప్రాయం కలిగి ఉన్నారా?' హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా సమాధానమిచ్చారు:'అవును, ఇది అల్లాహ్ అనుగ్రహం.'లేదా అదే భావాన్ని వ్యక్తం చేసే మరో వాక్యం పలికారు; అందులో హుజూర్ (అ) ఈ విషయాన్ని అల్లాహ్ వైపే ఆపాదించారు. మౌల్వీ షేర్ అలీ సాహిబ్ మరల ఇలా చెప్పారు: "ఆ సమయంలో హుజూర్(అ) కు "ఈ ప్రశ్న-సమాధానం" తమపై అవతరించిన దైవవాణికి సరిగ్గా అనుగుణంగా నెరవేరిందనే విషయం గుర్తుకు రాలేదు. తర్వాత హుజూర్ (అ) గుర్దాస్‌పూర్ నుండి ఖాదియాన్‌కు తిరిగి వస్తుండగా, మార్గమధ్యంలో ఒక మలుపు వద్ద నేను వినయపూర్వకంగా ఇలా అన్నాను: 'హుజూర్! నా అభిప్రాయం ప్రకారం, మీపై అవతరించిన ఆ దైవవాణి 'ఈ ప్రశ్న-సమాధానం' ద్వారానే నెరవేరింది.' ఇది విన్న హుజూర్ (అ) ఎంతో సంతోషించి ఇలా అన్నారు: 'అవును, నిజంగానే అదే. మీరు చాలా సరిగ్గా అర్థం చేసుకున్నారు.' మౌల్వీ షేర్ అలీ సాహిబ్ మరల ఇలా చెప్పారు: "కొన్ని రోజుల తరువాత షేఖ్ యాకూబ్ అలీ ఇర్ఫానీ సాహిబ్ నాతో ఇలా అన్నారు: 'హుజూర్ (అ) మరో సందర్భంలో కూడా మౌల్వీ షేర్ అలీ ఆ దైవవాణి యొక్క అన్వయాన్ని చాలా చక్కగా గ్రహించాడని పేర్కొంటూ, తన సంతోషాన్ని వ్యక్తం చేసేవారు."

(సంపాదకుని గమనిక: ఈ కథనంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) రచించిన తోహఫ గోలడ్వియా గ్రంథంలో ప్రస్తావన వస్తుంది. అయితే హఖీకతుల్ వహీ గ్రంథంలో వారు తోహఫ గోలడ్వియా కు బదులుగా తర్యాక్-ఉల్-కులూబ్ అనే గ్రంథం పేరును పేర్కొన్నారు. వాస్తవానికి, ఈ విషయంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం)కు స్వల్పమైన పొరపాటు జరిగింది. కోర్టులో ప్రశ్నించబడిన పుస్తకం తోహఫ గోలడ్వియానే, తర్యాక్-ఉల్-కులూబ్ కాదు. ఈ విషయం రెండవ భాగంలోని కథనం సంఖ్య 389లో కోర్టు రికార్డుల ఆధారంగా ఇప్పటికే నిర్ధారించబడింది.)

**(16వ పేజి తరువాత)**

ఈ లక్షణాల అత్యున్నత స్థాయి మన ప్రియప్రవక్త మరియు గురువు, హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి జీవితంలో కనిపిస్తుంది. అల్లాహ్ ప్రవక్త(స)ను ఈ పదాలతో ప్రశంసించాడు: "ఖుల్ ఇన్నస్సలాతీ వ నుసుకీ వ మహ్‌యాయ వ మమాతీ లిల్లాహి రబ్బిల్ ఆలమీన్ " అనగా : 'చెప్పండి: నిశ్చయంగా, నా నమాజ్‌లు, నా త్యాగం, నా జీవితం మరియు నా మరణం సకల లోకాల ప్రభువైన అల్లాహ్ కొరకే.' ఇదే మనకు ఆదర్శంగా నిలిచే స్థానం. నేను చెప్పినట్లుగా, త్యాగం బాహ్య రూపంలో కూడా చేయబడుతుంది. గొర్రెలు, మేకలు, ఆవులు మరియు గేదెలను వధిస్తారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సామర్థ్యం మరియు వనరులు ప్రసాదించిన ప్రతి ముస్లింకూ ఈ భౌతిక త్యాగాన్ని చేయమని ఆదేశించబడింది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారు కూడ స్వయంగా జంతువులను బలి ఇవ్వడం ద్వారా ఈ ఆదర్శాన్ని మన ముందు చూపించారు. అందువల్ల, ఈ బాహ్య త్యాగాన్ని నెరవేర్చడం కూడ అవసరం, మరియు పవిత్ర ఖుర్‌ఆన్ కూడా ఇలా చేయమని ఆదేశించింది.

అయితే, ఈ ఆజ్ఞకు ఒక షరతు ఉంది. ప్రతి ముస్లింపై బలి ఇవ్వడం విధిగా లేదు. దానిని నిర్వహించడానికి సామర్థ్యం మరియు వనరులు ప్రసాదించబడిన వ్యక్తిపైనే అది విధిగా ఉంటుంది. కానీ ధర్మనిష్ఠను అనుసరించడం, అల్లాహ్ కోసం తన బాధ్యతలను నెరవేర్చడం మరియు ఆయన ఆజ్ఞలను పాటించడం ప్రతి ఒక్కరిపై విధిగా ఉంటుంది. అతను పేదవాడైనా లేదా ధనవంతుడైనా, పురుషుడైనా లేదా స్త్రీ అయినా, యువకుడైనా లేదా వృద్ధుడైనా. నమాజ్ ప్రతి ఒక్కరిపై విధిగావించబడింది. ఎవరైనా ఐదు పూటల నమాజ్‌లను పాటించకపోతే, సంవత్సరానికి ఒకసారి పండుగ సందర్భంగా ఇచ్చే త్యాగం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఒక వ్యక్తి సత్కార్యాలు చేయాలి మరియు మతపరమైన జ్ఞానాన్ని సంపాదించాలి. తద్వారా అతను తనను తాను సంస్కరించుకోవడంతో పాటు తన పిల్లలకు కూడా శిక్షణ ఇవ్వగలడు. ఇస్లాం సందేశాన్ని ఇతరులకు చేరవేయడానికి మార్గాలు తెరుచుకుంటాయి. ఇతరుల హక్కులను కూడా చెల్లించాలి. వీటిలో ఏ ఒక్కదానికీ జంతువును బలి ఇవ్వాల్సిన అవసరం లేదు. ఒక పొట్టేలు బలి ఇవ్వకుండానే ఈ లక్ష్యాలను సాధించవచ్చు. నిరంతరమైన ఆచరణయే ఇట్టి త్యాగపు ఉద్దేశాన్ని నెరవేర్చగలదు. ఒక్క పొట్టేలు లేదా ఒక్క ఆవు బలి ఈ ఉద్దేశంను నెరవేర్చదు.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా ఇలా తెలిపారు: "అందువల్ల, గొర్రె లేదా పొట్టేలును బలి ఇవ్వడానికి సామర్థ్యం లేని వారు, బాహ్య రూపంలో కూడా త్యాగాన్ని వ్యక్తం చేయలేని వారు, తమ సమయాన్ని ఇస్లాం బోధనకు అంకితం చేయాలి. వారు కరపత్రాలను పంచాలి, తమ పరిచయాలను విస్తరించుకోవాలి, తమ సహచరులకు ఇస్లాం సందేశాన్ని అందించాలి. తమ కార్యాలయాల్లోనూ, తమ ప్రవర్తన మరియు వ్యక్తిగత ఆదర్శం ద్వారా ప్రజలను తమ వైపుకు ఆకర్షించాలి. ఈ విధంగా, నిరంతర సత్కార్యాలు మరియు ధర్మనిష్ఠలో స్థిరంగా కొనసాగడమే ఒక త్యాగం. ఇస్లాం యొక్క అందమైన బోధనలను ప్రపంచానికి చూపించండి. సర్వశక్తివంతుడైన అల్లాహ్ కృపవల్ల, నిరంతరం త్యాగాలు చేస్తున్న అనేక మంది అహ్మదీలు ఉన్నారు. తమ ప్రాణాలను త్యాగం చేయాల్సిన అవసరం వచ్చినప్పుడు, వారు తమ ప్రాణాలను కూడ అర్పిస్తారు. మీ బంధువులలో కూడ కొందరు ఇలాంటి త్యాగాలు చేసినవారు ఉన్నారు. పాకిస్తాన్‌లో అహ్మదీలు ఎల్లప్పుడూ తమ ప్రాణాలను తమ అరచేతుల్లో పెట్టుకుని వాటిని త్యాగం చేయడానికి సిద్ధంగా ఉంటారు, అలాగే చేస్తూనే ఉన్నారు. పాకిస్తాన్‌లో ఈ త్యాగాల పరంపర కొనసాగుతోంది. నిశ్చయంగా, ఒక రోజు ఈ త్యాగాలు కూడా ఫలిస్తాయి, ఇన్‌షా అల్లాహ్. శత్రువు కూడా ఈ లోకంలోనే దాని బాధాకరమైన ముగింపును తప్పక చూస్తాడు, ఇన్‌షా అల్లాహ్. అయినప్పటికీ, ఒక విశ్వాసి నుండి ఆశించునదేమనగా, అతను ఎల్లప్పుడూ ఇలాంటి త్యాగాలు చేయడానికి సిద్ధంగా ఉండాలి."

**(అల్ ఫజల్ ఇంటర్నేషనల్, 29 నవంబర్-5 డిసెంబర్ 2013)**

### ఉపశాఖల వార్షిక సమావేశాలు ఖాదియాన్

సయ్యిద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారు మజ్లిస్ అన్సారుల్లాహ్, ఖుద్దాముల్ అహ్మదియ్య, అత్ఫాలుల్ అహ్మదియ్యకు చెందిన వార్షిక సమావేశాలు ఖాదియాన్ కొరకు 23, 24, 25 అక్టోబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. కావున నేటి నుండే ఈ పవిత్ర సమావేశాలలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సమావేశాలతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక సమావేశాలు అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక!

EDITOR : SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
e-mail:
akhbaarbadarteluguqdn@gmail.com
www.akhbarbadr.in

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly **BADAR** Qadian బదర్
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA తెలుగు వార పత్రిక

POSTAL REG NO GDP-38/2026-2028. Vol. 11. Thursday, 20-27 AUG 2026, Issue No : 34-35

ACT.MANAGER
ATHAR AHMAD SHAMIM
Mobile. : +91 98156 39670
e-mail
managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

**సయ్యదినా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా గారి ఆస్ట్రేలియా పర్యటన 2013.**

# బక్రీద్ పండుగ నమాజ్ మరియు ప్రసంగం:

**(16 అక్టోబర్ 2013 బుధవారం)**

హుజూర్ అన్వర్ (అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్) ఇలా అన్నారు: "ఈ సంపన్న దేశాలలో నివసిస్తున్న వారిలో సామర్థ్యం ఉన్న వారు జమాఅత్ వ్యవస్థ ద్వారా గానీ, స్వయంగా గానీ పాకిస్తాన్ మరియు ఇతర పేద దేశాలలో కూడా త్యాగం (కుర్బానీ) చేయాలి. తద్వారా అల్లాహ్ తఆలా ప్రసన్నతను పొందేవారిగా మారాలి. ఎందుకంటే కొందరికి నెలల తరబడి మాంసం తినే అవకాశం ఉండదు. కొన్నిసార్లు వారు పండుగ సందర్భంగా మాత్రమే మాంసం తింటారు లేదా నెల రోజుల తర్వాత ఎక్కడైనా మాంసం తింటారు.

హుజూర్ అన్వర్ ఇలా అన్నారు:"అల్లాహ్ తఆలా మనపై చేసిన ఉపకారం ఏమిటంటే, ఆయన ఈ త్యాగం యొక్క స్ఫూర్తికి కూడా ప్రతిఫలాన్ని ఇస్తున్నాడు, దాని బాహ్య రూపానికి కూడా ప్రతిఫలాన్ని ఇస్తున్నాడు. బాహ్యంగా చేసే త్యాగానికీ ప్రతిఫలం ఇస్తున్నాడు, దాని అంతర్గత స్ఫూర్తికి కూడ ప్రతిఫలం ఇస్తున్నాడు. అల్లాహ్ తఆలా 'బష్షిరిల్ ముహ్సినీన్' (సత్కార్యాలు చేసేవారికి శుభవార్తను అందించు) అని చెప్పినప్పుడు, ఈ ఒక్క సత్కార్యం కారణంగా అల్లాహ్ తనను 'ముహ్సినీన్'లో చేర్చాడని ఎవరూ భావించకూడదు. 'ముహ్సిన్' అంటే ఇతరులకు ప్రయోజనం చేకూర్చేవాడు అని కూడా అర్థం. 'ముహ్సిన్' అంటే సత్కార్యాల మార్గంలో నడిచేవాడు అని కూడా అర్థం. అలాగే 'ముహ్సిన్' అంటే జ్ఞానం కలవాడు అని కూడా అర్థం. కాబట్టి ఇక్కడ అల్లాహ్ తఆలా జ్ఞానం కలిగిన వారికి శుభవార్తను ఇస్తున్నాడు. వారు ఈ వాస్తవాన్ని తెలుసుకుంటారు: త్యాగం యొక్క అసలు స్ఫూర్తి తక్వా (దైవభీతి)యే, కేవలం బాహ్యంగా చేయునదియే త్యాగం కాదు. ఈ జ్ఞానం కారణంగా వారు సత్కార్యాలలో ముందుకు సాగేదరు, అలాగే ముందుకు సాగడానికి ప్రయత్నించెదరు. సత్కార్యాలలో అభివృద్ధి చెందడం వల్ల అల్లాహ్ తఆలా ప్రసన్నతకు సంబంధించిన శుభవార్తను పొందెదరు, మార్గదర్శకత్వాన్ని పొందదెదరు మరియు ఆయన అనుగ్రహాలలో భాగస్వాములు అయ్యేదరు."

హుజూర్ అన్వర్ ఇలా అన్నారు:"తక్వాపై ఆధారపడిన ఈ కార్యం ద్వారా అల్లాహ్ తఆలా ఒక దాసునికి అనుగ్రహిస్తున్నప్పుడు, అది అల్లాహ్ తఆలా చేసిన ఉపకారం అనబడుతుంది కాని, ఆ దాసుడు చేసిన ఉపకారం అనబడదు. ఒక నిజమైన విశ్వాసి ఎల్లప్పుడూ ఈ విషయాన్ని తన ముందుంచుకోవాలి. దైవభీతి లేకుండా ఏ సత్కార్యమూ నిజమైన సత్కార్యం కాజాలదు. అది కేవలం ప్రదర్శన మాత్రమే. ప్రదర్శన కోసం నమాజ్‌లు చేసేవారిని కూడా అల్లాహ్ తఆలా తీవ్రంగా హెచ్చరించాడు. ఆయన ఇలా అన్నాడు: 'ఫవైలు లిల్ ముసల్లీన్' అనగా, నమాజు చేసేవారికి కూడా వినాశనం ఉంది. ఒకవైపు అల్లాహ్ తఆలా ఇలా చెబుతున్నాడు: 'వమా ఖలక్తుల్ జిన్న వల్ ఇన్స ఇల్లా లియఅబుదూన్' అనగా, 'నేను జిన్నులను మరియు మానవులను కేవలం నా ఆరాధన కోసమే సృష్టించాను.' ఆరాధన యొక్క ఉన్నత స్థితిని గురించి దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మనకు తెలియజేస్తూ, ఆరాధన యొక్క సారాంశం నమాజ్ అని చెప్పారు. అంటే అన్ని ఆరాధనలలో నమాజే అత్యున్నత స్థానం కలిగినది. స్వయంగా తమ స్థితిని వివరిస్తూ, 'నమాజ్ నా కళ్లకు చల్లదనం' అని చెప్పారు. కాబట్టి మన ముందున్న దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి ఆదర్శప్రాయమైన సున్నత్ ప్రకారం, అట్టి స్ఫూర్తితో నిర్వహించే నమాజ్‌లే కళ్లకు చల్లదనాన్ని ఇచ్చేవి, ఆరాధనకు స్ఫూర్తిదాయకమైనవి, మన సృష్టి యొక్క ఉద్దేశాన్ని నెరవేర్చేవి అవుతాయి. కానీ మరోవైపు, అట్టి స్ఫూర్తి లేకుండా నమాజ్‌లు చేస్తూ, ప్రజల హక్కులను హరించివేసినచో, ఒకవైపు నమాజ్‌లు చేస్తూ, మరోవైపు ప్రజలపై అన్యాయం చేస్తుంటే, అలాంటి నమాజ్‌లు తక్వా లేకుండా చేసినవే అవుతాయి. అవే చివరికి వినాశనానికి కారణమవుతాయి. అందువల్ల మన త్యాగాలు మరియు మన ఆరాధనలు తక్వాను కోరుతున్నాయి. మన ప్రియతమ నాయకుడైన హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మన ముందుంచిన ఆదర్శ ప్రమాణాలను సాధించడానికి మనం ప్రయత్నించాలి."

హుజూర్ అన్వర్ ఇలా అన్నారు: "కాబట్టి మనం గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే, దైవభీతి (తక్వా) లేకుండా మన ఆరాధనలు ఉపయోగకరమైనవి కావు. మన త్యాగాలు కూడా ఉపయోగకరమైనవి కావు. మనలో ఈ స్ఫూర్తిని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉంది. అల్లాహ్ తఆలా ఇచ్చిన అన్ని ఆజ్ఞలను పరిశీలించి, వాటిపై ఆలోచించి, ఆ తర్వాత వాటిని ఆచరించడానికి మనం ప్రయత్నించాలి."

కాబట్టి ఈ పండుగను కూడా దైవభీతి (తక్వా)పై ఆధారపడిన పండుగగా మార్చుకోవడానికి మనం ప్రయత్నించాలి. అల్లాహ్ తఆలా శుభవార్తను అందించే, తన అనుగ్రహాలతో వారి కొంగులను నింపే ముహ్సినీన్ (సత్కార్యాలు చేసేవారి)లో చేరడానికి ప్రయత్నించాలి. మనం గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే, త్యాగం చేయడం, పుణ్యకార్యం చేయడం లేదా ముహ్సినీన్‌లో చేరడం అనేది ఒక్కరోజు పని కాదు. హజ్రత్ ఇస్మాయీల్ అలైహిస్సలాం తన తండ్రి హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాంకు ఇలా చెప్పినప్పుడు: **యా అబతి ఇఫ్అల్ మా తుఅమరు** అనగా "ఓ నా తండ్రీ! దేవుడు నీకు ఇచ్చిన ఆజ్ఞను మీరు నెరవేర్చండి." అది కేవలం తన మెడపై కత్తి పెట్టడానికి అంగీకరించడం మాత్రమే కాదు. ఆ కాలంలో మానవుల ప్రాణాలను బలి ఇచ్చే ఆచారం ఉండేది. ఆ కాలపు పరిస్థితులను బట్టి చూస్తే ఇది అసాధారణమైన విషయం కాదు. అలా చేసినచో ఆ కాలపు ప్రజలు ఎక్కువగా "ఇబ్రాహీం తన ముద్దుల కుమారుడిని అల్లాహ్ ఆజ్ఞ మేరకు బలి ఇచ్చాడు." అని మాత్రమే చెప్పుకునేవారు, ఆ తర్వాత ప్రపంచం దానిని మరచిపోయేది. కానీ ఆ తండ్రీ కొడుకులకు దైవభీతి యొక్క నిజమైన అవగాహన ఉండేది. అందుకే స్వప్నం గురించి తండ్రి తన కుమారుని ఉద్దేశం తెలుసుకున్నప్పుడు, దైవభీతి యొక్క నిజమైన భావాన్ని గ్రహించిన కుమారుడు కేవలం, "ఓ నాన్నా! నేను సిద్ధంగా ఉన్నాను, నా మెడపై కత్తి పెట్టండి" అని చెప్పలేదు. బదులుగా ఇలా అన్నాడు: **యా అబతి ఇఫ్అల్ మా తుఅమరు** అనగా, "ఓ నా తండ్రీ! నా విషయంలో నీకు ఏ ఆజ్ఞ ఇవ్వబడిందో దానిని నెరవేర్చండి." కత్తి పెట్టమని ఆజ్ఞ ఉంటే కత్తి పెట్టండి. నా నుండి త్యాగాలను నిరంతరం తీసుకుంటూ ఉండమని ఆజ్ఞ ఉంటే, అందుకు కూడా నేను సిద్ధంగా ఉన్నాను. నేను చెప్పినట్లుగా, కత్తి వేయించుకుని ప్రాణత్యాగం చేసిన వారి ఉదాహరణలు ఉన్నాయి. ఆ కాలంలో అలాంటి బలులు ఇవ్వబడేవి. కానీ కుమారుడు ఇచ్చిన సమాధానం ఏమిటంటే: నేను అల్లాహ్ తఆలా కోసం త్యాగాల పరంపరను కొనసాగించడానికి కూడా సిద్ధంగా ఉన్నాను. ఆ తర్వాత తండ్రీ కొడుకులు ఇద్దరూ దీనికి సంతోషంగా సిద్ధపడినప్పటికీ, అల్లాహ్ తఆలా హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాంకు ఇలా తెలియజేశాడు: "నేను ఒక్కసారిగా చేసే త్యాగాన్ని కోరడం లేదు. నేను నిరంతరం చేసే త్యాగాలను కోరుతున్నాను. ఆ త్యాగాల పరంపర కొనసాగుతూ ఉండాలి." ఆ తరువాత నుండి **వాదియే ఘైర్ జీ జరఅ** (పంటలు పండని నిర్జన ప్రదేశం)లో ఈ త్యాగాల పరంపర కొనసాగుతుంది.

హుజూర్ అన్వర్ ఇలా అన్నారు: "అల్లాహ్ సంతోషాన్ని పొందడం కోసం నిరంతరం త్యాగాలు చేయడమే ధర్మనిష్ఠ (తక్వా) యొక్క అర్థం. అల్లాహ్ ఆజ్ఞలను పాటిస్తూ, మీ ధర్మనిష్ఠ స్థాయిని నిరంతరం పెంచుకోవడమే దైవభీతి. అల్లాహ్ ప్రీతినే మీ లక్ష్యయసాధనంగా చేసుకోండి. ఈ రోజు పండుగ రోజు, ఇస్మాయీలీయ త్యాగం యొక్క లక్షణాలను మనలో పెంపొందించడానికి ఈ రోజు వచ్చింది.

**(15వ పేజిలో చదవండి)**

### 131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్ కొరకు 25, 26,27 డిశంబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. ఇప్పటి నుండే జమాఅత్ సభ్యులు ఈ పవిత్ర సభలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సభతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక మహాసభ అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక!

**( నజారత్ ఇస్లాహి ఇర్షాద్ దక్షిణ భారత దేశపు ఖాదియాన్ )**

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz